www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 268 | బుధవారం 21-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

39 మందిని అప్పుడే చంపేశారు


విలపిస్తున్న బంధువులు

- భారత బందీలపై ఐసిస్ ఘాతుకం
- పార్లమెంట్‌లో సుష్మా ప్రకటన

న్యూఢిల్లీ : ఇరాక్‌లో భారతీయులు అపహరణకు గురైన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రవాద సంస్థ 2014లో అపహరించిన 39 మంది భారత పౌరులను చంపేసిందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం ప్రకటించారు. మోసుల్‌లో వారిని పూడ్చి పెట్టిన చోటును రాడార్‌లు కనిపెట్టాయని, భౌతికకాయాలను బయటకు తీసే ప్రయత్నం చేయగా అవి కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు వివరించారు. 'సుదీర్ఘ విచారణ అనంతరం మోసుల్ నుంచి అపహరణకు గురై ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ చేతిలో బందీలుగా ఉన్న 39 మంది భారతీయులు మృతి చెందినట్లు వెల్లడయ్యింది. డీఎన్‌ఏ పరీక్షల నిమిత్తం వారి భౌతికకాయాలను బాగ్దాద్‌కు పంపించారు. వీరిలో 38 మంది డీఎన్‌ఏ వారి బంధువుల - మిగతా 2 లో

ఆప్కో కక్కుర్తి

విశాలాంధ్ర బ్యూరో- విజయనగరం :



- విద్యార్థులకు నేటికీ అందని యూనిఫారం
- కొద్ది రోజుల్లో ముగియనున్న విద్యాసంవత్సరం
- రూ.120 కోట్ల వ్యవహారంలో ఆరోపణల వెల్లువ

దొరికిన అవకాశాన్ని అందిపుచ్చుకొని కాసులు వెనకేసుకోవడం ఆప్కోకు అలవాటుగా మారింది. ఈ సంస్థ కక్కుర్తి ఫలితంగా ఇప్పుడు విద్యార్థులు అల్లల్లాడాల్సిన పరిస్థితి దాపురించింది. మరో నెల రోజుల్లో విద్యాసంవత్సరం ముగిసిపోనున్న తరుణంలో కూడా రాష్ట్రవ్యాప్తంగా నేటికీ బడి పిల్లలకు ఏకరూప దుస్తులు అందనేలేదు. ఇప్పటికీ దాదాపు అన్ని జిల్లాల్లో ఏకరూప దుస్తులు 50 శాతం మాత్రమే సరఫరా అయ్యాయంటే, ఆప్కో పని తీరు ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఏటా రాజీవ్ విద్యామిషన్ ద్వారా ప్రభుత్వం రెండు జతల యూనిఫారాలను ఉచితంగా సరఫరా చేస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా దీనికి కావాల్సిన వస్త్రాన్ని ఆప్కోయే సరఫరా చేస్తోంది. దీనిలో వచ్చే కమీషన్ ద్వారా ఆప్కోకు కొంత ఆదాయం సమకూరుతోంది. ఇలా వచ్చిన వస్త్రాన్ని ఆయా జిల్లాల్లో ఆర్‌వీఎం అవసరానికి తగ్గట్టుగా, విద్యార్థులకు సరిపడేలా యూనిఫారాలు కుట్టించి పంపిణీ చేస్తోంది. ప్రతీ ఏటా ఇదో తంతులా నడుస్తుండగా, ఈ ఏడాది మాత్రం పరిస్థితి మరింత దిగజారింది. గతానికి భిన్నంగా ఈ సంవత్సరం ఆర్‌వీఎంకు ఆప్కో వస్త్రాన్ని సరఫరా చేయడంతోపాటుగా కుట్టించే బాధ్యతను సైతం తీసుకుంది. ప్రభుత్వస్థాయిలో తీవ్ర వత్తిడి తెచ్చి కుట్టు కాంట్రాక్టును సైతం దక్కించుకున్న ఆప్కో, తీసుకున్న పనిని నేటికీ సక్రమంగా నెరవేర్చలేదు. ఏ జిల్లాల్లో కూడా నేటికీ పూర్తిస్థాయిలో యూనిఫారాలు సరఫరా కాలేదంటే, విద్యా శాఖ ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. చివరికు విద్యా శాఖా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖ జిల్లాలో కూడా యూనిఫారాల సరఫరా ఇప్పటికీ కేవలం 75 శాతం మాత్రమే పూర్తయింది. కుట్టు కాంట్రాక్టును దక్కించుకున్న ఆప్కో, ఆ బట్టలు కుట్టే పనిని కనీసం స్థానికంగా జిల్లాల్లోనే టైలర్లకు అప్పగించి ఉన్నా సరిపోయేది. అది కూడా చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనిఫారాలను రెండు, మూడు చోట్ల కుట్టించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ పని నేటికీ సక్రమంగా జరగలేదు. ఆప్కో కక్కుర్తి ఫలితంగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు.

వాస్తవానికి యూనిఫారాల సరఫరా వ్యవహారం ఆషామాషీ కాదు. ఏకంగా రూ.120 కోట్ల కాంట్రాక్టు ఇది. ఈ వ్యవహారంపైనే ఎప్పటి నుంచో పలు ఆరోపణలు ఉండగా, ఈ ఏడాది పరిస్థితి మరింత దిగజారింది. ఒక్కో విద్యార్థికి ఒక్కో యూనిఫారానికి ప్రభుత్వం రూ.200 - మిగతా 2 లో

పథకాలు సరే.. నిధులేవీ..?



- పార్లమెంటరీ కమిటీ నివేదిక
- రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలి
- ప్రధాని కలలు కల్లలేనా..

విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి : ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనే కాదు...తాను ప్రారంభించిన జాతీయస్థాయి ప్రధానమైన పలు పథకాలకు తగినన్ని నిధులుఇవ్వడంలోనూ ప్రధాని నరేంద్ర మోడీ విఫలమయ్యారు. నిధులులేక ఆయా పథకాలు ముందుకుసాగడంలేదు. నిధుల విడుదల, ఖర్చు సమస్యే అయింది. ఇది ఎవరో చెప్పిన మాటకాదు..పార్లమెంటరీ కమిటీ నివేదిక ఈ అంశాలను ప్రస్తావించింది. పథకాల ప్రకటనలకు, వాటి ప్రచారానికి కోట్ల రూపాయలు ఖర్చుచేసారుకానీ, పథకాల పూర్తికి ప్రకటించిన గడువు లక్ష్యాలను సాధించే పరిస్థితిలేదు. తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే ఇందుకు కారణం. పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికలో పొందుపరచిన వివరాలు సక్రమంగా లేవని పలువురు మంత్రులు సమర్ధించుకుంటున్నారు. పట్టణాలు, నగరాల అభివృద్ధికి ఆరు జాతీయ స్థాయి మౌలిక సదుపాయాల పథకాలను ప్రకటించారు. వీటికి కేటాయించిన నిధులలో సగటున 21శాతం మాత్రమే ఖర్చు చేసారు. మౌలిక సదుపాయాలకు రూ.560కోట్ల రూపాయలు కేటాయించారు. అయితే 120 కోట్లు మాత్రమే ఖర్చు చేసారు. ఎంతో ఆర్భాటంగా, అట్టహాసంగా చెప్పుకున్న స్మార్ట్ నగరాల పథకానికి రూ.150కోట్లు కేటాయించినప్పటికీ రూ.2.8 కోట్లు మాత్రమే ఖర్చు చేసారు. అంటే కేటాయించిన నిధులలో 1.8శాతమే ఖర్చు చేసారని కమిటీ తెలియజేసింది. పట్టణ, నగర - మిగతా 11 లో

ప్రత్యేక హోదా డిమాండు సాధనకు టీడీపీ, వైసీపీ పార్టీలు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస విషయం చర్చకు రాకుండా కేంద్రంలోని బీజేపీ సర్కారు పకడ్బందీ ప్లాన్ అమలు చేస్తున్నది. ఇందుకు పావులుగా అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లను వినియోగించుకుంటుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవిశ్వాసం నోటీసులను చదవడానికి ప్రయత్నించినప్పుడల్లా రెండు పార్టీలు అల్లరి చేస్తూ అడ్డుపడుతున్నాయి. లోక్‌సభలో మూడు రోజులుగా ఇదే తంతు. సభ సజావుగా సాగనిదే చర్చ అసాధ్యమని స్పీకర్ తప్పించుకుంటూ సర్కారు డ్రామాను రక్తి కట్టిస్తున్నది. మంగళవారం మళ్లీ టీడీపీ, వైసీపీలు నోటీసులు ఇచ్చాయని, వాటిని స్పీకర్ చదువుతుండగా మరలా అదే అల్లరి, ఇలా అయితే సభను నడుపలేమంటూ స్పీకర్ ఏకంగా సభను 23వ తేదీ వరకు వాయిదా వేశారు. అవిశ్వాసం విషయమై సభలో వినిపించకూడదన్న కృత నిశ్చయంతో ఉన్న పాలక పార్టీ అందుకు వ్యూహ రచన చేసుకున్నది.

రచ్చ బీజేపీ ఎత్తుగడే..


- చర్చకు రాని అవిశ్వాసం
- అడ్డుపడుతున్న రెండు పార్టీలు
- సభ సజావుగా నడవనిదే అవిశ్వాసంపై చర్చ అసాధ్యమన్న స్పీకర్
- ప్రత్యేక హోదాపై స్పందించని కేంద్ర సర్కారు
- 23వ తేదీకి పార్లమెంట్ నిరవధిక వాయిదా



విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంపై లోక్‌సభలో వరుసగా మూడో రోజు కూడా అవిశ్వాస తీర్మానాల పర్వం కొనసాగింది. లోక్‌సభ పని తీరులో ఎలాంటి మార్పు రాలేదు. వైసీపీ, టీడీపీలు కేంద్రంపై పెట్టిన అవిశ్వాస తీర్మానాలు చర్చకు రాలేదు. కేంద్రానికి రక్షణ కవచంగా అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్ పార్టీలు నిలవడంతో ప్రతిపక్ష పార్టీలు - మిగతా 2 లో

మీకు బాధ్యత లేదా?

- ఏపీ అంటే మీకు పడదా ?
- రాష్ట్ర బీజేపీ నేతలపై మండిపడ్డ సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈ రాష్ట్రమంటే మీకు పడదా ? కేంద్రాన్ని విభజన హామీలపై నిలదీయాల్సిన బాధ్యత మీపై లేదా ? మీరు ఏవిధంగా కేంద్రానికి మద్దతిస్తారు ? రాష్ట్ర హక్కుల కోసం మేం పోరాడుతుంటే ఒక్కొక్కరిని ఎగదోసి మాపై దాడికి పంపిస్తారా? అంటూ సీఎం బీజేపీ నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీలో మంగళవారం పారిశ్రామికాభివృద్ధి అంశంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ విభజన చట్టం హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవహార శైలిపై మండిపడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా - మిగతా 11 లో

జీడీపీకి బ్యాంక్ స్కామ్‌ల ఎఫెక్ట్ 12లో

గోల్డ్‌మ్యాన్ శ్యాచెస్ సంచలన నివేదిక

ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అధికారుల తక్షణ అరెస్టులకు సుప్రీం నో 9లో

ఇదీ లోకం!



రేపు హైవేల దిగ్బంధం

జయప్రదం చేయాలని సీపీఐ పిలుపు



సమావేశంలో పాల్గొన్న రామకృష్ణ, రామాంజనేయులు, ఈడ్పుగంటి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీకి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో జరుగనున్న జాతీయ రహదారుల దిగ్బంధన కార్యక్రమాలు జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. కె.రామాంజనేయులు అధ్యక్షతన మంగళవారం స్థానిక దాసరి నాగభూషణరావు భవన్‌లో రాష్ట్రకార్యవర్గ సమావేశంలో సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు పాల్గొని తొలుత అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలను గురించి వివరించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రత్యేక హోదా ఉద్యమం తదితర అంశాలపై కార్యకలాపాల నివేదిక సమర్పించి, భవిష్యత్ కర్తవ్యాలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం సాగే పోరాటం, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం సమావేశం ఈ క్రింది తీర్మానాన్ని ఆమోదించింది. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపీకి ప్రకటించిన ప్రత్యేక హోదా, విభజన హామీల - మిగతా 2 లో


ఇళయరాజాకు పద్మవిభూషణ్ పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి

అమెరికాలో కాల్పుల కలకలం

హైస్కూల్‌లో తుపాకీతో తెగబడ్డ దుండగుడు



న్యూయార్క్ : అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం చెలరేగింది. మేరిల్యాండ్‌లోని ఓ హైస్కూల్‌లో దుండగుడు కాల్పులకు తెగబడ్డాడని, అనేకమంది ఈ కాల్పుల బారిన పడ్డారని సెయింట్ మేరీస్ షెరీఫ్ చెప్పినట్టు మీడియా తెలియ చేసింది. స్కూల్ అధికారులు ఈ కాల్పులను ధృవీకరించారు. ప్రస్తుతం ఈ క్యాంపస్‌ను లాక్‌డౌన్ చేశారు. అయితే కాల్పుల బారిన పడ్డ వారి పరిస్థితి ఎలా ఉందో ఇంకా తెలియరాలేదని ఏబీసీ న్యూస్ రిపోర్టు చేసింది. దక్షిణ వాషింగ్టన్‌కు 70 మైళ్ల దూరంలో ఉన్న సెయింట్ మేరీస్ కంట్రీ గ్రేట్ మిల్స్ హైస్కూల్‌లో ఉదయం 8 గంటలకు దుండగుడు ఈ కాల్పులకు తెగబడ్డాడు. షెరిఫ్ ఆఫీసు ఈ ఘటనను ధృవీకరించింది. ఇటీవల అమెరికా స్కూళ్లు కాల్పులతో మోతమోగుతున్నాయి. ఫ్లోరిడాలోని - మిగతా 11 లో

టెట్ ఎఫెక్ట్..!

57 శాతం అవుట్..

- డీఎస్సీకి 2 లక్షల మంది దూరం..
- ఏపీపీఎస్సీకి రాత పరీక్ష అప్పగింత..!
- అభ్యర్థుల్లో తీవ్ర వ్యతిరేకత



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఉపాధ్యాయ పోస్టులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులపై టెట్ ఫలితాలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి.రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవల విడుదల చేసిన ఏపీ టెట్-2017 ఫలితాల్లో 57శాతం మంది అనర్హులయ్యారు.వారంతా త్వరలో విడుదల చేయబోయే డీఎస్సీ పరీక్షకు 2లక్షల మంది దూరం కానున్నారు.కొత్త డీఎస్సీకి ప్రస్తుత, గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు దాదాపు రెండున్నర లక్షల వరకూ దరఖాస్తు చేసే అవకాశముంది.ఒకప్పుడు జిల్లా స్థాయిలో డీఎస్సీ రాత పరీక్ష, ఎంపిక ప్రక్రియలను నిర్వహించేవారు. మారుతున్న పోటీ తత్వాన్ని దృష్టిలో వుంచుకుని ఈ విడత ఏపీపీఎస్సీకి రాత పరీక్షను పాఠశాల విద్యాశాఖ అప్పగించనుంది. దీంతో టెట్ అర్హత సాధించిన వారంతా ఆందోళన చెందుతున్నారు.టెట్ పేపర్-1,2,3 పరీక్షలకు మొత్తంగా 4,14,120 మంది(92.67శాతం) అభ్యర్థులు పరీక్ష రాశారు.ఇందులో 1,94,086 మంది అభ్యర్థులు(43శాతం) అర్హత సాధించారు. మిగిలిన వారంతా(గతంలో అర్హత సాధించిన అభ్యర్థుల మినహా) డీఎస్సీకి ఈ విడత డీఎస్సీకి దూరమవుతున్నారు.టెట్ మూడు పేపర్లలోనూ ఆశించిన స్థాయిలో అభ్యర్థులు - మిగతా 2 లో

విశాలాంధ్ర ప్రపంచం

పోలెండ్ ప్రధానితో జర్మనీ నేత మర్కెల్ భేటీ



వార్సా : జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మర్కెల్ ప్రస్తుతం పోలెండులో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె పోలెండ్ ప్రధానమంత్రి మాటెజ్‌మొరావికీతో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య సహకారం యూరోపియన్ యూనియన్ ఐక్యతకు దోహదం చేస్తుందని పోలెండ్ ప్రధాని అన్నారు. ఇరువురు నేతలు వివిధ అంశాలపై చర్చలు జరిపిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఐరోపాలో భాగంగావున్న పోలెండ్, జర్మనీ మధ్య సన్నిహిత సహకారం అవసరమని తాను విశ్వసిస్తున్నట్లు పోలెండ్ ప్రధాని చెప్పారు. 2019 మార్చి తరువాత బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలిగాక కొత్త ఎజెండా రూపొందించుకోవలసి ఉంటుందని రెండు దేశాల నేతలు భావించారు. కొత్త ఆర్థిక ప్రణాళికను, ఉమ్మడి డిజిటల్, భద్రత, పారిశ్రామిక విధానాన్ని రూపొందించుకోవలసి ఉంటుందని మొరావికి చెప్పారు. వీరిరువురూ ద్వైపాక్షిక సహకారం యూరోపియన్ యూనియన్ బడ్జెట్, ఇంధన భద్రత, వలసల సంక్షోభం తదితర అంశాలను చర్చించారు. మర్కెల్ మరోసారి ఛాన్సలర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆమెను మొరావికి అభినందించారు. తమవి ఇరుగుపొరుగు దేశాలని తమ మధ్య స్నేహసంబంధాలు మరింత ప్రగాఢమవుతాయని మర్కెల్ చెప్పారు. యూరోపియన్ యూనియన్‌లో ప్రవేశించే శరణార్థుల అవసరాలు తీర్చేందుకు పోలెండుకూడా సహకరిస్తున్నదని మర్కెల్ చెప్పారు.

వెనిజులా డిజిటల్ కరెన్సీపై ట్రంప్ నిషేధం

వాషింగ్టన్ : వెనిజులా డిజిటల్ కరెన్సీతో ఎటువంటి లావాదేవీలను నిర్వహించరాదని నిషేధం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వును జారీ చేశారు. దీనివల్ల అమెరికా ఆర్థిక మార్కెట్లు వెనిజులాకు అందుబాటులో లేకుండా పోతుంది. అన్ని కరెన్సీ లావాదేవీలను నిషేధించారు. డిజిటల్ కరెన్సీ, నాణాలు, డిజిటల్ టోకెన్లకు కూడా నిషేధిస్తున్నట్లు వైట్‌హౌస్ ఒక ప్రకటన చేసింది. అమెరికా విధించిన ఆంక్షలనుంచి బయటపడేందుకుగాను ఇటీవల వెనిజులలో మదురో ప్రభుత్వం డిజిటల్ కరెన్సీని ప్రవేశపెట్టింది.



చైనా విభజన యత్నాలు విఫలం తథ్యం

అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టీకరణ

బీజింగ్ : చైనాను విభజించాలనే ప్రయత్నాలు విఫలంకాక తప్పదని దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టం చేశారు. పార్లమెంటు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల సమైక్యతకు ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా ఉమ్మడిగా పనిచేయగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తైవాన్, హాంగ్‌కాంగ్‌లను దేశంనుంచి విడగొట్టేందుకు ప్రయత్నించే శక్తులకు ఆయన గట్టి హెచ్చరిక చేశారు. దేశ అభివృద్ధిపట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించబోమని ఆయన అన్నారు. జిన్‌పింగ్ రెండవసారి అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత పార్లమెంటులో మొదటిసారి ప్రసంగించారు. చట్టసభ సభ్యులంతా ప్రజాప్రయోజనాల కోసం పనిచేయాలని కోరారు. సోషలిజం మాత్రమే చైనాను కాపాడగలదని జిన్‌పింగ్ అన్నారు. మన శత్రువులపైన పోరాడే స్ఫూర్తి చైనా ప్రజలకు ఉండదని జిన్‌పింగ్ చెప్పారు. దేశ ప్రధాని లీకెకియాంగ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్యానికి తమ సహకారం తప్పనిసరిగా ఉంటుందని అందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఇతర దేశాలకు తెరిచే ఉంచుతామని ప్రధాని అన్నారు. దేశీయ, విదేశీ సంస్థలు తమ పెట్టుబడులను పెట్టవచ్చునని న్యాయమైన నిబంధనలను అనుసరించి దేశంలోగల భారీ మార్కెట్లో పోటీపడవచ్చునని ఆయన సూచించారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఐరోపా, చైనా, వస్తువుల దిగుమతులపై సుంకాలు విధిస్తామని చెబుతూ స్వీయరక్షణ వాదాన్ని ముందుకు తెచ్చిన నేపథ్యంలో చైనా ప్రపంచ వాణిజ్యానికి సహకరిస్తానని ప్రకటించింది.

అమెరికా సైనిక స్థావరాలను ఖాళీ చేయాలి

టర్కీ కమ్యూనిస్టు పార్టీ ప్రచార ఉద్యమం



అంకారా : అమెరికా తన సైనిక స్థావరాలను ఖాళీ చేయాలని, టర్కీ నాటో కూటమితో సంబంధాలను వదులుకోవాలని టర్కీ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తూ ప్రచారోద్యమాన్ని ప్రారంభించింది. సామ్రాజ్యవాదంపై చిత్తశుద్ధితో పోరాటంచేసే వారంతా ఈ ఉద్యమంలో పాల్గొనవలసిందిగా కమ్యూనిస్టు పార్టీ కోరింది. టర్కీ పాలక జస్టిస్ & డెవలప్‌మెంట్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. టర్కీలో ఉన్న సైనిక స్థావరాలను అమెరికా తక్షణం వదిలివెళ్లిపోవాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ వారపత్రిక బోయన్‌ఎగ్మిలో ఈ మేరకు పార్టీ ఒక ప్రకటన ప్రచురించింది. గత రెండు దశాబ్దాలుగా టర్కీలో సామ్రాజ్య వాదులు దేశప్రజలకు హానికరంగా తయారయ్యారు. అమెరికా ఆమోదంతోనే టర్కీ సైనిక దళాలను సమీకరించి జర్మనీకి పంపుతున్నది. అమెరికా, జర్మనీ, బ్రిటన్ తదితర దేశాలపట్ల టర్కీ పాలకపార్టీ తన విశ్వాసాన్ని ప్రకటించింది. ఇక్కడ అమెరికా సైనిక స్థావరాలకు అవకాశం కల్పించింది. సామ్రాజ్యవాదాన్ని విస్తరించేందుకు ప్రతీఘాత బూర్జువాశక్తులు పూనుకుంటున్నాయి. నయవంచనతో కూడిన ఈ దేశభక్తుల అసలు స్వరూపాన్ని బయటపెట్టేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉన్నారు. సామ్రాజ్యవాద దోపిడీని అంతం చేసేందుకు పోరాటమే మార్గం. టర్కీలో సామ్రాజ్యవాదుల స్థావరాలను దేశప్రజలే ఖాళీ చేయించాలి. టర్కీ కమ్యూనిస్టు పార్టీతో పాటు కమ్యూనిస్టు యూత్ దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించింది. నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.

వాణిజ్య ఉద్రిక్తతలు మంచిది కాదు

అమెరికాను హెచ్చరించిన డబ్ల్యూటీఓ



న్యూఢిల్లీ : వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం మంచిది కాదని ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యుటిఒ) హెచ్చరించింది. ఈ సంస్థలోని 40 దేశాలు సమావేశం కానుండగా అమెరికా సుంకాల విధింపు నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ హెచ్చరిక చేసింది. విపత్తు ముంచుకురాకముందే అమెరికా తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేందుకు సభ్యదేశాలన్నీ కలిసి కృషి చేయాలని ఈ సంస్థ పిలుపునిచ్చింది. చట్ట ఆధారిత ప్రపంచ వాణిజ్య వ్యవస్థకు సభ్యదేశాలన్నీ తమ తోడ్పాటు అందిస్తూ ప్రకటన చేసే అవకాశం వుంది. స్వీయరక్షణవాదంపైన ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. స్టీలు, అల్యూమినం వస్తువుల దిగుమతిపై సుంకాలను పెంచాలని ట్రంప్ చేసిన నిర్ణయాన్ని డబ్ల్యుటిఒ సమావేశం లోతుగా చర్చించే అవకాశం ఉంది. సంస్థ డైరెక్టర్ జనరల్ రాబర్ట్ అజివిడొ మాట్లాడుతూ స్వీయరక్షణ చర్యలవల్ల ఎగుమతి ఆర్డర్లు గణనీయంగా పడిపోతాయని దీనివల్ల హాని జరుగుతుందని అన్నారు. సభ్యదేశాల అధికారులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. భారతదేశం ఆహారభద్రతపైన ప్రణాళికను రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ అంశాన్ని భారతదేశం పదేపదే డిమాండ్ చేస్తున్నప్పటికీ అమెరికా ఎలాంటి చర్చలకు ముందుకురాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆయన అన్నారు. డబ్ల్యుటిఒ ఏర్పడి 23 ఏళ్లు గడిచింది. ఆయా దేశాల మంత్రుల ఇష్టాగోష్టి సమావేశం జరగనుంది. సుంకాల పెంపును ప్రకటించిన అమెరికాకు ఇప్పటికే 17 దేశాలు తమ నిరసన వ్యక్తం చేశాయి.

పోలీసు కస్టడీలో సర్కోజీ



పారిస్ : ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికొలస్ సర్కోజీని మంగళవారం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. 2007లో లిబియా నుంచి అందుకున్న నిధులను సర్కోజీ దుర్వినియోపరచి ఎన్నికల ప్రచారానికి వినియోగించుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. పోలీసులు ఆయనను కోర్టులో హాజరుపరిచారు. సర్కోజీపై విచారణను 2013లోనే ప్రారంభించారు. ఆనాటి లిబియా నాయకుడు మొహమ్మద్ గడాఫీనుంచి అక్రమంగా నిధులను సర్కోజీ పొందినట్టుగా కూడా ఆరోపణలున్నాయి. సర్కోజీ స్నేహితుడు, మాజీమంత్రి బ్రైస్‌హోర్ట్‌ఫెక్స్‌ను కూడా కోర్టులో న్యాయమూర్తులు ప్రశ్నించారు. అయితే తాము ఎలాంటి నిధులను అక్రమంగా పొందలేదని వారిరువురూ చెప్పారు.

అఫ్రిన్‌లో టర్కీ దాడులను ఆపాలి

లండన్‌లో హక్కుల కార్యకర్తల నిరసన ఉద్యమం

లండన్ : సిరియా ఉత్తరప్రాంతంలోని అఫ్రిన్‌లో టర్కీ తన దాడులను, అమాయకుల ఊచకోతలను తక్షణం నిలిపివేయాలని కోరుతూ ఇక్కడ డౌనింగ్ స్ట్రీట్‌లో కుర్దిష్ హక్కుల కార్యకర్తలు 5 రోజుల నిరసన ఉద్యమాన్ని చేపట్టారు. టర్కీ యుద్ధనేరాలకు పాల్పడుతున్నదని తక్షణం ఆదేశాన్ని బ్రిటన్ ప్రభుత్వం పూనుకొని నిలువరించాలని కార్యకర్తలు కోరారు. బ్రిటన్, టర్కీ, కొన్ని కుర్దిష్ సంస్థలు కలిసి అఫ్రిన్‌ను తమ యుద్ధవేదిక చేసుకున్నాయని, కార్యకర్తలు నిరసించారు. వీరు సోమవారం రాత్రినుంచే తమ నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరసన ఉద్యమం సందర్భంగా కార్యకర్తలు టర్కీ చర్యలను వివరిస్తూ సమాచారాన్ని ప్రజలకు అందజేస్తారు. తమ ఉద్యమానికి సంఘీభావం తెలియజేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అఫ్రిన్‌పై దాడులను టర్కీ సైన్యం జనవరి 29న ప్రారంభించింది. ఆనాటినుంచి 350 మంది పౌరులు చనిపోయారు. వందలాదిమంది గాయపడ్డారు. చివరకు శరణార్థుల శిబిరాలపైన కూడా దాడులు జరిపారు. ఈ దాడుల నేపథ్యంలో దాదాపు 8 లక్షలమందికిపైగా తమ ఇళ్లను వదిలిపెట్టి ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్లిపోయారు. ఈ విషయాలన్నీ తెలిసినప్పటికీ బ్రిటన్‌గాని, ఇతర అంతర్జాతీయ సమాజంకాని మౌనంగా ఉండటంపై కార్యకర్తలు ఆగ్రహం ప్రకటిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని తాను పూర్తిగా తుడిచిపెడతానని టర్కీ అధ్యక్షుడు ఎర్డొగన్ పదేపదే ప్రకటించాడు. ఇప్పటికీ టర్కీ సైన్యానికే తమ మద్దతు ఉంటుందని బ్రిటన్ విదేశాంగమంత్రి బోరిస్‌జాన్సన్ ప్రకటించారు.

టెట్ ఎఫెక్ట్..!

(మొదటిపేజీ తరువాయి)

అర్హత పొందలేదు.

అభ్యర్థుల్లో 'ఏపీపీఎస్సీ' గుబులు..

ఏపీలో ఉపాధ్యాయ నియామక పరీక్షలు గ్రూప్ పరీక్షల తరహాగా మారిపోయాయి.తొలిసారిగా డీఎస్సీ రాత పరీక్షను ఏపీపీఎస్సీకి అప్పగించాలనే ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత నెలకొంది. డీఎస్సీ పరీక్షల ప్రశ్నాపత్రాల సరళి ఏపీపీఎస్సీ రాత పరీక్షల స్థాయిలో వుంటుందనే అపోహలున్నాయి. దీంతో పరీక్షలకు సిలబస్‌ను మించి అధికంగా చదవాలని అభ్యర్థులకు నిపుణులు సూచిస్తున్నారు.డీఎస్సీ పోస్టులు రాసేందుకు అర్హత సాధించాలంటే..తొలుత రెండేళ్ల బీఈడీ, డీఎడ్ కోర్సులను ఉపాధ్యాయులు అభ్యసించాలి.లాంగ్వేజీ పండిట్లు, పీఈటీ కోర్సులకూ ఏడాదిపాటు శిక్షణ తీసుకోవాలి. ఈ కోర్సులు పూర్తి చేసిన వారంతా ఏపీ టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించాలి. ఏపీ టెట్ పరీక్షను రాసిన అభ్యర్థుల్లో 57శాతం మంది అభ్యర్థులు అనర్హత సాధించడంపై సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. వారిలో 5 శాతం నుంచి 10 శాతం వరకూ గతంలో టెట్ అర్హత పొంది, స్కోరింగ్ మార్కుల కోసం రాసిన వారున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన విద్యాహక్కు చట్టం ఆధారంగా డీఎస్సీ రాయాలంటే..సంబంధిత విభాగాల సబ్జెక్టుల్లో టెట్ అర్హత మార్కులను తప్పనిసరి చేసింది. ఒక సారి టెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులకు ఏడేళ్ల వరకూ అది అమలులో వుంటుంది.2014లో టెట్ కమ్ టీఆర్టీ పద్ధతిలో డీఎస్సీ నిర్వహించారు.నాలుగేళ్ల తర్వాత డీఎస్సీ ప్రక్రియకు ప్రభుత్వం సిద్ధమైంది. దాదాపు 10వేల పోస్టులకుపైగా ఆర్థికశాఖ ఆమోదానికిగాను పాఠశాల విద్యాశాఖ దస్త్రాన్ని పంపింది. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చాక డీఎస్సీ నోటిఫికేషన్ను ప్రభుత్వం విడుదల చేయనుంది.మరో 1200 మోడల్ స్కూళ్లకూ పోస్టులు రానున్నాయి.టెట్, డీఎస్సీలకు వేర్వేరుగా ఒక విద్యార్థి ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకోవాలంటే రూ.20వేల నుంచి రూ.30వరకూ ఖర్చవుతోంది.టెట్‌లో 20 మార్కుల వెయిటేజీ కేటాయించడంతో..ఈ పరీక్షకు వేలాది మంది పోటీపడ్డారు. కొత్తవారితోపాటు గతంలో టెట్ అర్హత సాధించిన వారు సైతం మార్కుల స్కోరింగ్ కోసం పరీక్షలు రాశారు. వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ను విడుదల చేస్తామంటూ మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు.దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు డీఎస్సీ శిక్షణలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

రచ్చ బీజేపీ ఎత్తుగడే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన తీర్మానాలు బుట్టదాఖలయ్యాయి. సభ సజావుగా నడవనిదే అవిశ్వాస తీర్మానాలను చర్చకు తీసుకురాలేనని స్పీకర్ సుమిత్రా మహాజన్ చేతులెత్తేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక హోదా విషయంలో స్పందించలేదు.

దీంతో సభ రెండు సార్లు వాయిదా పడింది. అనంతరం కూడా సభలో అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లు వారి రాష్ట్ర సమస్యలపై కేంద్రం స్పందించాలంటూ చేసిన హైడ్రామా ఆందోళనతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ సభను బుధవారం నాటికి వాయిదా వేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కావటంతో టీడీపీ, వైసీపీలు కనీసం ఈ రోజైనా తాము ఇచ్చిన అవిశ్వాస తీర్మానం వస్తుందేమోనని ఎదురు చూశారు. కానీ అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లు అడ్డం అడ్డుపడ్డాయి. స్పీకర్ వెల్‌లోకి వెళ్లి వారి రాష్ట్రాల సమస్యలపై నినాదాలు చేశాయి. ఈ నినాదాల మధ్యే కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఇరాక్‌లో 39 మంది భారతీయుల మృతిపై ప్రకటన చేశారు. ఈ అంశంపై సభ్యులు సంయమనం పాటించాలని స్పీకర్ కోరారు. అయితే ఆందోళనలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఆందోళనలు మధ్య సుష్మా స్వరాజ్ తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. ఆ ప్రసంగం పూర్తికాగానే సభ తొలుత 12 గంటలకు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభం కాగానే మళ్లీ అదే హై డ్రామా.. అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లు పోషించిన పాత్ర చూసి విపక్షాలు ఫక్కున నవ్వుకున్నాయి. సభ ప్రారంభానికి ముందే టీడీపీ, వైసీపీ నేతలు అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌తో చర్చలు జరిపారు. సభలో ఆందోళన చేయకుండా ఉంటే తాము ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానం వస్తుందని అభ్యర్థించారు. అయితే అన్నాడీఎంకె నేత తంబిదురై మాత్రం చాలా కఠినంగా మాట్లాడారు. మా రాష్ట్ర సమస్యలే ముఖ్యం.

కావేరీ బోర్డు వేసే వరకు లోక్‌సభలో ఆందోళన చేస్తాం.. మా సమస్య పరిష్కారం అయితే మీ రాష్ట్రం సమస్యలపై ఆలోచిస్తామని ఖరాకండిగా తేల్చి చెప్పేశారు. టీఆర్‌ఎస్‌ది కూడా ఇదే పరిస్థితి అని చెప్పాలి. ఆ పార్టీ నేతలకు కూడా ప్రత్యేక హోదాపై ప్రవేశపెట్టబోయే అవిశ్వాస తీర్మానాల విషయంలో సహకరించేది లేదని పేర్కొన్నారు. ఇక టీడీపీ, వైసీపీలు మాత్రం లోక్‌సభలో చర్చ జరిగే వరకు తాము అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెడుతూనే ఉంటామని స్పష్టం చేశాయి. కేవలం అతి స్వల్ప సమయంలోనే లోక్‌సభ వాయిదా పడటం విశేషం. సభ ప్రారంభానికి ముందే స్పీకర్‌తో వైసీపీ సభ్యులు చర్చలు కూడా జరిపారు.

అయితే సభ సజావుగా నడిస్తేనే తాను చర్చకు అనుమతించగలనని లేదంటే తానేమి చేయలేనని స్పష్టం చేశారు. టీడీపీ, వైసీపీ ఎంపీలు ఇద్దరూ కూడా వివిధ పార్టీల నేతలను పార్లమెంటులో కలసి అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడకట్టే ప్రయత్నం చేశారు. ఏది ఏమైనా ఈ సమావేశాల్లో కేంద్రంపై అవిశ్వాస తీర్మానం మాత్రమే వచ్చే అవకాశం కనిపించటం లేదు. దీనికి ముందుకు టీడీపీ ఎంపీలు పార్లమెంటులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద, వైసీపీ ఎంపీలు పార్లమెంటు ప్రధాన ద్వారం దగ్గర ఆందోళనలు నిర్వహించారు.

కేంద్రం భయపడుతోంది : టీడీపీ ఎంపీలు

అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం భయపడుతోందని టీడీపీ ఎంపీలు పేర్కొన్నారు. లోక్‌సభ మధ్యాహ్నం వాయిదా పడిన తర్వాత ఎంపీలు తోట నరసింహం, గల్లా జయదేవ్, మురళీ మోహన్, అవంతి శ్రీనివాస్, రామ్మోహన్ నాయుడు, రవీంద్ర బాబు, కేశినేని నాని, నిమ్మల కిష్టప్ప, కొనకళ్ల నారాయణ పార్లమెంటు వద్ద విజయ్‌చౌక్‌లోని మీడియా పాయింట్‌లో మాట్లాడారు. అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లు కేంద్రానికి అండగా ఉన్నాయని పేర్కొన్నారు. లోక్‌సభలో అవిశ్వాసం రాకుండా ఈ రెండు పార్టీలు హై డ్రామా చేస్తూ ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కలిగిస్తున్నాయని చెప్పారు. కేంద్రం కావాలనే అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లతో ఆందోళన చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదాపై తాము కేంద్రాన్ని వదిలేది లేదని స్పష్టం చేశారు.

రాజీనామాలే మా తదుపరి అస్త్రం : వైసీపీ ఎంపీలు

లోక్‌సభలో తాము పెట్టిన అవిశ్వాస తీర్మానాలు చర్చకు రాకపోవటంతో వైసీపీ ఎంపీలు ఇక రాజీనామాలు చేస్తామని స్పష్టం చేశారు. ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి, వరప్రసాద్‌లు మంగళవారం పార్లమెంటులో మీడియాతో మాట్లాడారు. అవిశ్వాసంపై తాము చేస్తున్న ప్రయత్నాలను అన్నాడీఎంకె, టీఆర్‌ఎస్‌లు అడ్డుకుంటున్నాయని పేర్కొన్నారు. సభలో అవిశ్వాసం రాకపోవటానికి ఈ రెండు పార్టీలే కారణమని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఎంపీలు స్పష్టం చేశారు.

39 మందిని అప్పుడే చంపేశారు

(మొదటిపేజీ తరువాయి)

డీఎన్‌ఏతో సరిపోయింది. ఒకరిది మాత్రం 70 శాతం కలిసింది' అని సుష్మా స్వరాజ్ రాజ్యసభలో తెలిపారు. అయితే గత ఏడాది జూలైలోనే భారత బందీలు 39 మంది చనిపోయినట్లు సాక్ష్యం లేదా బలమైన ఆధారం లేనందున ప్రకటించలేదని సుష్మా స్పష్టం చేశారు. 'బలమైన సాక్ష్యం లేకుండా ఒక వ్యక్తి మరణించినట్లు ప్రకటించడం పాపం. నేను ఆ పాపం చేయను' అని సుష్మా 2017లో లోక్‌సభలో ఒక ప్రకటన చేశారు. ప్రస్తుతం బందీలుగా మృతి చెందినట్లు ధ్రువీకరించబడినట్లు స్వరాజ్ పేర్కొంటూ, భౌతికకాయాల అవశేషాలను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర మంత్రి వి.కె.సింగ్ ఇరాక్ వెళతారని చెప్పారు. మృతదేహాలను తీసుకొచ్చే విమానం మొదట అమృత్‌సర్, తర్వాత పాట్నా, కోల్‌కతా వెళుతుందన్నారు. మృతులు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ్‌బెంగాల్ బీహార్‌కు చెందినవారని మంత్రి సుష్మా తెలిపారు. ఈ నేపథ్యంలో మృతులకు సంతాపం తెలియజేస్తూ రాజ్యసభలో రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. ఉపాధి నిమిత్తం ఇరాక్‌లోని మోసుల్ నగరం వెళ్లి కూలీలుగా పని చేస్తున్న ఓ భారతీయుల బృందం 2014లో కిడ్నాప్‌కు గురైంది. మోసుల్ నుంచి తిరిగి వస్తుండగా ఐసిస్ ఉగ్రవాదులు అడ్డగించి వీరిని బందీలుగా చేసుకున్నారు. అప్పటి నుంచి వీరి ఆచూకీ తెలియరాలేదు. వీరిని విడిపించేందుకు భారత ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. కాగా మరణించిన వారిలో అత్యధికులు పంజాబ్‌కు చెందినవారే. మోసుల్ సమీపంలో ప్రాజెక్టుల పనులు నిమిత్తం వారు ఇక్కడున్నారు. ఐసిస్ చెర నుంచి తప్పించుకున్న బందీలలో ఒకరైన హర్జిత్ మసీ కథనాన్ని సుష్మా స్వరాజ్ మంగళవారం సభలో వివరించారు. భారత పౌరులు అపహరణకు గురైన తర్వాత కాల్చి చంపబడ్డారని హర్జిత్ చెప్పినది అబద్ధమని, కానీ ఇది అలా జరగలేదని మంత్రి పేర్కొన్నారు. భారతీయులతోపాటు అపహరణకు గురైన కొంతమంది బంగ్లాదేశ్ ఖైదీలతో హర్జిత్ పారిపోయాడు. అతని కాలుపై కాల్పులు జరిపినట్లు, అటుతర్వాత చనిపోయినట్లు గతంలో అబద్ధం చెప్పాడు.

ప్రభుత్వం బాధిత కుటుంబాలకు తప్పుడు ఆశలు కల్పించింది : కాంగ్రెస్

2014లో ఇరాక్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు అపహరించిన భారత్‌కు చెందిన నిర్మాణ కార్మికులు 39 మంది మరణించిన ఘటనను భారత ప్రభుత్వం ఆలస్యంగా ధ్రువీకరించడాన్ని కాంగ్రెస్ పార్టీ మంగళవారం విమర్శించింది. బాధిత కుటుంబాలకు తప్పుడు ఆశలు కల్పించిందని ఆరోపించింది. కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్ మీడియాతో మాట్లాడుతూ 'భారతీయులందరినీ ఈ విషాద ఘటన విచారంలో ముంచెత్తింది. ప్రభుత్వం ఈ విషయం ఇంత వరకు ఎందుకు చెప్పలేదు. ఊచకోత ఘటన ఎప్పుడు, ఎలా జరిగిందో చెప్పాలి' అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. బందీలు ఊచకోతకు గురైన విషయాన్ని ఇంతవరకు చెప్పకుండా బాధిత కుటుంబాల్లో ప్రభుత్వం ఆశలు కల్పించడం కూడా సరైనది కాదని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించాలని, అలాగే మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నేత గులామ్ నబీ ఆజాద్ డిమాండు చేశారు. ఇరాక్‌లో మరణించిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ సంతాపం తెలిపింది. 'మేము దీనిని ముందే ఊహించాం. ముందుగానే తెలిసింది. ముందుగానే ప్రకటించాల్సి ఉంది' అని పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ తెలిపారు.

భారతీయుల మృతికి రాహుల్ సంతాపం

ఐసిస్ ఉగ్రవాదుల చేతిలో దారుణంగా హత్యకు గురైన 39 మంది భారతీయుల కుటుంబాలకు కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'ఇరాక్‌లో 2014 నుంచి ఉంటున్న 39 మంది భారతీయులు మరణించిన విషయం తెలిసి నేను దిగ్భ్రాంతి చెందాను. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఆప్కో కక్కుర్తి

(మొదటిపేజీ తరువాయి)

వెచ్చిస్తోంది. దీనిలో రూ.160 వస్త్రానికి పోను, రూ.40 కుట్టు చార్జీ. ఇలా ప్రతీ ఏటా విద్యార్థికి రూ.400 చొప్పున ఖర్చు చేస్తోంది ప్రభుత్వం. ఇలా దర్జీలకు కూడా కోట్ల రూపాయలే. వస్త్రం నుంచి, దర్జీ చార్జీల వరకు అన్నిటా కమీషన్ల వ్యవహారం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆప్కో నిర్లక్ష్యం ఫలితంగా ఏకంగా 30 లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది యూనిఫారాలు లేకుండా ఇబ్బంది పడ్డారు. అన్ని యూనిఫారాలు ఒకేచోట కుట్టించడం వల్ల వస్త్రం భారీగా మిగులుతుంది. మిగిలే వస్త్రంతోపాటు, కుట్టుకూలిలో కమిషన్ల కక్కుర్తి కోసమే ఆప్కో ఈ ఏడాది కుట్టు పనిని కూడా కేంద్రీకరించిందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలకు అరకొరగా పంపించిన యూనిఫారాలపై కూడా పలు ఆరోపణలు ఉన్నాయి. తమకు ఇష్టం వచ్చిన కొలతలో యూనిఫారాలు కుట్టించి జిల్లాలకు పంపించేయడం వల్ల, అవి విద్యార్థులకు సరిపోవటం లేదని ఎంఇఓలు వాపోతున్నారు. కొందరికి పెద్దవి అయిపోగా, మరికొందరికి సరిపోవటం లేదు. అదే స్థానికంగా కుట్టి పని చేయించి ఉంటే, దర్జీలు ఆయా పాఠశాలలకు వెళ్లి కొలతలు తీసుకొని విద్యార్థులకు సరిపోయే విధంగా కుట్టించి ఇచ్చేవారు. స్థానిక దర్జీలకు పని లేకుండా చేయడమే కాకుండా, అనుకున్న పనిని కూడా సకాలంలో పూర్తి చేయలేకపోయింది ఆప్కో. ఏప్రిల్ 23తో ఈ విద్యాసంవత్సరం ముగిసిపోతోంది. ఇప్పటికే విద్యార్థులంతా పరీక్షల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ తరుణంలో యూనిఫారాలను సరఫరా చేయడం హాస్యాస్పదమే కాకుండా కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం వృధా. అయితే ఈ ఏడాది పరిస్థితి ఇంత దారుణంగా ఉండగా, వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన కాంట్రాక్టును కూడా ఆప్కోకు అప్పగించింది ప్రభుత్వం. ఏయే జిల్లాల్లో ఎంతమంది విద్యార్థులున్నారో, వారికి యూనిఫారాలను సరఫరా చేసేందుకు ఎంత వస్త్రం కావాలో తదితర వివరాలను తెలియజేయాలని ఇప్పటికే అన్ని జిల్లాల ఆర్‌వీఎం అధికారులకు ఉత్తర్వులు వచ్చాయంటే, ప్రభుత్వం ఎంతగా కళ్లు మూసుకుందో, ఈ వ్యవహారం వెనుక ఎంతగా లాబీయింగ్ జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య, యూనిఫారాలకు వెచ్చించే మొత్తం

జిల్లా	విద్యార్థుల సంఖ్య	యూనిఫారాలకు వెచ్చించిన మొత్తం(రూ.లక్షల్లో)
శ్రీకాకుళం	1,98,364	793.46
విజయనగరం	1,55,122	620.49
విశాఖపట్నం	2,27,893	911.57
తూర్పుగోదావరి	3,24,475	1297.90
పశ్చిమగోదావరి	2,18,489	873.95
కృష్ణా	2,04,016	816.06
గుంటూరు	2,53,631	1014.52
ప్రకాశం	2,29,428	917.71
నెల్లూరు	1,79,494	717.97
చిత్తూరు	2,55,160	1020.64
కడప	1,75,086	700.34
అనంతపూర్	2,73,004	1092.02
కర్నూలు	3,20,714	1282.86
మొత్తం	**30,14,876**	**12059.50**

రేపు హైవేల దిగ్బంధం

(మొదటిపేజీ తరువాయి)

అంశాల అమలు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అటకెక్కించింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం, రామాయపట్నం పోర్టు, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, పరిశ్రమలకు రాయితీలు తదితరాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగింది. పోలవరం జాతీయ ప్రాజెక్టును 2018కల్లా పూర్తిచేస్తామన్న హామీ పునాదులకే పరిమితమైంది.

ఏపీకి రావలసిన నిధుల విషయమై గత నాలుగేళ్లుగా బీజేపీ శ్రేణులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేశాయి. చివరకు కేంద్ర ప్రభుత్వం తన ఆఖరి బడ్జెట్‌లో కూడా ఏపీకి ద్రోహం చేసింది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఇబ్బడిముబ్బడిగా నిధులు కేటాయించి, ఏపీపై సవతి ప్రేమ నటించింది. గత నాలుగేళ్ల నుంచి రాష్ట్రానికి బీజేపీ ఏం ఇచ్చిందో, ఎంత ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. అలాగే ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై బీజేపీ వైఖరి ఎండగడుతూ చేపట్టిన ఉద్యమం నేడు జాతీయ సమస్యగా మారిందని, ఇప్పటికే ప్రత్యేక హోదా ఉద్యమ సెగ ఢిల్లీని తాకినందున మలి దశ ఉద్యమం ఒక ఉప్పెన కావాలని కార్యవర్గం ఆకాంక్షించింది. దీనిలోభాగంగా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న జరగనున్న జాతీయ రహదారుల దిగ్బంధనం కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. అన్ని రాజకీయ పక్షాలు ఏకత్రాటిపైకి వచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం విజ్ఞప్తి చేసింది.

హోదా ఉద్యమకారులపై కేసులు ఎత్తేయాలి

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్యమించిన ఉద్యమకారులపై పోలీసులు కేసులు పెట్టడాన్ని కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఏపికి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో చేసిన ఉద్యమాలలో పాల్గొన్న వారిపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు అక్రమ కేసులు బనాయించారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టిన దృష్ట్యా ఇప్పటివరకు ప్రత్యేక హోదా ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బేషరతుగా ఉపసంహరించేందుకు జీవో విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది.

మున్సిపల్ టీచర్ల పదోన్నతులు చేపట్టండి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియను చేపట్టేందుకుగాను వెంటనే షెడ్యూలు ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు.ఇటీవల వివిధ కారణాలతో నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ టీచర్ల సీనియార్టీ, ఖాళీల జాబితాలను ప్రకటించాలని తెలిపారు.మెరిట్ కమ్ రోస్టర్ మేరకు వెంటనే పదోన్నతులు చేపట్టాలని కోరారు.మున్సిపల్, నగర పాలక టీచర్లపై అనవసరపు పనిభారాన్ని మోపుతున్నారని తెలిపారు.మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఏపీకి అన్యాయంపై దేశ వ్యాప్తంగా చర్చించాలి : అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కొనసాగుతున్న అన్యాయంపై దేశ వ్యాప్తంగా చర్చించాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పేర్కొన్నారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించి ద్రోహానికి పాల్పడిన చంద్రబాబును తరిమికొట్టే రోజు ఆసన్నమైందని చెప్పారు.కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ అవిశ్వాసం పెట్టాకే...చంద్రబాబు ఆ దిశగా మొగ్గు చూపారని పేర్కొన్నారు.పార్లమెంటు ఆవరణలో చిత్తూరు ఎంపీ నారమల్లి శివప్రసాదును రోజూ చూస్తున్నామని, ఆయన రోజుకో వేషం వేస్తున్నారని పేర్కొన్నారు.చంద్రబాబుకున్న ఇద్దరు మిత్రులు బీజేపీ, జనసేన ఇటీవల దూరమయ్యారని తెలిపారు.పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు ఇష్టానుసారంగా వినియోగించుకుని, ఇప్పుడు ఆయన్ని విమర్శిస్తున్నారని ఎద్దేవ చేశారు.

హైదరాబాద్‌లో వుంటే
ఏపీ అభివృద్ధి ఏం తెలుస్తుంది
పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై లోకేష్ విమర్శ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : హైదరాబాద్‌లో కూర్చున్న వారికి ఆంధ్రప్రదేశ్‌లలో శరవేగంగా జరిగే అభివృద్ధి గురించి ఏం తెలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీలో కల్సిన మీడియా సభ్యులతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. రాజధాని కూడా లేని రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గత నాలుగేళ్లుగా అమరావతిలో ఉండి రాష్ట్రాభివృద్ధి కోసం రోజుకి 20 గంటలు కష్టపడుతుంటే విమర్శలు చేస్తారా? అని మండిపడ్డారు. చంద్రబాబుకు రెండున్నర మార్కులు వేయడానికి పవన్‌కల్యాణ్ ఎవరని ప్రశ్నిం చారు. హైదరాబాద్‌లో ఉండేవారికి ఆయన పడుతున్న కష్టం ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. రాజధాని లేని రాష్ట్రానికి ఒక రూపు తీసుకొస్తోంది ఎవరు? ఈ రాజధాని నిర్మించేదెవరు ? 8 శాతం ఉన్న వృద్ధిరేటును 12శాతానికి తీసుకొచ్చింది ఎవరు? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 16వేల కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం వారికి కనబడటం లేదా? కష్టపడుతున్నవారిని ప్రోత్సహిం చాల్సింది పోయి నిరాధారమైన ఆరోపణలతో బురద చల్లుతారా ? అని మండిపడ్డారు. తనపై సీబీఐ విచారణ జరగనుందని ఎవరో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పడే కష్టాన్ని విమర్శిస్తుంటే టీడీపీ కార్యకర్తగా ఎంతో బాధపడ్డానని లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కూడా నిరాధార ఆరోపణలకు పాల్పడ్డారని, ప్లానింగ్ కమిషన్ సభ్యుడు పెద్ది రామారావు ఫొటో చూపించి శేఖర్‌రెడ్డి అని దుష్ప్రచారం చేశారని, తాత ఎన్టీఆర్, నాన్న చంద్రబాబుకు ఎన్నడూ తాను చెడ్డపేరు తీసుకురానని స్పష్టం చేశారు. తొలుత శేఖర్‌రెడ్డికి తనకు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేసిన పవన్, ఒక్కరోజులోనే ఎందుకు మాట మార్చారని ప్రశ్నించారు.8 ఏళ్లుగా తన ఆస్తులు బహిరంగంగా ప్రకటిస్తున్నానని, అంతకు మించి ఎక్కువ ఆస్తులుంటే వారే తీసుకోవచ్చని లోకేశ్ మరోసారి సవాల్ చేశారు. పోలవరం టెండర్లలో అవినీతి ఉంటే నిరూపించాలని కోరారు. పవన్ ఆరోపణలపై పరువు నష్టం దావా వేస్తారా? అని ప్రశ్నించగా ఆది పార్టీ నిర్ణయమని సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆటలపోటీలు

విశాలాంధ్ర అమరావతి : శాసనసభ, శాసనమండలి సభ్యుల స్పోర్ట్స్, కల్చరల్ కార్యక్రమాలకి సంబంధించి స్పీకర్ కోడెల అధ్యక్షతన మంగళవారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్ లో సమావేశం జరిగింది. ఈనెల విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 24 , 26 తేదీలలో నిర్వహించ నున్నారు. మొత్తం 10విభాగాల్లో ఆటలపోటీలు జరగనున్నాయి.27న కల్చరల్ ఈవెంట్ ఏర్పాటు చేయనున్నారు.సభ్యుల ఏ క్రీడల్లో ప్రావీణ్యం ఉంటే అందులో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో మండలి ఉప సభాపతి రెడ్డి సుబ్రహ్మణ్యం, మంత్రులు యనమల, కాల్వ, అచ్చెన్నాయుడు, అయ్యన పాత్రుడు, కొల్లు, చీఫ్ విప్ పల్లె, విప్ కూన రవికుమార్, ఇంచార్జీ సెక్రటరీ విజయరాజు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'చంద్రబాబు' కుటిల రాజకీయాలు
కొలనుకొండ శివాజీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హక్కులను విస్మరించి, కుటిల రాజకీయాలే లక్ష్యంగా చంద్రబాబు వ్యవహరిం చడం దారుణమని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ గురు వారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.టీడీపీ నాలుగేళ్లపాటు కేంద్ర మంత్రి పదవుల్ని అనుభవించిందని, మోడీకి పూర్తిగా చంద్రబాబు మద్దతు పలికారని పేర్కొన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతుందనే వ్యూహంతోనే చంద్రబాబు కుటిల బుద్ధితో వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

హోదా, ప్రత్యేక రాయితీలు రాకున్నా...
పారిశ్రామిక వృద్ధి 10.16 శాతం

- ఉత్పత్తి రంగంలోనూ 13.40 శాతం వృద్ధి రేటు
- రెండింటిలోనూ జాతీయ వృద్ధి రేటు కంటే ఎక్కువే
- మూడున్నరేళ్లలో 5.35 లక్షల ఉద్యోగాలు
- పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కేంద్రం నుంచి ప్రత్యేక రాయితీలు రాకపోయి నప్పటికీ, పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటు జాతీయ వృద్ధి కంటే ఎక్కువగానే ఉందని పరిశ్రమలశాఖ మంత్రి ఎన్ అమర్‌నాథ్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల వృద్ధి రేటు 10.16 శాతంగా ఉంటే, జాతీయస్థాయిలో అది 8.31 శాతంగానే ఉందన్నారు. అలాగే ఉత్పత్తిపరంగా రాష్ట్ర వృద్ధి రేటు 13.40 శాతంగానూ, జాతీయ వృద్ధి రేటు 10.31 శాతంగా ఉందన్నారు. వరుసగా నిర్వహిస్తున్న సమ్మిట్‌లలో 1,646 ఎంఓయూల ద్వారా 17.19 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయసంస్థలు ముందుకు వచ్చాయన్నారు. వీటి వల్ల 34.82 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన అనే అంశం స్వల్ప వ్యవధి చర్చకు స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు మంగళవారం అనుమతించారు. దీనిపై పలువురు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్రం నుంచి సహకారం లేకపోయినప్పటికీ, చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేం దుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన తప్పిదం పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే ఉత్తరాంధ్ర, రాయలసీమతోపాటు కోస్తా జిల్లాల్లోనూ పలు పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. మూడున్నర సంవత్సరాలలో 5.35 లక్షల మందికి ఉద్యోగవకాశాలు కల్పించినట్లు మంత్రి తెలియజేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకే సింగిల్ డెస్క్ విధానంతోపాటు నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో కొరియాకు చెందిన కియా సంస్థ రూ.13,500 కోట్లతో ఏర్పాటు చేసిన పరిశ్రమలో ఆరు వేల మందికి ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. విశాఖపట్నం - చెన్నై కారిడార్, తిరుపతి - బెంగళూరు కారిడార్‌లోనూ భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంఎస్‌ఎంఈలలో 3.09 లక్షల ఉద్యోగాలు

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) ఏర్పాటు ద్వారా మరో 3.09 లక్షల మంది ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి చెప్పారు. 26 వేల ఎంఎస్‌ఎంఈలలో రూ.11,779 కోట్ల పెట్టుబడులను రాబట్టనున్నట్లు తెలిపారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం 96 నియోజకవర్గాలలో 8,926 ఎకరాల భూమిని సేకరించగా, మిగిలిన నియోజకవర్గాలలో భూ సేకరణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. అంతకుముందు ఈ అంశంపై ఎమ్మెల్యేలు బొండా ఉమా మహేశ్వరరావు, ఎస్‌వీ మోహనరెడ్డి, ఏ ఆనందరావు, జీవీ ఆంజనేయులు, జీ బుచ్చయ్య చౌదరి, బీజేపీ శాసనసభపక్ష నేత పీ విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వటంలేదని, ఫలితంగా పారిశ్రామిక రాయితీలను రాష్ట్రమే భరించాల్సి వస్తోందన్నారు. అదే హోదా వస్తే కేంద్రం నుంచి ప్రత్యేక రాయితీలు వస్తాయని, ఆ మేర రాష్ట్ర నిధులను వేరే అభివృద్ధి పనులకు వినియోగిం చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ సమయంలో బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా, పరిశ్రమలు, పెట్టుబడు లకు ఎలాంటి సంబంధంలేదన్నారు. హోదా లేకున్నా పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. కాగా, భాగస్వామ్య సదస్సుల వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లోని యువతకు ఉపయోగం ఉండటం లేదని, అనేక మంది పొరుగు ప్రాంతాలకు వలపోతున్నట్లు చెప్పారు. దీంతో పలువురు ఎమ్మెల్యేలు జోక్యం చేసుకునని హోదా ఇప్పిస్తారా, లేదా అని ప్రశ్నించారు. అయితే టీడీపీ ఎమ్మెల్యేలు హోదా పేరుతో ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తున్నారని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు.

దిగ్విజయ్‌సింగ్ యాత్రకు రఘువీరా సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మధ్యప్రదేశ్‌లోని డిన్‌డోరి జిల్లాలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం దిగ్విజయ్‌సింగ్ చేపట్టిన నర్మద పరిక్రమ యాత్రకు పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ మేరకు పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.వచ్చేనెల 10వ తేదీ నాటికి నర్మద పరిక్రమ పాదయాత్రను దిగ్విజయ్‌సింగ్ సంపూర్ణంగా పూర్తి చేస్తారన్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ చేపడుతున్న ఉద్యమాన్ని ఆయన ప్రశంసించారని పేర్కొన్నారు. దిగ్విజయ్‌సింగ్‌ను రఘువీరారెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు కలిశారు.

మెడికల్ సర్వీస్ చైర్మన్ పదవికి లక్ష్మీపతి రాజీనామా

విశాలాంధ్ర అమరావతి : ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి లక్ష్మీపతి రాజీనామా చేశారు. అసెంబ్లీ సమావేశాల ప్రాంగణం దగ్గర మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన ఈ విషయం తెలియచేసారు.ఈసందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ ఎన్ డీఏ నుంచి బయటకి వచ్చిన క్రమంలో తాను పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి బిజెపి ఏ విధమైన అభివృద్ధి చేసిందో క్షేత్ర స్థాయిలో ప్రజలందరికీ వివరిస్తామని చెప్పారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో నిధులు ఇచ్చిందని నిజం నిలకడ మీద తెలుస్తుందని అన్నారు. రాజకీయాలు మాట్లాడేందుకు ఇది సందర్భం కాదని వ్యాఖ్యానించారు. అలాగే బీజేపీకి జనసేన , వైసీపీ ల నడుమ ఏ విధమైన సంబంధం లేదని స్పష్టంచేశారు.

బీజేపీకి మంత్రి ఆదినారాయణరెడ్డి శాపం

- వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపుపై కేంద్రంపై ధ్వజం
- పీఎంఓ చుట్టూ కేంద్ర అధికారం: యనమల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: శాసనసభ సమావేశాల్లో మార్కెటింగ్, గిడ్డంగులశాఖమంత్రి సీహెచ్ ఆదినారాయణరెడ్డి బీజేపీని శపించారు. బీజేపీ 19 తప్పులు చేసిందని, ఆపార్టీకి 19 యుగాలు శాపం తగులుతుందని వాఖ్యానించగానే సభ్యులు బల్లలు చరిచి హర్షం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయంపు' అంశంపై చర్చ జరిగింది. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం కేటాయించిన నిధులు ఒక మూలకు రావని మంత్రులు, ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తరహాలో నిధులను సమకూరుస్తామని హామీ ఇచ్చిన కేంద్రం మూడేళ్లలో రూ. 1050 కోట్లు మంజూరు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన ప్రశ్నకు ఆర్థికశాఖమంత్రి యనమల రామకృష్ణుడు స్పందిస్తూ కేంద్రం ఇప్పటి వరకూ రూ. 1050 కోట్లను విడుదల చేయగా రూ. 954.50 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. రాష్ట్రానికి మంజూరు చేసిన రూ. 350 కోట్ల నిధులను కేంద్రం తిరిగి వెనక్కు తీసుకోవడం చరిత్రలో ఇదే ప్రథమం అన్నారు. కేంద్ర అధికారం మొత్తం ప్రధాని కార్యాలయం (పీఎంఓ) చుట్టూ తిరుగుతోందన్నారు. 'ఈ నిధులను ఎలా రాబట్టుకోవాలో మాకు తెలుసు. వాస్తవంగా రాష్ట్రంలోని 7 వెనుకబడి జిల్లాల అభివృద్ధికి కేంద్రం నుంచి రూ. 24,350 కోట్లు రావాలి. ప్రస్తుతం రాజకీయ పోరాటం నడుస్తోంది.. అంతిమంగా కోర్టుకెళ్లాల్సి వస్తే తప్పకుండా వెళతాం' అని యనమల స్పీకర్ సమక్షంలో సభకు వివరించారు. ఈ విషయమై మంత్రి కాల్వ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్ జి రవికుమార్, ఎమ్మెల్యేలు బి జయనాగిరెడ్డి, కె రవికుమార్, కె మృణాళిని తదితరులు బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజును లక్ష్యంగా చేసుకొని కేంద్రం తీరును ఎండగట్టారు.

పశువైద్య విద్యార్థుల కోసం ప్రశ్నించా
కత్తి నరసింహారెడ్డి ఎమ్మెల్సీ



విశాలాంధ్ర అమరావతి : పలు కీలక సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించినట్లు ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి చెప్పారు . మంగళవారం అసెంబ్లీ మీడియా పోయింట్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 250 గ్రామీణ పశువైద్య శాలలను అప్ గ్రేడ్ చేయమని, 1200 పశు వైద్య విద్యార్థులు ఆందోళన చేస్తున్నారన్నారు. ఈ విషయమై సభలో వాయిదా తీర్మానం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. కాగా ఈ అంశంపై సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారుని త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. 01.09.2004 తరువాత ఎయిడెడ్ కాలేజీలు, పాఠశాలల సిబ్బందికి పాత, కొత్త పెన్షన్ విధానంలోని ఏ విధానంలోనూ పెన్షన్ వర్తింపచేయడం లేదని, వారికి కూడా పెన్షన్ వర్తింప చేయాలని డిమాండ్ చేయటం జరిగిందన్నారు. ఈ నెల 22 న విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా కోసం ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున జాతీయ రహదారుల దిగ్బంధనం కార్యక్రమం చేపట్టనున్నారని వివరించారు. పార్లమెంట్ సాక్షిగా ఆ నాడు మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలను, విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నిరసన ద్వారా డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కూడా సహకరించి ఇందులో పాల్గొనాలని కోరుతున్నామని వ్యాఖ్యానించారు. తెలుగు సినిమా పరిశ్రమలో అగ్ర నటులు, నటీమణులు కూడా ఆందోళన కార్యక్రమమునకు మద్దతు ఇవ్వాలని కోరారు. తమిళనాడులో జల్లికట్టు సమస్యపై తమిళ సినీ ప్రముఖులు మాట్లాడి కేంద్రం పై వత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. మన సినీ పరిశ్రమ కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఇది సంక్షేమ బడ్జెట్
ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు

విశాలాంధ్ర-అమరావతి : జన్మభూమి, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాలలో వచ్చిన సమస్యల పరిష్కారానికి, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి, సంక్షేమ పథకాలకు ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు.మంగళవారం శాసనమండలిలో 2018-19 బడ్జెట్‌పై సమాధానం ఇస్తూ ఆర్థిక మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు బీసీలకు చంద్రన్న పెళ్లి కానుక, అదరణ పథకం, నిరుద్యోగ భృతి, లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ వంటి కొత్త పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. బడా బడ్జెట్ పెట్టారు, ఖర్చు చేపట్టలేరని ప్రతిపక్షాల నాయకులు మాట్లాడుతున్నారని, విమర్శలు చేసే ముందు గత బడ్జెట్‌లో కేటాయింపులు, జరిగిన ఖర్చులు చూడాలని యనమల సూచించారు. 2018-19 బడ్జెట్ రూ.1,91,63,061 కోట్లు గత ఏడాది బడ్జెట్ కంటే 21 శాతం ఎక్కువని తెలిపారు. 2018-19 బడ్జెట్‌లో 36 కొత్త పథకాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. మెగాసీడ్ పార్కుకు 100 కోట్లు, లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ కు 50 కోట్లు, నిరుద్యోగ యువతకు రూ.1000 కోట్లు కేటాయించి నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలని ఆలోచిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం దయాదాక్షిణ్యాలు మీద ఆధారపడి రాష్ట్రాలు లేవని చెప్పారు. రెవెన్యూ లోటులో రూ.4 వేల కోట్లు వచ్చాయి కేంద్రం నుండి ఇంకా రూ.12 వేల కోట్లు రావాలన్నారు. పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలన్నీ అమలు చెయ్యాలని కోరారు. గత మూడేళ్లలో రూ.65,755 కోట్లు అప్పులు చేశామని, ఈ ఏడాది రూ.29,605 కోట్లు అప్పు చేసే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్రాలపై 40 శాతం భారం పడుతుంది. సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ రాష్ట్రాలపై పెట్టకుండా, ఆ నిధులు రాష్ట్రాలకు ఇవ్వాలని కోరారు. దక్షిణ భారతదేశం కంటే ఉత్తర భారతదేశానికి లాభం కలిగించేలా కేంద్రం చర్యలు ఉంటున్నాయన్నారు.

2022 నాటికి ప్రకృతి సేద్యంపై లక్ష మందికి శిక్షణ

- పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు
- రూ. 5వేల కోట్ల పెట్టుబడికి యూనిసెఫ్ సిద్ధం
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో 2022 నాటికి జీరో బడ్జెట్ సహజ సాగు (ప్రకృతి సేద్యం)పై లక్ష మంది రైతులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వ్యవసాయశాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ ద్వారా ప్రకృతి సేద్యంపై పెద్ద ఎత్తున శిక్షణ శిబిరాలు, ప్రచార కార్యక్రమాలను చేస్తున్నట్లు ఆయన వివరించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్న లకు సమాధానమిచ్చారు. ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 1,63,034 మంది రైతులు శిక్షణ పొంది 66,930.55 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ విధానంపై కమ్యునిటీ వీడియోల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేస్తామన్నారు. ఇందుకు రైతు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రోత్సహించేందుకు చర్యలు చేపడతామన్నారు. యూనిసెఫ్ రూ. 5వేల కోట్లను పెట్టుబడిని పెట్టేందుకు సంసిద్ధత తెలియ చేసిందన్నారు. తమ ప్రభుత్వం 2016-17లో రూ. 44.41 కోట్లు, 2017-18లో రూ. 39.91 కోట్లను ఖర్చు చేసిందన్నారు. మల్చింగ్ షీట్లను సబ్సిడీ ధరలకు ఇప్పటికే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రశ్నకు బదులిచ్చారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాలకు విచ్చలవిడిగా వాడడం వల్ల పర్యావరణం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఈ విషమ పరిస్థితులనుంచి గట్టెక్కాలంటే ప్రకృతి సేద్యమొక్కటే మార్గమని ప్రభుత్వం భావిస్తున్నట్లు మంత్రి వివరించారు.

జీవన్‌దాన్‌కు 39 ఆసుపత్రులకు అనుమతి; యనమల : అవయవ దానానికి సంబంధించిన 'జీవన్‌దాన్' కార్యక్రమానికి 39 ఆసుపత్రులకు అనుమతినిచ్చి నట్లు మంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో వెల్లడించారు. బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి శరీరం నుంచి తీసిన అవయవాలతో 6 నుంచి 7 మందికి ప్రాణదానం చేయవచ్చన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ, ఉద్యోగుల ఆరోగ్య పథకంలో భాగంగా గుండె, ఊపిరితిత్తుల మార్పిడిని చేసేందుకు ప్రభుత్వం అనుమ తించినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జీవన్‌దాన్ ఆమోదం పొందిన తర్వాత అర్హులైన ఉద్యోగులు, ఎన్టీఆర్ వైద్య సేవా లబ్ధిదారులకు బ్రెయిన్‌డెడ్ రోగుల నుంచి గుండె మార్పిడి కోసం ప్రొటోకాల్స్‌ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. దీనిపై సభాపతి కోడెల శివప్రసాద్ స్పందిస్తూ.. జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవ దానంతో ఎంతో మంది విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. మరొక ప్రశ్నకు మంత్రి యనమల సమాధానమిస్తూ.. ఆశావర్కర్ల సేవలను ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే కార్యక్ర మంలో వినియోగించు కోవడంలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42వేలకు పైగా ఉన్న ఆశావర్కర్లకు ఏఎన్ఎంలుగా శిక్షణనిచ్చే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అలాగే క్షయ వ్యాధి నివారణకు విస్తృత ప్రచారం చేస్తున్నట్లు యనమల చెప్పారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం
పార్టీ ప్రధాన కార్యదర్శి బండారు సత్యన్నారాయణ



విశాలాంధ్ర అమరావతి : తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బండారు సత్యన్నారాయణ మూర్తి చెప్పారు. ఉండవల్లి సీఎం నివాసం దగ్గర గ్రీవెన్స్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు వివరించారు. మార్చి 29 తేదీన తెలుగుదేశం పార్టీ 36 ఆవిర్భావ దినోత్సవం అత్యంత ఘనంగా జరపనున్నామని చెప్పారు. పార్లమెంట్ లో ఎంపీలు చేస్తున్న పోరాటాన్ని ప్రజలలోకి తీసుకెళలని నిర్ణయించినట్లు తెలిపారు.

జనసేన పార్టీని బీజేపీ మా పై విమర్శలు చేయడానికి పావులా వాడుకుంటుందని ఇదే అంశం చర్చించినట్లు వివరించారు. 70 శాతం ప్రజలు టీడీపీ పై సంతృప్తి తో ఉన్నారని ఎవరెన్ని విమర్శలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని అన్నారు. బీజేపీ, జగన్‌కు ప్రశాంత కిషోర్ వారధిల వ్యవహరి స్తున్నాడని విమర్శించారు. రాష్ట్రం పై కేంద్ర వివక్షతను ప్రతిపక్షం నాటకాలను ఎమ్మెల్యేలు,పార్టీ నాయకులు తిప్పికొట్టాలని సమన్వయ కమిటీలో సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పళ్ళా శ్రీనివాస్ ,వెలగపూడి రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రభుత్వ కృషే చాలదు
కోడెల శివప్రసాదరావు

విశాలాంధ్ర అమరావతి : బాలికా విద్య అభివృద్ధికి ప్రభుత్వం ఒక్కటే కృషి చేస్తే సరిపోదని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకారమందించాలని స్పీకర్ కోడెల శివప్రసాదరావు కోరారు.యూనిసెఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీలోని కమిటీ హాల్ లో బాలబాలికల సుస్థిరమైన అభివృద్ధికి 17 లక్ష్యాలు అనే అంశంపై మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల బాలికలకు మెరుగైన భవితనిచ్చే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. తరచుగా చట్ట సభల్లోనూ, క్షేత్రస్థాయిలోనూ చర్చించడం ద్వారా బాలల సమస్యలకు పరిష్కారం లభ్యమవుతుందన్నారు. బాలబాలికల సమస్యల పరిష్కారానికి యూనిసెఫ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పాఠశాలల్లో స్నేహ పూర్వక విద్యనందిస్తూ, లైంగిక వేధింపుల జరగకుండా చూడాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం అన్ని పాఠశాలల్లోనూ కల్పించడం ద్వారా బాలికలను చదువుకు దూరంకాకుండా చూడొచ్చునని స్పీకర్ కోడెల తెలిపారు. బాలబాలికలకు ఆరోగ్యం, పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే కాకుండా సమాజంలో ఉన్న అందరిపైనా ఉందన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ఎంతో ముఖ్యమన్నారు. విద్యతోనే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందన్నారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో మాతా శిశు ఆరోగ్యంపై హర్యానా, హిమాచల్ ప్రదేశ్ లో వచ్చే నెల 9వ తేదీ నుంచి 12 తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నారని స్పీకర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారు లకు పౌష్టికాహారం అందజేస్తున్నా మని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సునీత తెలిపారు. గిరిజన చిన్నారులకు గిరిగోరు ముద్దల పేరుతో ప్రత్యేక పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు.

సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల ప్లాన్‌ల కష్టాలు
'అవుకు' 4 టీఎంసీల నీటిని నిల్వ చేయండి
అసెంబ్లీ జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాజధాని ప్రాంత ప్రాధికారసంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం ప్లాన్ తీసుకోవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. గతంలో పంచాయతీ నుంచే ప్లాన్‌ను తీసుకునే సౌలభ్యం ఉండగా, సీఆర్‌డీఏ వచ్చిన తర్వాత, భవన నిర్మాణ అనుమతుల మంజూరును సీఆర్‌డీఏకి బదలాయిం చినట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా మంగళవారం జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రసాద్ ప్రస్తావించారు. 30 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రోడ్లలో అసలు ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్‌లు మంజూరు చేయటంలేదన్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని సుమారు 150 గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు. ప్లాన్ లేకుండా ఇళ్లు నిర్మిస్తే అధికారులు కూల్చేస్తుండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని గ్రామకంఠం, నాన్ లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం మార్గంలో ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్‌ను మంజూరు చేయాలని ఆయన కోరారు. ధర్మవరం ఎమ్మెల్యే జీ సూర్యనారాయణ మాట్లాడుతూ, తక్షణమే మెగా చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి కేంద్రం నుంచి రూ.75 కోట్లు కూడా మంజూరైనట్లు తెలిపారు. చిన్న క్లస్టర్లు 50 కావాలని ప్రతిపాదించగా, ఒక్కటి కూడా మంజూరుకాలేదన్నారు. పెనుగొండ ఎమ్మెల్యే బీకే పార్థసారథి మాట్లాడుతూ, కియా పరిశ్రమ వచ్చిన తర్వాత తమ ప్రాంతంలో విద్యుత్ లోడు పెరిగిందని, ఫలితంగా లో ఓల్టేజ్ సమస్య తలెత్తిందన్నారు. పెనుగొండ, గుత్తి, హిందుపురం తదితర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఉన్నందున లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించి పంటలను బతికించాలని కోరారు.

విజయనగరం ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ, ఆటోనగర్ కోసం గతంలో సేకరించేందుకు నిర్ణయించిన 50 ఎకరాలకు ప్రస్తుత ఉన్న ధర ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అన్ని జిల్లాల్లో ఆటోనగర్‌లు ఉన్నాయని, విజయనగరంలో మాత్రం ఆ సౌకర్యంలేదన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ మాట్లాడుతూ, చిత్తూరు ప్రాంతంలో సుమారు 120కిపైగా గ్రానైట్ ఇతర పరిశ్రమలు ఉన్నాయని, వాటిల్లో పని చేస్తున్న వేలాదిమంది కార్మికులు పని చేస్తూ అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రమాదకర పరిస్థితు లలో పని చేస్తున్న కార్మికులకు వైద్య సౌకర్యంతోపాటు భద్రత కల్పించాలన్నారు. బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, అవుకు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అటవీశాఖ నిబంధనల పేరుతో రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయకుండా అడ్డుకుంటోందన్నారు. ఫలితంగా కడప జిల్లా గండికోటకు నీటిని సరఫరా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు.

సంపాదకీయం

పుతిన్‌కే మళ్లీ అధికారం!

రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ఘన విజయం సాధించారు. ఇది ప్రపంచమంతా ఊహించిందే. గత 18 సంవత్సరాలుగా రష్యాలో ఆయన ఏకచ్ఛత్రాధిపత్యం నడుస్తోంది. దానికి కారణం ప్రపంచంలో రష్యాను ఒక ప్రధాన శక్తిగా నిలపడంలో ఆయన కృతకృత్యం కావడమే. ప్రత్యర్థులు తన దరిదాపుల్లో నిలువలేనంతగా 76.6శాతం ఓట్లు పొందారు. రెండో స్థానంలో నిలిచిన కమ్యూనిస్టు పార్టీ నేత పావెల్ గ్రుడినిన్‌కు 11.8శాతం ఓట్లు లభించాయి. పుతిన్ దేశాధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది నాలుగోసారి. దేశాధ్యక్ష పదవికి రెండు పర్యాయాలకు మించి పోటీ చేయకూడదనే నిబంధన ఉండడంతో ఆయన 1999నుంచి అధ్యక్ష, ప్రధాని పదవులకు పోటీ చేస్తూ దేశంలో తిరుగులేని నేతగా చలామణి అవుతున్నారు. 2024 వరకూ ఈ పదవిలో కొనసాగుతారు. సోవియట్ యూనియన్‌లో జోసెఫ్ స్టాలిన్ తర్వాత రష్యన్లు ఇంత సుదీర్ఘకాలం తమ పాలకుడిగా ఎన్నుకొన్నది పుతిన్‌నే. అంతేకాదు, అంతర్జాతీయంగా కూడా ఎక్కువకాలం ఏలిన నేతగా పుతిన్ గుర్తింపు పొందుతారు. గతంలో మాల్దీవుల్లో అబ్దుల్ గయూమ్, జింబాబ్వే లో రాబర్ట్ ముగాబే, క్యూబాలో ఫిడెల్ క్యాస్ట్రో సుదీర్ఘకాలం పాలించి చరిత్రలో నిలిచిపోయారు. పుతిన్ హయాంలో అంతర్గతంగా దేశ పరిస్థితి ఎలా ఉన్నా.. అంతర్జాతీయంగా రష్యా ప్రతిష్ఠను కాపాడారన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. చైనా మద్దతు కూడగట్టుకోవడం ద్వారా ప్రపంచ వ్యవహారాల్లో అమెరికా ఏకపక్ష, పెత్తందారీ పోకడను పుతిన్ అడ్డుకున్నారన్న అభిప్రాయంతో రష్యన్లు ఉన్నారు. సిరియా విషయంలో అమెరికా దూకుడును నిలువరించారనీ, ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనం చేసుకోవడంలో ధైర్యంగా వ్యవహరించారని దేశ ప్రజలు పుతిన్‌పై అపార గౌరవాన్ని పెంచుకొన్నారు. రష్యా చుట్టుపక్కల ఉన్న సోవియట్ యూనియన్ రిపబ్లిక్ దేశాలకు అమెరికా వత్తాసుగా నిలుస్తున్నా.. పుతిన్ లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారు. అమెరికా వైపు మొగ్గుచూపుతున్న భారత్‌ను రష్యా ప్రభావం నుంచి దూరం కాకుండా చూడగలిగారు. అదే సమయంలో పశ్చిమదేశాలతో ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ వంటి వాటితో రష్యా సంబంధాలు సరిగాలేవు. ఈ నేపథ్యంలో పుతిన్ ఎన్నికను హర్షిస్తూ, అభినందిస్తూ నాటో దేశాల నాయకులెవరూ వెంటనే సందేశాలు కూడా పంపలేదు. తమను వ్యతిరేకించే వారిని బదనాం చేయడంలో యూరోపియన్ పత్రికలు ఎటువంటి ప్రచారానికైనా దిగజారుతాయి. రష్యా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రచారం చేశాయి. వాస్తవానికి ఆయన ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో విజయం సాధించారు. రష్యాలో ఆయన ప్రతిష్ఠను ఎవరూ కాదనలేనిది. అలెక్సీ నావల్నీ అనే బలమైన ప్రతిపక్ష నాయకుడ్ని ఈ ఎన్నికల్లో పుతిన్ పోటీ చేయకుండా తన అధికారంతో అడ్డుకున్నారని యూరోపియన్ పత్రికలు ప్రచారం చేశాయి. న్యాయవాది అయిన అలెక్సీ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఆయనకు ప్రజల్లో మంచి పలుకుబడి ఉంది. రష్యా రాజ్యాంగం ప్రకారం ఒక నాయకుడు ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఎన్నికల సంఘం వద్ద ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. అందుకు కనీసం 500మంది ఓటర్ల మద్దతు ఉండాలి. అయితే అలెక్సీపై పాత కేసులున్నందున ఎన్నికల సంఘం ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. ఆ నిర్ణయాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానంలో కూడా అలెక్సీ సవాల్ చేశారు. అయితే న్యాయస్థానం తోసిపుచ్చింది.

పుతిన్ అధికారం చేపట్టే 1999నాటికి రష్యా పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. మాజీ సోవియట్ రిపబ్లిక్‌లలో అమెరికా సైన్యాలు తిష్ఠవేశాయి. అమెరికా అనుకూల శక్తుల పెత్తనమే చలామణి అవుతున్నది. ఈ నేపథ్యంలో ఒకప్పటి రష్యా ప్రాభవాన్ని చవిచూసిన నాయకులు, ప్రజలు, మాజీ గూఢచారులు, ఇతర రంగాల ప్రముఖులు జాతీయవాద దృక్పథంతో తమ ప్రతినిధిగా పుతిన్‌ను ఎన్నుకొన్నారు. అప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న రష్యాను ఆయన గట్టెక్కించారు. అమెరికా పెత్తనాన్ని అడ్డుకున్నారు. నాటో దేశాల కుట్రలు, కుయుక్తులను తట్టుకొని నిలిచారు. దీంతో అక్కడ ఆయన తిరుగులేని నేతగా రాణించారు. పుతిన్ హయాంలో రష్యా ఆర్థిక పరిస్థితి అంతా గొప్పగా తయారైందని చెప్పలేం. కానీ తనకు వెసులుబాటుతోనే ఆర్థిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి బాటలు వేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రష్యాను తీర్చిదిద్దారు. భూ సంస్కరణలు అమలు చేయడం ద్వారా పల్లెల్లో పేదలు, చిన్న, సన్నకారు రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ ఏడాది దేశ జీడీపీ 1.7శాతం ఉంది. వచ్చేఏడాదికి అది మరో శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. కనీస వేతనాలు పెంచడం ద్వారా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. మరో ఆరేళ్ల పాటు అధికారంలో ఉంటారు. రష్యా రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తారనీ, ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. ఎన్నికల్లో ఆయన ఈ మేరకు హామీ కూడా ఇచ్చారు. లిబియాతో సహా పూర్వపు సోవియట్ అనుకూల దేశాలలో పట్టు కోసం ఆయన తన విధానాలకు పదును పెడుతున్నారు. మధ్య ఆసియాలో రష్యా ప్రాబల్యం చెక్కుచెదరకుండా ఉందంటే అందుకు ఆయన విధానాలే కారణం. అమెరికా, యూరోపియన్ దేశాల్లో జాతీయవాద పోకడలు బలపడుతున్న నేపథ్యంలో రష్యా, చైనాలలో బలమైన నాయకులు కొనసాగడం అంతర్జాతీయ వ్యవహారాల్లో ఓ సానుకూల పరిణామంగానే చూడాలి. జాతీయవాద పోకడలు పేట్రేగిపోతున్న దశలో అంతర్జాతీయ వ్యవస్థలను బలోపేతం చేయడం ఎంతో అవసరం. ఇప్పుడు చైనా, రష్యాలు వర్ధమాన దేశాల ప్రయోజనాలు కాపాడేందుకు కొమ్ముకా యాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇందుకు భారత్ వంటి దేశాలు కూడా వాటికి అనుకూలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రపంచీకరణ విధానాల వల్ల పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, అంతర్జాతీయ వ్యవస్థల బలహీనతల నేపథ్యంలో రష్యాలో బలమైన నాయకుడు అధికారంలో ఉండడం ఓ శుభ పరిణామంగా పరిగణించాలి.

చురక

సమాఖ్య ఫ్రంట్ కొరకు
సారధ్యం పరుగులు
మాటల్లో నిర్మాణం
మహాశక్తి మెరుగులు

జాతీయ పార్టీలతో
జతకడితే వివక్ష
ప్రాంతీయం దేశమంతా
బలపడుటే పరీక్ష

– వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

స్క్రిపాల్‌తో విషవాయువులు


బుడ్డిగ జమిందార్

సర్గీ స్క్రిపాల్ ఒకప్పటి రష్యా పౌరుడు. రష్యన్ మిలిటరీ గూఢచారిగా మాల్టా, స్పెయిన్ దేశాల్లో పనిచేశాడు. అదే సందర్భంలో గ్రేట్ బ్రిటన్ ఏజెంటుగా కూడా వ్యవహరించి పట్టుబడి 13 సంవత్సరాల శిక్షను అనుభవిస్తున్న నేపథ్యంలో 2010 లో గూఢచారుల మార్పిడిలో భాగంగా విడుదలై ఇంగ్లండు వెళ్లి అక్కడ గూఢచారిగా వ్యవహరిస్తూ ఈనెల మార్చి 4న విషవాయువుచే తీవ్ర అస్వస్థతకుగురై సాలిస్‌బ్యూరీ ఆసుపత్రికి చేర్చబడ్డాడు. ఈ విషవాయువు నోవిచొక్ నెర్వ్ ఏజంటు అనీ, స్క్రిపాల్‌పైనా తన కూతురైన జూలియాపైనా రష్యాచే ప్రయోగించబడినదని బ్రిటీష్ ప్రభుత్వ ఆరోపణ. దీనిలో తమ పాత్ర ఏమాత్రంలేదని ఎటువంటి ఆధారాలు లేకుండా తమపై నిందలు మోపుతున్నారని రష్యా అంటున్నది. ఏమైనప్పటికీ రెండువారాల క్రితం వరకూ బ్రెగ్జిట్ సంప్రదింపులతో బ్రిటీష్ ప్రజల్లో చులకనైన ప్రధాని థెరిసామే మాత్రం అకస్మాత్తుగా జాతీయ నాయకురాలైపోయి జాతి రక్షణకు పుట్టిన ప్రధానిగా ప్రచారం పొందుతుంది. ఆమెపై అప్పటివరకు వచ్చిన టెల్‌ఫోర్డ్ స్కామ్ ఆరోపణలు కూడా వెనుకకు నెట్టబడ్డాయి. బ్రిటీష్ ప్రభుత్వం బ్రిటన్‌లోని రష్యా ఆస్తులను జప్తుచేసి లండన్ రాయబార కార్యాలయంలోని 23 రష్యన్ దౌత్యాధికారులను రష్యాకు పంపించివేసింది. దీనికి ప్రతీకారంగా రష్యా ఏమాత్రం తగ్గక తన మాస్కోలోని బ్రిటీష్ దౌత్య కార్యాలయం 23 బ్రిటీష్ పౌరుల్ని వెనుకకు పంపి బ్రిటీష్ కల్చరల్ ఇనిస్టిట్యూషన్స్‌ను జప్తు చేస్తానని చెప్పింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణ పరిస్థితులేర్పడినవి. యు.కె. తన నాటో కూటమితో కలిసి మిలిటరీ హెచ్చరిక కూడా రష్యాపై చేసింది. ఇదే తరహాలో మాస్కో కూడా లండన్‌ను హెచ్చరించటంతో చినుకుచినుకు గాలివానగా మారినట్లు ఇప్పుడు యుద్ధ వాతావరణం ఇరుదేశాల మధ్య ఏర్పడింది. ప్రస్తుతం రష్యా వ్యతిరేక మిలిటరీ రింగులీడరుగా యూరపులో వ్యవహరిద్దామని బ్రిటీష్ ప్రభుత్వం సన్నద్ధమవుతుంది.

ఆధారాలకు నిలబడని కట్టుకథలు

బ్రిటన్, నాటో, మాస్కోపై దాడి చేస్తున్నాయిగాని, విషప్రయోగానికి సంబంధించిన ఏ విధమైన శ్యాంపిల్‌ను మాస్కోకుగానీ, కెమికల్ వెపన్స్ కన్వెన్షన్ (సీడబ్ల్యుసీ)కుగానీ, ఐక్యరాజ్యసమితిలోని 'ప్రివెన్షన్ ఆఫ్ కెమికల్ వెపన్స్' (ఒపిసిడబ్ల్యు)కు గానీ రెండు వారాలు గడచినా ఇంతవరకూ పంపించలేకపోయిందని మాస్కో అంటున్నది. నోవిచొక్ నెర్వ్‌గ్యాసు రష్యా దగ్గర కావల్సినంత ఉందని మాత్రం ప్రచారం జరుగుతున్నది. యు.కె. ఫారిన్ సెక్రటరీ జాన్సన్ మాత్రం ఈ వారంలోగా యు.కె. భద్రతా అధికారులు సమావేశమై మిలిటరీపరంగా ఏవిధమైన చర్యలు తీసుకోవాలి అని చర్చిస్తామని వెల్లడించారు. ఈయూ మంత్రులు కూడా యు.కె.కు మద్దతు తెలుపుతారని అంటున్నారు. క్రితం నెలలో జరిగిన మ్యూనిచ్ భద్రతా కాన్ఫరెన్స్‌లో పారిస్ బెర్లిన్‌లు దగ్గరకు వచ్చి వాషింగ్టన్‌కు ప్రత్యామ్నాయ, నాటో ప్రత్యామ్నాయ మిలిటరీ వ్యవస్థ ఈయూ దేశాలతో పటిష్టపర్చాలని, అమెరికా కోరికమేరకు రష్యాపై విధించబడిన ఆర్థిక ఆంక్షలు యెడల మెత్తగా ఉండాలని నిర్ణయించాయి. కానీ తాజాగా రష్యాతో యు.కె. వివాదం నాటోను పటిష్టపర్చేవిగానూ, రష్యాను ఒంటరినిచేసి ఆర్థిక ఆంక్షలు మరింత జటిలమయ్యేటట్లునూ, నాటో పశ్చిమయూరపులో అధునాతన అణ్వాయుధాలను నెలకొల్పేందుకే స్క్రిపాల్ నోవిచొక్ నెర్వ్‌గ్యాసు ఉదంతం సృష్టించబడిందని ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ రాసింది.

నాటో సెక్రటరీ జనరల్ నాల్గడుగులు ముందుకువేసి రష్యా, చైనా, ఉత్తరకొరియాల దగ్గర కావల్సినన్ని అణ్వాయుధాలున్నాయని, వీరికి వ్యతిరేకంగా యూరపు దేశాలన్నీ ఏకమై అణ్వాయుధాల్ని ఆధునీకరించి, సంఖ్యను పెంచవల్సిన అవసరముందనేంతవరకూ వెళ్లిపోయాడు. ఎక్కడి స్క్రిపాల్ విషవాయువు పీల్చటం-ఎక్కడి అణ్వాయుధాల పోటీ? ఇదంతా చూస్తుంటే సరిగ్గా 2003 సంవత్సరంలో ఇరాక్‌పై యుద్ధం కోసం నాటో, యు.కె. దేశాలు ప్రజలను నమ్మించటానికి ముందుగా సద్దామ్ హుస్సేన్ దగ్గర రసాయన మారణాయుధాలు ఉన్నాయని చెప్పి యుద్ధానికి దింపి యుద్ధం


స్క్రిపాల్


జూలియా

చేసి అమెరికా స్థావరాల్ని ఇరాక్‌లో ఏర్పరచుకొన్న విషయం గుర్తుకువస్తుంది.

విషవాయువుల ప్రయోగం సామ్రాజ్యవాదానికే చెల్లు

2017 సంవత్సరం ఏప్రిల్ 7 సిరియా అస్సాద్ ప్రభుత్వం దగ్గర రసాయన ఆయుధాలు ఉన్నాయని నాటో 59 టోమాహాక్ క్షిపణుల్ని ప్రయోగించి అనేకమంది సామాన్యులను చంపి షేరాత్ ఎయిర్‌ఫీల్డ్‌ను ధ్వంసం చేసిన విషయాన్ని ఇంకా మరువలేదు. కానీ ఇప్పటివరకూ సిరియా రసాయన ఆయుధాలు కలిగివుందని అమెరికా మిత్రదేశాలు నిరూపించలేకపోయాయి. రసాయన బాంబులంటే ముందుగా మనము వియత్నాంపై అమెరికా చేసిన 14 సంవత్సరాల యుద్ధాన్ని గుర్తు చేసుకోవాలి. ఆపరేషన్ 'రాంచ్ హ్యాండ్' పేరిట 1961 నుండి 1971 మధ్య వియత్నాం, లావోస్, కాంబోడియాలలో కనీసం 2 కోట్ల గ్యాలన్ల హెర్బిసైడ్స్ రసాయనాలను విమానాల ద్వారా అడవుల్లోనూ, పంట పొలాల్లోనూ, నదుల్లోనూ చల్లిన హీనాతిహీనమైన చరిత్ర అమెరికా సామ్రాజ్యవాదానిదే కదా. దీనికిగానూ ఏజంట్ ఆరంజ్ రసాయన మృత్యు డియోక్సిన్ విషవాయువును ఉపయోగించారు. తదనంతర కాలంలో దీని పర్యవసానంగా ప్రజలు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులయ్యారు. శిశువులు వికలాంగులుగా జన్మించారు. మానసిక, నరాల సమస్యలతో ప్రజలు బాధపడిన సంగతి ప్రపంచమింకా మరచిపోలేదు. 45 లక్షల ఎకరాల వియత్నాం అడవులు సర్వనాశనమయ్యాయి. ఆరంజ్ ఏజెంట్‌తో పాటుగా ఏజంట్ పింక్, ఏజెంట్ గ్రీన్, ఏజంట్ పర్పుల్, ఏజెంట్ వైట్, ఏజెంట్ బ్లూలను కూడా ప్రయోగించారు. ఇవన్నీ మోన్‌సాంటో సంస్థతో తయారుకాబడినవే. భారతదేశంలో రైతుల ఆత్మహత్యలకు ఒక ప్రధాన కారణం మోన్‌సాంటో విత్తనాలు, రసాయనాలే.

అసలు 'నోవిచొక్' అను విషవాయువు ఉనికిలో ఉన్నదనేది కూడా ప్రశ్నార్థకమే అని కొందరు సైంటిస్టుల అభిప్రాయం.

రష్యాపై చేస్తున్న స్క్రిపాల్-నోవిచొక్ ఆరోపణ 'నిజంగా ప్లాపయిన జేమ్స్‌బాండ్ చిత్రం' వలే ఉందని జర్మనీ మాజీ విదేశాంగమంత్రి సిగ్మార్ గాబ్రియేల్ వ్యాఖ్యానించారు.

రష్యాపై 'నోవిచొక్' ఆరోపణ జరిగిన సాలిస్‌బ్యురీకు సమీప ప్రాంతమైన పోర్టోన్‌డౌన్‌లో బ్రిటీష్ ప్రభుత్వ బయో-కెమికల్ వార్‌ఫేర్ ప్లాంటు ఉన్నది. పోర్టోన్‌డౌన్‌లోని డెటెక్షన్ లాబొరేటరీ హెడ్ డా॥ రోబిన్‌బ్లాక్ అసలు నోవిచొక్ నెర్వ్‌గ్యాస్ ఉనికిపై అనుమానాలు వ్యక్తపరిచారు. ఆన్‌లైన్ గూగుల్స్ బుక్‌లో డా॥ బ్లాక్ 1970 ప్రాంతంలో రష్యాలో ఒక అసమ్మతీయ మిలిటరీ కెమిస్టు విల్ మిర్జాయనోవ్ నెర్వ్‌గ్యాసుల నుండి రక్షణపొందే కెమికల్‌ను తయారుచేసినట్లు ప్రకటించినా దానికి సంబంధించిన మూలాలను మాత్రం ఇంతవరకూ పబ్లిష్ చేయలేదని ప్రకటించారు. 1995లో అదే మీర్జాయనోవ్ తన నెర్వ్‌గ్యాసు మూలాలతో రసాయన నోవిచొక్‌ను ఎవరైనా తయారుచేసినట్లు తనవద్ద సమాచారం లేదన్నారు. మరలా 2008లో తను ప్రచురించిన ఒక పుస్తకంలో నోవిచొక్ మూలాలపై రష్యా కెమికల్ ఆయుధాల ప్రోగ్రామ్ పనిచేసిందని అన్నారు. ఈ నోవిచొక్ రసాయనాన్ని కెమికల్ కర్మాగారంలో తయారుచేయుట సాధ్యమనే తన వాదనను సైంటిస్టులు బ్రిటన్‌లోనూ, మిగతాచోట్ల కొట్టిపారేశారు. ఇంతవరకూ నోవిచొక్ నెర్వ్‌గ్యాసు అనేది ఒక ఊహామాత్రమేనని దీన్ని ఎవరూ చూడలేదనేది ఒక బలమైన వాదన. కనుకనే ఐరాస ఒపిసిడబ్ల్యు వెబ్‌సైట్‌లో 'నోవిచొక్'ను చేర్చనేలేదు. దీనికి సంబంధించిన ఎటువంటి నిర్ధారణ లేకపోవటమే కారణం.

సర్గీస్క్రిపాల్ – జులియాల 'నోవిచొక్' ఉదాంతం కట్టుకథలా చేసి రష్యాపై మాత్రం యుద్ధ సన్నాహానికి బ్రిటిష్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదనేది మాత్రం సుస్పష్టమవుతున్నది. పరిశోధనల్లో నిరూపించబడితేగానీ నిజానిజాలు బయటపడవు. వ్యక్తులపై దోపిడీవర్గాల అనాగరిక హత్యాప్రయత్నాలు ప్రయోగాలు అనాదినుండీ వస్తూనే ఉన్నాయి. ఈ విషయంలో సామ్రాజ్యవాదం, మతోన్మాదం ఎప్పుడూ ముందు ఉంటాయి. ఆరువందలసార్లుకుపైగా ఫిడెల్‌కాస్ట్రోపై హత్యాయత్నం. చెగువేరా హత్య, మన దేశంలో భగత్‌సింగ్ సుఖ్‌దేవ్-రాజ్‌గురుల హత్య (ఉరి), అల్లూరి సీతారామరాజు వంటి దేశభక్తుల హత్యలు, గాంధీజీ హత్య ఈ కోవలోకే వస్తాయి. హత్యల సాంప్రదాయం సామ్రాజ్యవాదానిదే హత్యారాజకీయాల ద్వారా భావజాలాన్ని కనుమరుగు చేయలేరు. కల్బుర్గీ పన్సారే ధబోల్కర్‌ని హత్యచేసినంత మాత్రాన స్వేచ్ఛావాయువులు వీచకమానవు. విగ్రహాలు కూల్చినంత మాత్రాన భావజాలం వెనుకడుగు వేయదు. గోబెల్స్ ప్రచారాలకు అన్నివేళలా ఆదరణ లభించదు.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : 9849491969

ఉద్యమాలతోనే 'హోదా' సాధన


వి. శంకరయ్య

గత నాలుగైదు రోజులుగా లోక్ సభలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పోకడలను తిలకిస్తే ప్రధాని మోడీ ప్రపంచ నియంతలను మించిపోయే విధంగా వుంది. తన చేతులకు మట్టి అంటకుండా ప్రజాస్వామ్యాన్ని నిలువు లోతులో పూడ్చి పెడుతున్నారు. అనూహ్యమైన పరిస్థితులు ఢిల్లీలో నెలకొని వుంటే ముందుగా ఏ మాత్రం పసిగట్టలేక పోగా మూడున్నరేళ్ళు బీజేపీతో కాపురం చేసిన ముఖ్యమంత్రి నలభై ఏళ్ళ రాజకీయానుభవం ఏమైందో చెప్పనక్కర్లేదు. తొలి నుండి బీజేపీ ప్రధాని మోడీ తత్వం ఎరిగిన రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ప్రత్యేక హోదా కోసం వీధుల్లోకి వచ్చినప్పుడల్లా ముఖ్యమంత్రి పోలీసులకు పని చెప్పి ప్రధాని వద్ద మెప్పు పొందేవారు. తుదకు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొని అంగలార్చుతున్నారు. ప్రజా క్షేత్రంలోనే తేల్చుకోవాల్సిన రోజులు ఏర్పడ్డాయి.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యేక హోదా సాధనకు సాగుతున్న ఉద్యమాలను సమైఖ్య పరిచి కేంద్రం నుండి నిధులు, రాయితీలు రాబట్టే కృషిలో కూడా తెలుగు దేశం పార్టీ భిన్నమైన వైఖరి చేపడుతోంది. తనకు అనుకూలమైన మీడియాలో చిత్ర విచిత్రమైన కథనాలను ప్రచారంలో పెడుతోంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఎంతకైనా తెగించి తుది పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో ఇలాంటి కథనాలు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే ప్రమాదం పొంచి వుంది. సోమవారం విజయవాడలో జరిగిన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో తెలుగుదేశం మినహా అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యమం ఉధృతం చేసేందుకు కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 22 వ తేది జాతీయ రహదార్లను దిగ్బంధం చేయాలని ప్రకటించారు. ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన అంశం గమనించాలి. గుంటూరులో జరిగిన సభలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక హోదా సాధనకు ఆమరణ దీక్ష సాగిస్తానని ప్రకటించారు. తదుపరి పవన్‌ను కలిసిన వామపక్ష నేతలు దశల వారీగా ఉద్యమాన్ని ఉధ ృతం చేయాలని తుది అస్త్రంగా ఆమరణ దీక్ష సాగించాలని సూచించగా అందుకు పవన్ కళ్యాణ్ అంగీకరించారు. అయితే ఇలాంటి ఉద్యమం సాగడం ముఖ్యమంత్రికి సుతరామూ ఇష్టం లేదు. తాము బీజేపీతో కేంద్ర ప్రభుత్వంతో పూర్తిగా సంబంధాలు తెంచుకొన్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పార్టీలు క్షేత్ర స్థాయిలో ప్రజలను సమీకరించి కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించడం ద్వారా ప్రత్యేక హోదా సాధిస్తే ఇది తన ఖాతాలో కాకుండా పోతుందని ముఖ్యమంత్రికి భయం పట్టుకున్నట్లుంది. నిన్నమొన్నటి వరకు పార్లమెంటు ఆవరణలోను, సభ లోపల తమ సభ్యులు చేసిన ఆందోళన ఎందుకూ కొరగాకుండా పోయింది. ప్రపంచ నియంతలను తలదన్నే విధంగా ప్రధాని మోడీ రెండు మూడు రోజుల్లో లోక్ సభను నిరవధికంగా వాయిదా వేసే అవకాశం లేక పోలేదు.

వాస్తవాలు ఇలా వుండగా ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చిత్రించే తన అనుకూల మీడియా చేత గరుడ ఆపరేషన్ అనే దిక్కుమాలిన పథకమొకటి అమలు కానున్నట్లు ప్రచారంలో పెట్టించారు. ప్రత్యేక హోదా సాధనకు అన్ని ప్రతిపక్షాలు ఏకమై ఉద్యమం సాగిస్తే పరాకాష్టగా పవన్ కళ్యాణ్ ఆమరణ దీక్ష చేస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు భగ్నమౌతాయని ఇది సాకుగా చూ పెట్టి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయవచ్చని ప్రచారంలోనికి తీసుకువచ్చారు. అంటే రాష్ట్రంలో కొనసాగుతున్న ఉద్యమం వెనుక బీజేపీ హస్తం ఉందని పరోక్షంగా ప్రచారంలోనికి తీసుకువచ్చారు. ఈ దిక్కుమాలిన వాదన ఎలా వుందంటే సోమవారం విజయవాడలో సమావేశమైన అన్ని ప్రతిపక్షాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పురమాయించిందని చిత్రించడం ఎంత అపహాస్యంగా వుందో చూడండి!. తుదకు వామ పక్షాలను కూడా ఈ దిక్కుమాలిన వాదనలోనికి తీసుకువచ్చారు. అంటే ప్రత్యేక హోదా సాధనకు రాష్ట్రంలో ఎట్టి ఉద్యమం జరగకూడదని ఆపరేషన్ గరుడ ప్రచారంలో పెట్టడం ద్వారా పరోక్షంగా వ్యక్తపరచడమే. మరో పక్క పవన్ కళ్యాణ్ వామపక్షాలతో కలిసి పోరాటాలకు సిద్ధమౌతుంటే బీజేపీ వెనక వుండి ఆడిస్తున్నదని ఆరోపణతో తమ తప్పులు మరుగు పరచుకొనేందుకు ముఖ్యమంత్రి తంటాలు పడుతున్నారు. తను పలుమార్లు రాష్ట్రంలో సాగుతున్న అవినీతి గురించి ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చినట్లు పవన్ కళ్యాణ్ నొక్కి చెబుతున్నారు. ఇది అవాస్తవమని ముఖ్యమంత్రి బహిరంగంగా ఎందుకు స్పందించడం లేదు? ఎదురు దాడితో సరి పెట్టడం ద్వారా ముఖ్యమంత్రి బలహీనత కొట్ట వచ్చినట్లు కన్పిస్తోంది.

గత మూడేళ్ళుగా తెలుగుదేశం, బీజేపీ సాగించింది దాంపత్యం కాదు. నిజమే అయివుంటే 2014 నుండి 2016 వరకు ప్రత్యేక హోదా ఐదేళ్ళు కాకుండా పది పదిహేనేళ్ళు కావాలని ప్రకటించిన ముఖ్యమంత్రి 2016 సెప్టెంబరు వచ్చే సరికి ప్రత్యేక ప్యాకేజీకి ఎందుకు అంగీకరించారు? ఇందులో వున్న మతలబు ఏమిటి? 2017 మార్చిలో ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత లభించిందని శాలువాలు కప్పుకొని స్వీట్లు ఒకొరికొకరు తినిపించుకొన్న వారు 2018 మార్చి ఒక సంవత్సరానికే ఈ నిఖార్సైన దాంపత్యం ఎందుకు చట్టుబండలైంది? ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రయోజనాలను తన రాజకీయ ప్రయోజనాలకు బలి పెట్టడమే తప్ప మరొకటి కాదు. పోలవరం ప్రాజెక్టు గురించి జాతీయ మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కొత్త అంశమొకటి బహిర్గతం చేశారు. 2016 సెప్టెంబరులో ప్రత్యేక ప్యాకేజీకి అంగీకారం కుదిరిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఒక నోట్ విడుదల చేసింది. అందులో తాము ఇరిగేషన్ కాంపోనెంట్‌లో మాత్రమే భరిస్తామని కేంద్రం స్పష్టంగా పేర్కొన్నది. తదుపరి భూ సేకరణ అంశం ప్రస్తావనకు వచ్చినపుడు కేంద్ర రాష్ట్ర అధికారుల మధ్య భిన్న వైఖరులు వ్యక్తమైనాయి. ఇరిగేషన్ కాంపొనెంట్ లో భూ సేకరణ కలిసి లేదని కేంద్రం - భూ సేకరణ కూడా కలిసి వుందని తాము భావించినట్లు రాష్ట్ర అధికారుల మధ్య చర్చలు జరిగాయి. ఈ అంశానికి పవన్ కళ్యాణ్ ప్రకటనకు లింకు కన్పిస్తోంది. భూ సేకరణ వ్యయం భారీగా వుంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా భరించగలదని కేంద్రం ప్రశ్నిస్తే ఎలాగో సర్దుకుంటామని రాష్ట్రం జవాబు చెప్పినట్లు పవన్ కళ్యాణ్ ఈ రోజు వరకు ఎవరికి తెలియని అంశాన్ని బహిర్గతం చేశారు. ఆ తర్వాత కూడా ఏది వాస్తవమో ముఖ్యమంత్రి గాని, రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి గాని స్పష్ట పరచలేదు. అంతే కాదు పోలవరానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పిలిచిన టెండరు అంచనాలకు ప్రస్తుతం నవయుగ సంస్థకు పనులు అప్పగించిన అంచనాకు మధ్య రూ. 200 కోట్లు తేడా వుంది. ఈ అంశాన్ని రాష్ట్ర బీజేపీ నేతలు ఇది వరకే నిలదీసి వున్నారు. ఇదంతా పరిశీలిస్తే పోలవరం ప్రాజెక్టు పనులలో అవినీతి చోటు చేసుకున్నదని పవన్ కళ్యాణ్ ప్రకటించిన ప్రకటనకు ప్రాతిపదిక కన్పిస్తోంది. అయితే నిర్దిష్టమైన అంశాలకు మాత్రం ముఖ్యమంత్రి నుండి గాని, దేశం నేతల నుండి గాని సమాధానాలు రావడం లేదు.

14వ ఆర్థిక సంఘం తాము ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వవద్దని ఎక్కడా చెప్పలేదనే అంశం గురించి గత మూడేళ్ళుగా ఏపీలోని అన్ని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. మూడున్నరేళ్ళూ మూగనోము పట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఆ ప్రస్తావన తీసుకురావడం అపహాస్యంగా వుంది. 2016 సెప్టెంబరులో ప్రత్యేక ప్యాకేజి కుదిరినప్పుడు ఈ అంశం ఎందుకు గుర్తుకు రాలేదు? అప్పటి రాజకీయావసరాలు అటువంటివి. ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో దశల వారీగా స్వవచన విఘాతాలకు ముఖ్యమంత్రి పాల్పడుతున్నారు. 2015-16 నుండి 14 వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోనికి వచ్చాయి. 13 వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు 2014-15 కేంద్ర బడ్జెట్‌లో నాలుగు పథకాల క్రింద 46,410 కోట్లు కేటాయించి వ్యయం చేశారు. పైగా 2013-14 కేంద్ర బడ్జెట్ లో ప్రత్యేక హోదా గల రాష్ట్రాలకు కల్పించిన పన్ను రాయితీల వలన 18,543 కోట్లు, 2014-15 బడ్జెట్ లో 17,244 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోయింది. 2015-16 లో ప్రత్యేక హోదానే ఏపీకి అమలు జరిగి వుంటే ఒక్క సంవత్సరంలోనే దాదాపు 10 వేల కోట్ల రూపాయలు ఏపీకి అంది వుండేది.

ఏపీకి ప్రత్యేక హోదా ఎగ్గొట్టడంలో ఆర్థిక పరమైన అంశాలే కాకుండా రాజకీయ పరమైన అంశాలతో పాటు ప్రధాని ముఖ్యమంత్రి మధ్య గల వ్యక్తిగత స్పర్థలు కారణమని తాజాగా పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటన ద్వారా వెల్లడౌతోంది. ప్రధాని మోడీ రాజకీయ ప్రయోజనాలు లేనిదే ఏ రాష్ట్రానికి నిధులు విదల్చడం లేదు. ఏపీలో బీజేపీ ఎదుగుదల అంతంత మాత్రమే. 2014 తొలి రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ శూన్యత వుందని బీజేపీ దాన్ని భర్తీ చేస్తుందని అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. అంటే కాంగ్రెస్ నేతలంతా బీజేపీలో చేరుతారని భావించారు. గమనార్హ మైన అంశమేమంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకు అంతా వైసీపీ వెంట వెళ్ళడంతో కాంగ్రెస్ నేతలు వ్యక్తులుగా మిగిలిపోయారు. ఇది గమనించిన బీజేపీ అధిష్టాన వర్గం ఏపీకి తోక కోసి సున్నం పెట్టడం ప్రారంభించింది. 2014 లో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన చంద్రబాబు ఈ అంశాలన్నీ పరిగణనలోనికి తీసుకొని వ్యవహరించి వుంటే కొంత మేరకైనా ఏపీ ప్రజలకు మేలు జరిగేది. ఇందుకు తన రాజకీయ బలహీనతలు రాష్ట్రంలో అవినీతికి తెర లేపిన టీడీపీ నేతలను అదుపు చేయలేక పోవడం పైగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడడం తన జుట్టును కేంద్రానికి ఇచ్చినట్లైంది. తనకు కావలసినంత మెజారిటీ వున్నా పార్టీ ఫిరాయింపులకు పాల్పడడంతో జాతీయ స్థాయిలో ప్రతిష్ట కోల్పోవడమే కాకుండా చట్టబద్ధంగా పెరగవలసిన శాసన సభ నియోజక వర్గాల పెంపుదల కూడా చేజార్చుకొన్నారు. ఇవన్నీ తెలుగుదేశం పార్టీకి నష్టం చేసినా ఈ బలహీనతలతో కేంద్ర ప్రభుత్వం జూదం ప్రారంభించి రాష్ట్ర ప్రజలకు తీరని అపకారం చేసింది. ఈ స్థితిలో ప్రజా క్షేత్రంలో ఉద్యమాలు తప్ప ప్రధాని మోడీ మెడలు వంచే మరో మార్గం లేదు.

- వ్యాస రచయిత : విశ్రాంత పాత్రికేయుడు,
సెల్ : 9848394013



అటవీ సంపదను కాపాడుకుందాం

ప్రకృతిలో సరైన సమతూకం ఉండాలంటే ఒక దేశ వైశాల్యంలో 23 శాతం అటవీ ప్రాంతం ఉండాలి. ప్రస్తుతం మొత్తం భారతదేశ వైశాల్యంలో అటవీ విస్తీర్ణం సుమారు 21 శాతం మాత్రమే ఉన్నట్లు సెంట్రల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఇటీవల ప్రకటించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ ఉపగ్రహం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం భారతదేశం ప్రతీ యేటా 13.101 చ.కి.మీ భూమిని కోల్పోతున్నది. నేడు మన దేశంలో సుమారు ఆరు కోట్ల 49 లక్షల హెక్టార్ల భూమి అటవీ ప్రాంతం కింద ఉన్నట్లు అంచనా. ప్రపంచ జనాభాలో 17 శాతం భారతదేశంలో ఉండగా ప్రపంచ అడవుల్లో కేవలం ఒక్క శాతాన్ని మాత్రమే కలిగి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకు సుమారు 20 లక్షల హెక్టార్ల అడవులు నాశనమవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పర్యావరణం పూర్తిగా నాశనమై ఘోర విపత్తులు సంభవించే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు. మానవుడు తన అవసరాల కోసం విచక్షణారహితంగా అడవులను నరికేస్తున్నారు. అడవులు నశించడం వల్ల వన్యప్రాణుల సంఖ్య తగ్గుతుంది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పోడు వ్యవసాయం పేర అటవీ సంపదను నాశనం చేస్తున్నారు. కొంతమంది ఆకతాయిలు అడవులకు నిప్పు పెడుతున్నారు. కొంతమంది స్మగ్లర్లు అటవీ శాఖ అధికారుల అండదండలతో అడవులలోని విలువైన చెట్లను నరుకుతూ కర్రను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మనందరం అడవులను కాపాడుకోకపోతే వాతావరణ కాలుష్యం పెరిగి అనేక వ్యాధులు సంభవించే అవకాశం ఉంది. ప్రతీ ఒక్కరు చెట్లను పెంచుదాం - వాటిని కాపాడుకుందాం అనే నినాదాన్ని పాటించాలి. వృక్షోరక్షతి రక్షితః, పచ్చని చెట్లు - ప్రగతికి మెట్లు, అడవులను పెంచుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం లాంటి నినాదాలను విశ్వవ్యాప్తం చేద్దాం.

(నేడు "ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భముగా)

- కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా



చదువే పిల్లల భవితకు భరోసా!

ఒకప్పుడు ఎవరికైనా పెళ్లి చేయడం, ఇల్లు కట్టుకోవడం ఈ రెండే ఆర్థిక లక్ష్యాలుగా ఉండేవి. ఉద్యోగస్తులు రిటైరయ్యేలోపు ఈ రెండింటినీ సాధిస్తే చాలనుకునేవారు. ఒకవేళ సాధించలేకపోయినా, పిల్లలకు పెళ్లిళ్లు చేసి, రిటైరైన తర్వాత వచ్చిన డబ్బుతో ఇల్లు కట్టుకుని, ఆ తర్వాత ఫించన్‌తో హాయిగా జీవించేవారు. కానీ రోజులు మారాయి. ప్రస్తుత రోజుల్లో ఇల్లు, పిల్లల పెళ్లి కంటే ముందు వాళ్ల చదువుల గురించి ఆలోచిస్తున్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా... వాటిని తట్టుకొని పిల్లలకు చక్కటి భవిష్యత్తును అందించేందుకు ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు తల్లిదండ్రులు. దానికి తగ్గట్టుగానే ప్రస్తుత రోజుల్లో పిల్లల చదువులు మరింత భారంగా మారాయి. మరి అలాంటప్పుడు పిల్లల చదువుల కోసం పొదుపు చేయాలంటే అందుబాటులోఉన్న మార్గాలేమిటో చూద్దాం.

పిల్లల కోసం రకరకాలుగా పొదుపు చేస్తున్న పలువురితో ఈ మధ్య ఓ ప్రయివేటు బీమా సంస్థ సర్వే చేసింది. సర్వేలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. పిల్లలకోసం పొదుపు చేస్తున్న వారిలో 77 శాతం మంది పిల్లల చదువు కోసం చేస్తుండగా, మిగతా 23 శాతం మంది మాత్రం వారి పెళ్లి కోసం చేస్తున్నారు.

దీనికి ప్రధాన కారణం విద్యా వ్యయం ఏటా 10 - 12 శాతం చొప్పున పెరుగుతుండటమే. దీంతో పిల్లలకు సరైన చదువు చెప్పించగలమా? లేదా? అనే భయం తల్లిదండ్రులను వెంటాడుతోంది. అందుకే, మదుపు వైపు చూస్తున్నారు తల్లిదండ్రులు.

ఎక్కువ మంది బీమానే ఎంచుకుంటున్నారు

పిల్లల కోసం పొదుపు అనగానే ఠక్కున గుర్తుకొచ్చేవి బీమా పథకాలే. వీటికి బాగా డిమాండ్ ఉండటంతో బీమా కంపెనీలు ఎప్పటికప్పుడు పలు కొత్త పథకాలను కూడా ప్రవేశపెడుతున్నాయి. పిల్లల కోసం పెట్టుబడి పెడుతున్న వారిలో అత్యధికంగా 64 శాతం మంది బీమా పథకాలవైపే మొగ్గు చూపుతున్నారు. ఈ మధ్యనే ఎల్ఐసీ చైల్డ్ కేర్, న్యూ చిల్డ్రన్ మనీ బ్యాక్ పాలసీలను ప్రవేశపెట్టింది. ఇవి పేరుకు పిల్లల పాలసీలైనా... తల్లిదండ్రుల పేరు మీదనే పాలసీలను ఇస్తారు. కాబట్టి మంచి పథకాన్ని ఎంచుకొని దీర్ఘకాలంలో వారికి ఎలాంటి ఇబ్బందీ రాకుండా చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. అంతేకాదు, ఈ బీమా పథకాలు పిల్లలకు 18 ఏళ్ళు నిండిన తర్వాత మాత్రమే సొమ్ము తిరిగి చెల్లించే నిబంధన ఉంది. కాబట్టి, దీర్ఘకాలం మదుపు చేస్తూ పెద్ద మొత్తంలో నిధిని సమకూర్చుకునే వెసులుబాటు ఉంది.

స్థిరమైన ఆదాయం...

దాదాపు అందరికీ స్థిరంగా ఒక ఆదాయ మార్గం ఉంటుంది కాబట్టి కాస్త జాగ్రత్తగా ప్రణాళిక వేసుకుంటే ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అనుకున్న లక్ష్యాలను సాధించడానికి వీలవుతుంది. పిల్లలు పుట్టిన వెంటనే పొదుపు-మదుపుపై దృష్టి సారించి దీర్ఘకాలం కొనసాగించాలనుకునే వారు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పి.పి.ఎఫ్), నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్స్ వంటి పథకాలను ఎంచుకుంటే మంచిది.

తక్కువ కాలమైనా పెట్టిన పెట్టుబడికి ఎలాంటి నష్టం కలగకుండా ఉండాలంటే స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే బ్యాంకు డిపాజిట్లు, పోస్టాఫీస్ వారి జాతీయ పొదుపు పత్రం, ప్రజా భవిష్య నిధి ఎంతో సహకరిస్తుంది. దీర్ఘకాలిక ఇన్వెస్ట్‌మెంట్ పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌కు 15 ఏళ్ళ కాలపరిమితి, 8.7 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసిన మొత్తంపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు వర్తిస్తుంది.

మీరు ఎంచుకునే పాలసీలకు, పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోండి. పాలసీలోని ప్రతి విషయం గురించి మీరు సంతృప్తి చెందాకే వాటిపై సంతకం చేయాలి. అప్పుడే మీ పిల్లల భవితకు పూర్తి భరోసా కల్పించినవారవుతారు.



రంగు నిలబడడం లేదా!

జుట్టుకి రంగేయడం ఇప్పుడు మామూలైపోయింది. ఫ్యాషన్ పేరుతో రకరకాల రంగులు వేసేవాళ్ళు కొందరైతే చిన్నతనంలోనే జుట్టు నెరిసిపోయి ఆ జాడలు తెలియకుండా ఉండేందుకు రంగేస్తున్నవాళ్ళు మరికొందరు. ఇలా ఏదో రకంగా చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ళ వరకూ అందరూ జుట్టుకి రంగేయడం పరిపాటైపోయింది. రోజువారీ అన్ని పనుల్లో భాగంగా జుట్టుకి రంగేయడమూ ఒక పనిగా పెట్టుకున్నవాళ్ళూ ఉన్నారు. కారణం వేసిన రంగు వేసినట్టే పోవడం. మీరూ ఈ జాబితాలో ఉన్నారా? జుట్టుకి వేసిన రంగు ఎక్కువ రోజులు ఉండాలంటే ఏం చేయాలో తెలియడం లేదా! కొంచెం శ్రద్ధ పెడితే చాలు మీ సమస్య పరిష్కారమైపోతుంది. జుట్టుకి రంగు వేసే ముందు ఏం జాగ్రత్తలు తీసుకోవాలో మీ అందరికీ తెలిసే ఉంటుంది. ఆ తర్వాత ఏం చేయాలో కూడా దృష్టి పెట్టండి. జుట్టుకి వేసిన రంగు ఎక్కువ రోజులు ఉంటుంది. అందుకు ఏం చేయాలంటే...!

1. జుట్టుకి రంగేశారా? అయితే మరో మూడు రోజుల వరకూ తలస్నానం చేయవద్దు. వెంటవెంటనే తలస్నానం చేస్తే జుట్టు రంగు పోతుంది. సెలూన్‌కి వెళ్ళి రంగు వేయించుకుని వచ్చారా? అయితే పూర్తిగా ఆరేవరకూ ఉంచండి. అంతవరకూ జుట్టుని కదపవద్దు.

2. మనలో చాలామందికి వేడి నీళ్ళతో స్నానం చేసే అలవాటు ఉంటుంది. అందులోనూ తలస్నానం అంటే తప్పనిసరిగా వేడినీళ్ళు ఉపయోగిస్తారు. మీకూ ఈ అలవాటు ఉందా? ఉంటే మార్చుకోండి. జుట్టుకి రంగు వేసినప్పుడు వేడినీళ్ళతో అస్సలు తలస్నానం చేయవద్దు. చన్నీళ్ళతోనే తలస్నానం పూర్తిచేయండి. బాగా చన్నీళ్ళు చేయలేకపోతే కనీసం గోరువెచ్చని నీళ్ళు పోసుకోండి. అంతేగానీ వేడినీళ్ళు అస్సలు ఉపయోగించవద్దు. వేడినీళ్ళు జుట్టు రంగుని త్వరగా పోగొడతాయి.

3. సల్ఫేట్ లేని షాంపూలనే ఎంచుకోండి. సల్ఫేట్ ఉన్న షాంపూల వల్ల జుట్టు పొడిబారిపోవడమే కాదు తొందరగా చిట్లిపోతుంది కూడా. వీటివల్ల జుట్టు రంగు తొందరగా పోతుంది.

4. జుట్టు ఆరబెట్టడానికి లేదా జుట్టుకి సంబంధించిన ఇతరత్రా పనుల కోసం ఎలక్ట్రానిక్ హీటింగ్ పరికరాలను వాడవద్దు. జుట్టుకి రంగేసిన తర్వాత డ్రయ్యర్ లేదా స్ట్రయిట్‌నర్ లాంటివి ఉపయోగించవద్దు. ఇవి కూడా జుట్టుని తొందరగా పొడిబారేలా చేస్తాయి. జుట్టుని సహజసిద్ధంగా ఆరబెట్టుకోండి.

5. వెంట్రుకల చివర్లు చిట్లిపోకుండా కనీసం రెండు, మూడు నెలలకు ఒకసారి ట్రిమ్ చేయండి. జుట్టుకి రంగు వేయడం వల్ల చివరలు తొందరగా చిట్లిపోతాయి. ఇలాకాకుండా ఎప్పటికప్పుడు ట్రిమ్ చేస్తే



జుట్లు చిట్లిపోకుండా ఉండడమే కాదు జుట్టు పొడవుగా, ఒత్తుగా పెరుగుతుంది.

6. జుట్టుకి వేసే రంగులో ఉండే రసాయనాల వల్ల వెంట్రుకల్లో ఉంటే సహజమైన ప్రోటీన్లు పోతాయి. వీటిని తిరిగి పొందేందుకు గుడ్డు, గోరింటాకులాంటి వాటితో వారానికి ఒకసారైనా హెయిర్ మాస్క్‌లు వేయండి.

7. సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాలు జుట్టు మీద పడకుండా చూసుకోండి. కొన్ని నెలలైనా ఇలా జాగ్రత్తపడండి.

8. జుట్టు పెరుగుదలకైనా, సంరక్షణకైనా విటమిన్లే కీలకం. జుట్టుని కాపాడుకునేందుకు బహిర్గతంగా తగిన చర్యలు తీసుకోవడమే కాదు అంతర్గతంగా బలాన్ని చేకూర్చే విషయం పైనా శ్రద్ధ పెట్టండి. విటమిన్ సీ ఎక్కువగా ఉండే ఆహారం, గుడ్డు, పాలు, కారట్ లాంటి ప్రోటీన్ ఆహారం ఎక్కువగా తీసుకోండి.

జుట్టు బాగా తెల్లబడిపోయి నలుగురిలోకి వెళ్ళలేని పరిస్థితుల్లో నల్ల రంగు వేసుకోవడం ఒకింత సముచితమేమో గానీ ఫ్యాషన్‌లకు పోయి జుట్టుకి రకరకాల రంగులు వేస్తే మాత్రం మొదటికే మోసం వస్తుంది. మొత్తంగా జుట్టు అంతా పాడైపోయే ప్రమాదమూ ఉంది. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. జుట్టు నెరిసినవాళ్ళు కూడా రంగు బదులు గోరింటాకు పొడి, హెన్నాలాంటి వాటినే వాడడం అత్యుత్తమం.



పాత ఇంటికి కొత్త కళ

మీరు సొంత ఇల్లు కొనుక్కుందామనో లేదంటే కొత్తగా మరో అద్దె ఇంటికి మారదామనుకునో అనుకున్నప్పుడు మీకు ఒక పాత ఇల్లు తారసపడిందనుకోండి. మీకు అది నచ్చలేదు. అప్పుడు ఏం చేస్తారు? మీకు నచ్చిన అన్ని హంగులతో కూడిన ఇల్లు కోసం వెతుకుతారు. కానీ దాని బడ్జెట్ మీ ఆర్థిక పరిధిలో లేదనుకోండి. మరి అప్పుడు ఏం చేస్తారు? నచ్చిన ఇంటికి కావలసినంత సొమ్ములు పెట్టలేరు. పాత ఇంట్లోకి వెళ్ళడం ఇష్టంలేదు! ఇలా మీమాంస పడుతూనే ఉంటారా! ఏం చేయాలి అని మధనపడుతూనే ఉంటారా? అంత అవసరం లేదు. కొంచెం తెలివి ఉపయోగించండి చాలు. అందుకు ఇంకొంచెం మీదైన సృజనాత్మకతని జోడించండి. ఇంకేం అక్కర్లేదు. మీకు నచ్చిన ఇల్లు మీ సొంతమవుతుంది. అదెలా అంటారా! మీ బడ్జెట్‌లో ఉన్న పాత ఇంటినే మీకు నచ్చిన విధంగా తయారు చేసుకోవడమే. ఒక్కమాటలో చెప్పాలంటే పాత ఇంటికి కొత్త కళ తీసుకురావడమే...అది కూడా మీదైన....మీకు నప్పిన....మీకు నచ్చిన కళను తీసుకురావడమే...అంతే....సింపుల్! అవునంటారా...కాదంటారా....మరి ఇందుకోసం ఏం చేయాలంటే...

ఇంటిని మనకు నచ్చినట్లు అలంకరించుకోవడం అనేది కొంచెం కష్టమైనదే. కానీ అదేమీ మరీ పెద్ద విషయమేమీ కాదు మనస్సు పెడితే మీ ఇంటిని మీకు నచ్చినట్టు అద్భుతంగా డిజైన్ చేసుకోవచ్చు. అందుకోసం కొన్ని మార్పులు చేయండి చాలు.

ఇంట్లో బాగా వెలుతురు ఉండేలా చూసుకోండి. మంచి వెలుతురు మన ఆలోచనలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా వంటగదిలో కావలసినంత వెలుతురు ఉండేలా చూసుకోండి. కిటికిలు పెద్దగా వుండేలా చూడండి. పెద్ద లైట్లను ఉపయోగించండి. తర్వాత ఇంట్లో ఖాళీగా వున్న ప్రదేశాలను చిన్న బొమ్మలు, కళాత్మక అంశాలు కల చిత్రాలతో అలంకరించండి. ఇవి చూడటానికి అందంగా వుంటాయి. అంతేకాక ఇంట్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తాయి. గది మూలల్లో వేలాడే బుట్టలతో సంప్రదాయ బద్ధంగా అలంకరించండి. ఇలా చేసే అలంకరణ మీ జీవన శైలినీ ప్రతిబింబిస్తుంది. రంగురంగుల బల్బులతో ఇంటిని అలంకరించండి. ఇంటికి కొత్త రంగులు వేయించండి. ఇంట్లో ఫర్నిచర్ అతిథులకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా చూసుకోండి. భోజనశాలను విశాలంగా వుండేలా చూసుకోండి. ఇంటి అలమరాలు, గోడలకు సరికొత్త కాంబినేషన్‌లో రంగులు వేయించడంతో పాటు గోడల మీద పనికొచ్చే మంచి కొటేషన్లు రాయించండి. బొమ్మలు, కళాత్మకమైన వాల్‌పేపర్లు, ఫ్రేమ్‌లతో నింపండి. జీవితాల్లో తాజాదనం కోసం సహజమైన ప్రకృతి పచ్చదనాన్ని ఆహ్వానించండి. ఇందుకోసం ఇంటి కారిడార్, బాల్కనీల్లో కుండీలు ఏర్పాటు చేసి చిన్న చిన్న మొక్కల్ని పెంచండి. మీకు వీలైతే ఇంట్లోనూ చిన్నపాటి గార్డెన్‌ని ఏర్పాటు చేసుకోవచ్చు. అవసరం లేని వస్తువులన్నింటినీ పడేసేందుకు ఒక ప్రత్యేకమైన గది లేదా ప్రదేశాన్ని కేటాయించండి. అది బయటకు కనిపించకుండా చూసుకోండి. ఇలా చేస్తే అందమైన ఇల్లు మీ సొంతమవుతుంది.

ఇల్లు ఎంత పెద్దది అన్నది కాదు విషయం....ఆ ఇంట్లో మనం ఎంత ఆనందంగా ఉన్నామన్నదే ఇక్కడ అసలు విషయం. ఇల్లే కదా స్వర్గసీమ అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. అలాంటి ఇంటి అలంకరణ మనమేమిటో చెప్పకనే చెబుతుంది. మనం ఉండడానికి పనికి వచ్చే నాలుగు గోడలతో కూడిన గూడు లాగే చూస్తే మన ప్రత్యేకత ఏం కనిపిస్తుంది. అలాంటి ఇంట్లో జీవితమూ నిస్సారంగానే అనిపిస్తుంది. ఇది మన జీవితాలపై తెలియకుండానే ప్రభావమూ చూపిస్తుంది. ఇంటిని ఆనందాల నెలవుగా, స్వర్గసీమగా మార్చుకునే కళ మీ చేతిలోనే ఉంది. సరైన డిజైన్లు, చిన్నచిన్న టెక్నిక్‌లూ ఉపయోగిస్తే చాలు. మీ అవసరాలకు, తగినట్లుగా, మీదైన శైలి, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ మీకు నచ్చిన మార్పులు చేయండి. అంతా అయ్యాక మీకే ఆశ్చర్యం కలగక మానదు. ఇంత గొప్పగా మార్చామా అని. ఇలాంటి ఇల్లు రోజంతా పనిచేసి అలసిపోయి ఇంటికి వచ్చినవారికి ఆ ఇల్లు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది, కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. అలాగే ఇంటికి వచ్చిన అతిథులకూ చూడగానే ఇది ఇల్లు కాదు హరివిల్లు, ఆనందాల పూపొదరిల్లు అనిపించక మానదు.

ఆహారమే ఔషధం!









- కమలా ఫలాలు న్యూమోనియాకు చక్కని మందు
- కేరట్లు నరాల బలహీనత నుంచి కాపాడతాయి
- మునగాకు తింటే గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది
- ప్రోస్టేట్ కేన్సర్ రాకుండా అడ్డుకునే శక్తి టమాటాలకు ఉంది.
- కీరదోసలో ఉండే సిలికాన్, సల్ఫర్‌లు శిరోజాలకు మేలు చేస్తాయి
- సపోటా పళ్ళు మలబద్ధకాన్ని నివారిస్తాయి
- దానిమ్మ రసం కామెర్లకు మంచి మందు
- ఉల్లిపాయ శ్వాసకోస సమస్యలను తగ్గిస్తుంది
- ఖర్జూరం మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గించి మూత్రం సాఫీగా య్యేలా చేస్తుంది
- చేపలు తింటే రొమ్ముకేన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి.
- పుచ్చకాయలో ఉండే లైకోపీస్ చర్మ సంబంధిత వ్యాధుల నుంచి కాపాడుతుంది.
- జామపళ్ళు ఎక్కువగా తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- మామిడికి మూత్రపిండాల్లోని రాళ్ళను కరిగించే శక్తి ఉంది
- బీట్‌రూట్ బీపీని క్రమబద్ధీకరిస్తుంది
- నేరేడు పళ్ళు తింటే కడుపులో పురుగులు చచ్చిపోతాయి
- మునగకాయలు ఆకలిని పెంచుతాయి
- ద్రాక్షలో పైటో కెమికల్స్ కొలెస్ట్రాల్‌ని దరి చేరనివ్వవు





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

కాబట్టి అక్కడ యెలా చేస్తే రహస్యంగా జరుగుతుందో నా సలహాకే వదలిపెట్టేశాను. నేను మా వాడితో కలకత్తా ఫోనుచేసి కనుక్కుంటే, వాళ్ళకు చీఫ్ ఇంజనీరు - సీతారాం అని వున్నాడుట. ఆయనచేత చేయించండి, ఆయన చాలా నమ్మకస్తుడు - అని చెప్పాడు. ఆయనతో కలిసి మీరు తగిన యేర్పాటులు చెయ్యండి. వారం రోజుల్లో పనులు మొదలుపెట్టండి" అన్నాడు... ఇదేంపని రామరామ! ఏదేనా కట్టడం నిర్మాణం చెయ్యడం, సృష్టించడం, అభివృద్ధి చెయ్యడం - ఈ పనులు చెయ్యడానికి ఉత్సాహం ఉంటుంది కాని - చేసినదాన్ని విధ్వంసం చేయడమా? ఈ పనికి చేతులెలావస్తాయి? గోదావరి, కృష్ణా వంతెనల మాట తల్చుకుంటే తల తిరిగిపోతుందే? ఎన్ని సంవత్సరాలు కష్టపడితే, ఎన్ని వేల మంది కృషిచేస్తే, ఆనకట్టలు తెగిపోతాయి. గట్లు గండ్లు పడిపోతాయి. ఊళ్ళు నాశనం అయిపోతాయి.నాకెందుకీగతి పట్టింది?

(నిన్నటి సంచిక తరువాయి)

తేటల్ దేలెడు కాంతిపూరములుసుద్దీపించు ముత్యాలు ముప్పేటల్‌వోలె దద్వీయ కంఠమున శోభింపుల్ నిగారించు, చేనాటన్ జీవన శోభల్ గనిన కృష్ణాగౌతమీ భద్రలన్
గాటంపుం దమిద్రావువార మీదె కాంక్షాక్షీర మాంధ్రావనీ!

అని రాయప్రోలు గీతం యెంతో భక్తితో పాడేను, చిన్నప్పుడు బడిలో. అదంతా నాశనం అవుతే, దేశానికి ఎంత అరిష్టం? దేశాన్ని పాడుచెయ్యడానికి కొల్లగొట్టడానికి వస్తూన్న జపానువాడు యీ వంతెనలను నిర్మిస్తాడా? వాడికేం పట్టింది? ఒకవేళ జపానువాడిని దేశాన్నించి తరిమివేసిన తరువాత బ్రిటిషువాడు ఇంత డబ్బు ఖర్చుచేసి నిశ్చయం యేమిటి - వాడి దేశమే బుగ్గి అయిపోతూంటే? స్వరాజ్యం వచ్చింతరువాత, మళ్ళీ ఇవి కట్టి ఆనకట్టలు నిర్మించడం అంటే ఎంత బ్రహ్మాండం అయిన పని. అందుకోసమే గాంధీజీ ఏమైనాసరే భూదహనం చెయ్యడానికి వీలులేదంటున్నారు. ఆయన అంత తెలివితక్కువగా అనడంలేదు. దేశంలో వుండవలసిన వాళ్ళం మనం. మన చేతులారా మన కళ్ళని మనమే పొడుచుకుంటామా? నాకీ ఉద్యోగం యెందుకు వచ్చింది? తల్లి రొమ్ములు నేనే గుద్దుతున్నానే!

"గలగలా గోదావరి - కదిలిపోతుంటే
బిరబిరా కృష్ణమ్మ - పరుగులిడుతుంటే
బంగారు పంటలే - పండుతాయీ
మురిపేల ముత్యాలు- దొర్లుతాయీ"

ఇదంతా సర్వనాశనం అయిపోతుందే! యుద్ధానికితోడు ఇక కరువుకూడా వచ్చిందంటే చెప్పేదేముంది. ఆంధ్రదేశం శ్మశానవాటికలాగు భస్మమయిపోతుందే! నాకు చేతులు కాళ్ళు అడ్డంలేదు. నేనింత ఐక్కచిక్కి పోతున్నానెందుకు? దేశాన్ని కాపాడ్డానికి ఎంత నష్టానికేనా తెగించాలి. హిట్లరు హాలెండు దేశమ్మీదికి దండెత్తివస్తే, హాలెండువాళ్ళు దేశాన్ని రక్షించుకోడానికి సముద్రపుగట్లనే ధ్వంసం చేయలేదూ! కష్టాలు పడకుండా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోగలమా? బతికి బాగుంటే మళ్ళీ వారధులూ, వంతెనలు, ఆనకట్టలూ కట్టుకుంటాం. మా ఆంధ్రదేశం ఐశ్వర్యం - నీ ఇష్టం వచ్చినట్టూ దోచుకోరా అని జపానువాడిని పిలిచి తాంబూలంతో, దక్షిణకూడా ఇస్తామా యేమిటి? దేశం మీదికే వస్తే నీళ్ళు పుట్టకుండా చెయ్యొద్దూ మనం? చేసి తీరాలి. అదే మన విధి. అదే మన దేశభక్తి. అదే మన త్యాగం. ఇప్పుడు కాస్త కుదుటబడింది మనసు. సీతారాంకి టెలిఫోను చేసి వెంటనే రమ్మనమన్నా.. అతడు వచ్చాడు. ఆరంబాకం వంతెనల విషయం చెప్పి "రహస్యం సుమండీ అన్నా.. మనం ఇంత జాగ్రత్తగా యీ వంతెనలని కడుతున్నాం - మన చేతులార మనం నాశనం చెయ్యడం అంటే మహాకష్టపడుతూందండి మనసు" అన్నా. అతను పక్కున నవ్వి "జనార్దనరావుగారూ; వేమన యేమన్నాడు? 'కాగల పనులెల్ల గాకెటు బోవును! కాని పనులు కానేకావు భువిని, మహిమ వేరె యుండ మనతోడనున్నదా' అని తత్వం చెప్పాడు. ఇంతకీ మన చేతులలో యేముందండీ? ఒకడు చెబితే మనం చెయ్యవలసినవాళ్ళమేగా? ఇంతకీ మనమై ఇప్పుడు నాశనం చెయ్యడం లేదుకదా! ఆ అవసరమే పడకపోవచ్చు. మనం ఇప్పటినుండి యేదవడం ఎందుకు? ఈ రెండు వంతెనలే కాదు - కృష్ణా, గోదావరి



వంతెనలని మనం పడగొట్టవలసొచ్చినా పడగొట్టాలి. వీటి తాతల్లాంటి వంతెనలని కడదాం అండీ! మీరు ప్రెస్ట్రెస్డు కాంక్రీటు డిజైను వేస్తున్నారుగా. ఇంకేం కావాలి? అవలీలగా కట్టిపారేద్దాం. ఎందుకొచ్చిన గొడవ? ఏకంగా భూమి అడుగు నుంచి సొరంగం తవ్వి కొవ్వూరు నుంచి రాజమండ్రికి హాయిగా భేషైన రైలుమార్గం వేసేద్దాం" అన్నాడు. "సీతారాంగారూ, యేడుస్తున్న వాడిని నవ్వించే శక్తి వుందండీ మీలో" అన్నా. "వేమన యేం అన్నాడు. "జనన మరణములకు సరి స్వతంత్రుడు గాడు, మొదల కర్తగాడు. తుదనుగాడు, నడుమ కర్తననుట నగుబాటు కాదొకొ' అన్నాడు - అలాగ్గ" అన్నాడు నవ్వుతే సీతారాం. "ఈ సంగతి మరో కంటి వాడికి తెలియనివ్వకూడదు సుమండీ! సేట్ జీకి కూడా తెలియనివ్వకూడదు" అన్నాను. "ఇదేం పెద్ద పనండీ? మూడో స్తంభంకిందని పునాదులు తనిఖీచేద్దాం అని గొయ్యి తీద్దాం. దానినిక ఇటూ అటూ ఇంత సిమెంటు పులిమి మీద చిన్న చపటారాయి వేసి చిన్న డంపీ లెవలు పెట్టి నాలుగు రోజులు తమాషా చేశాక, అక్కడి పని వాళ్ళు మర్చిపోతారు. అసిస్టెంటు ఇంజినీర్లని, మేస్త్రీలని మరొక పనిమీద బదిలీ చేశాద్దాం- చెల్లు. యేమి పెద్దపని అని!" అంటే సీతారాం వెళ్ళిపోయాడు. మంచి సమయస్ఫూర్తి వున్న మనిషి. బాగా నవ్విస్తాడు. ఇంటికెళ్ళి కూచున్నాను. టెలిఫోను... సుభ పిలిచింది. ఎల్లుండి ఇరవై రెండున తన పుట్టిన రోజట. ఐదు గంటలకి ఫలహారానికి రమ్మని. నలుగురైదుగుర్నే పిలుస్తూందట. తప్పకుండా రావాలి సుమండీ! ఏం కానుక ఇస్తే బాగుంటుంది? నాకీ మర్యాదలేమీ తెలియవే? నల్గురిలోను తిరుగుతూంటే తెలుసును. పి.ఆర్.అండ్. సన్సుకు వెళ్ళి వజ్రాల వుంగరం వకటి కొని ఇద్దునా? వజ్రాల వుంగరం ఇస్తే ప్రేమ సూచన అవుతుందేమో? అలాగైతే ఉచితంగా వుండదు. కడుపులో వున్న మాట అంత స్పష్టంగా వెలిబుచ్చడం అవివేకం. కెంపుల వుంగరం ఇస్తేనో? ఎరుపు రంగు అనగానే దౌర్జన్యం అయిన వలపు సూచిస్తుందంటారు. ఔచిత్యానికి తీరని భంగం. అసలు ఎరుపు విప్లవానికి పెట్టింది పేరు. ఎరుపంటే కమ్యూనిజమే. నాకు కమ్యూనిజమంటే యేమిటో తెలియదు. అయినా అలాంటి అర్థం కనిపించే ప్రమాదంలోకి ఎందుకు దిగడం? విప్లవం - మోహం- రక్తం! ప్రపంచ చరిత్రలో వ్యక్తి జీవితంలో యీ శక్తులు ఎంతెంత చైతన్యాన్ని తీసుకువచ్చాయి? రక్తపు చుక్కలు - క్రాంతి జ్వాలలు-వలపుల దావానలం! ఆమె ఏవగించుకుంటుందేమో? నలుగురూ నవ్వుతారేమో? నాకెవరు సలహా చెప్పుతారు? లౌక్యజ్ఞానం వున్నవాడు సీతారాంని అడుగుదునా? సుభ అతన్ని కూడా ఆహ్వానిస్తే - నేను సలహా అడగడం అసందర్భంగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు మంచి హుషారిచ్చే మనిషి. మొన్న ఏదో మాటొచ్చి - ఆవేళ చందా కోసం మా ఇంటికి ఊర్వశి వచ్చినప్పుడు - సేట్జీ కూడా వచ్చాడు. మీ ఇంటికి వచ్చాడట ఆవిడతోటి. ఆవిడతో పరిచయం అని చెప్పాడండి - ఇంత డబ్బుండి ఆవిడె వెంటెందుకండీ ఇతను తిరగడం" అన్నాను. "ఎక్కుడైనయాశ వినుమడియుండగా, తిక్కబట్టి నరుడు తిరుగుచుండు; కుక్కవంటి యాశ కూర్చుండనివ్వదు' అన్నాడండీ వేమన" అని టక్కున జవాబిచ్చాడు. నేను నవ్వలేక చచ్చాను. నేను అతనిదగ్గిరకి సలహాకి వెళితే నా మీదే వేమన పద్యం చదువుతే కష్టం. చక్కని పొందూరు ఖద్దరు చీర యిస్తే? అవును; వాళ్ళందరూ ఖద్దరు దీక్షాపరులే. నేను ఖద్దరు కట్టుకోకుండా ఆవిడికిస్తే ఆవిడెను ముఖస్తుతి చేసినట్టుంటుంది. అయినా వొంటిమీద వేసుకొనే వస్త్రం పరాయివాడు యిస్తే విపరీతార్థం తీస్తారేమో? వెండి ఫొటో చట్రం యిస్తేనో? దాన్లో యెవరి ఫొటో పెట్టడం? నా ఫొటోనా? ఆమె కోరందే నా అంతట నేనే నా ఫొటో యివ్వడమా? నాకే వ్యగ్రతగా వుంది - ఆత్మస్తుతి అనిపించుకోదూ? ఆమె ఫొటోనే పెట్టి యిస్తేనో? ఫొటో వుంటే దానిమీద చేవ్రాలుండాలి - 'ప్రేమతో నీ సుభ' - 'జనార్దనానికి - ప్రియురాలు సుభ' - అని వుంటే అందం, చందం! ఇదేమిటి - నేను పిచ్చిభ్రమలో పడిపోతున్నానే? బంగారం పార్కర్ కలం ఇద్దునా? ఈ బంగారం కలంతో నాకు ప్రణయలేఖలు రాస్తాండు అని అర్థం యిస్తుందేమో? ఇస్తే యిస్తుంది! నాకు ఆమె రాయకూడదా? అలాంటి వుత్తరాలని అందుకుని నేనెంత ఆనందిస్తాను? అంత అదృష్టానికి నోచుకున్నానో లేదో! పోనీ - నాకు రాయకపోయినా నాకంటే అదృష్టవంతుడెవడికి రాసినప్పుడేనా - యీ కలం జనార్ధనం యిచ్చాడు. నన్ను ప్రేమించాడు. పాపం, అనేనా నన్ను తల్చుకుంటుంది!

19 ఆమె

కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని ప్రకటించి వారం రోజులైంది. ఎక్కడ చూచినా యీ విషయమే. మరొక ప్రసక్తి లేదు. మరో ప్రస్తావన లేదు. గాంధీగారి భావాలు ఈసారి చాలా తీవ్రంగా వున్నాయి. ఇది ఏకంగా విప్లవమే. ఇక దీనికి తిరుగులేదు అన్నారు. ఈసారి జైళ్ళకి వెళ్ళడం లేదు. అత్తారింటికి వెళ్ళి అన్ని భోగాలు అనుభవించి అందలాల్లో యెక్కి వూరేగడం కాదు అంటున్నారు. గాంధీగారి వ్యాసం చదివేక నాన్నకి కొంచెం కాళ్ళూ, చేతులూ చల్లబడ్డాయి. ఇప్పడనిస్తూంది నాన్నకి - 'అయ్యో నేనూ కాంగ్రెసులోంచి బైటికి వచ్చేసివుంటే యీ ప్రమాదంలో పడకపోదునే' అని. పత్రికల నన్నింటినీ అమ్మ నాచేత చదివిస్తూంది. నన్ను బలవంతం చేసినట్టు కాకుండా తనకి వొంట్లో బాగుండం లేదనో - తొందరగా సభకి వెళ్ళాలి, అంచేత తీరిక లేదనో - అని అంటూ - నేను గట్టిగా చదువుతే తను వింటూన్నట్టు లేకపోతే - నేను బద్ధకించి అన్ని పత్రికలనీ - కాంగ్రెసువి, కాంగ్రెసు వ్యతిరేకంవి - చదవనని అమ్మకి భయం! మంచి ఎత్తు వేసింది అమ్మ. నాన్న బొంబాయి ప్రయాణం యెల్లుండికి పెట్టుకున్నారు. నిన్న సాయంత్రం అంది అమ్మ - "అమ్మాయీ, నీ పుట్టినరోజు బుధవారం - మర్చిపోయావా యేమిటి? శాస్త్రితో చెప్పి నేనందుకోసమే మా ప్రయాణం గురువారానికి నిశ్చయం చేశాను. నువ్వు యెవరెవరిని పిలుస్తావో పిలువు. మళ్ళీ వచ్చేవాళ్ళకి వ్యవధి వుండదు" అంది. "ఏమి పుట్టిన రోజమ్మా, దేశం అంతా మహా సంక్షోభంలో వుంటే! పోనిస్తూ" అన్నాను.

– ఇంకా వుంది.

రెండు 'సెట్'లు, ఒక 'నెట్'.. సన్నద్ధం ఒక్కటే

డిగ్రీ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల అర్హత పరీక్ష కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెట్ ప్రకటనలు వెలువడ్డాయి. ఇప్పటికే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇదే సమయంలో ఈ సెట్ ప్రకటనలు రావటం వల్ల ఒకే సన్నద్ధతతో మూడు పరీక్షలు రాసుకొనే అవకాశం వచ్చింది. పి.జి. పూర్తిచేసిన, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఇది సంతోషకరమైన విషయం. మాతృభాషలో పరీక్ష రాసుకునే బృహత్తర అవకాశం స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) ద్వారా కలుగుతోంది. యూజీసీ-సీఎస్ఐఆర్, యూజీసీ-నెట్ ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో మాత్రమే రాసుకునే అవకాశం (భాషా పేపర్లు తప్ప) ఉంటుంది. కానీ సెట్‌లో చాలా పేపర్లు ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమంలోనూ ప్రశ్నపత్రాలుంటాయి. అందువల్ల యూజీసీ-సీఎస్ఐఆర్, యూజీసీ-నెట్ పరీక్షల్లోని భాషా అవరోధాలను అధిగమించి మంచి ఫలితాలు పొందే అవకాశముంది.

ఏ పరీక్ష ఎప్పుడు? ఎలా?

టీఎస్ సెట్- 2018

తెలంగాణలో టీఎస్ సెట్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. అర్హతగల అభ్యర్థులు తమ సన్నద్ధతను వెంటనే ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్‌లో : 14.3.2018 నుంచి 14.4.2018 వరకు.
- పరీక్ష తేది: 15.07.2018
- గమనిక : రూ. 3000 ఆలస్య రుసుముతో 15.5.2018 లోపు దరఖాస్తు చేసుకొనేవారు హైదరాబాద్ కేంద్రాల్లో మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఏపీసెట్- 2018

ఆంధ్రప్రదేశ్‌లో ఏపీసెట్- 2018ను ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. పూర్తిస్థాయి ప్రకటన త్వరలో విడుదలవుతుంది. ప్రాథమిక సమాచారం మేరకు...

- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ: 26.03.18 నుంచి 02.05.18 వరకు.
- పరీక్ష తేది: 01.07.2018

అర్హతలు

- సంబంధిత సబ్జెక్టులో పోస్టుగ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన అర్హత కల్గిన డిగ్రీ ఉండాలి.



- తెలుగు రాష్ట్రాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగల అర్హత పరీక్ష (సెట్) ప్రకటనలు విడుదల
- జాతీయస్థాయి అర్హత పరీక్ష (నెట్)కు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

ప్రస్తుతం చివరి సంవత్సరం పీజీ పరీక్షలు రాసేవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పరీక్ష ఫలితాల అనంతరం పీజీ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌ను సెట్ కార్యాలయంలో సమర్పించి, ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

- జనరల్ అభ్యర్థులకు పీజీ డిగ్రీలో సంబంధిత సబ్జెక్టులో 55%, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు (పీడబ్ల్యూడీ)-50% మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి.
- గరిష్ఠ వయఃపరిమితి లేదు.
- ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయవలసి ఉంటుంది.
- పూర్తి సమాచారానికి.. టీఎస్ సెట్: www.telanganaset.org లేదా www.osmania.ac.in
- ఏపీ సెట్ : apset.net.in లేదా andhrauniversity.edu.in వెబ్‌సైట్లు చూడొచ్చు.

సిలబస్

పేపర్-1 అందరికీ ఒకేలా ఉంటుంది. ఇందులో ప్రధానంగా అభ్యర్థుల బోధనా, పరిశోధనాంశాల్లో జ్ఞానం, అవగాహన సామర్థ్యాలను మదింపు చేస్తారు. జ్ఞానాత్మక సామర్థ్యాలు, అవగాహన, విశ్లేషణ, మూల్యాంకనం, ఆగమన, నిగమన, తార్కిక వివేచనలు, సహజ వనరులు, పర్యావరణ అంశాలపై సాధారణ పరిజ్ఞానం, ఆధునిక జీవన విధానంపై వీటి ప్రభావం మొదలైన అంశాలపై లోతైన అవగాహన అవసరం.

లేదా పేపర్-1లో ముఖ్యమైన ప్రతి అంశం నుంచీ ప్రశ్నలు అడిగే అవకాశముంది. ప్రధానంగా 10 విభాగాలున్నాయి. ప్రతి విభాగం నుంచి ప్రశ్నలు అడిగే ఆస్కారమున్న కాన్సెప్టులను ఎంచుకుని సన్నద్ధమవటం మేలు.

1) బోధనాభిరుచి (టీచింగ్ ఆప్టిట్యూడ్) 2) పరిశోధనాభిరుచి (రిసెర్చ్ ఆప్టిట్యూడ్) 3) పఠనావగాహన (రీడింగ్ కాంప్రహెన్షన్) 4) సంభాషణ (కమ్యూనికేషన్) 5) గణిత వివేచన (మేథమేటికల్ రీజనింగ్) 6) తార్కిక వివేచన (లాజికల్ రీజనింగ్) 7) దత్తాంశ వ్యాఖ్యానం (డేటా ఇంటర్‌ప్రిటేషన్) 8) ఐ.సి.టి. (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) 9) ప్రజలు - పర్యావరణం (పీపుల్-ఎన్విరాన్‌మెంట్) 10) ఉన్నత విద్యావ్యవస్థలో సుపరిపాలన (హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్- గవర్నెన్స్).

పై విభాగాల్లో బోధనా స్వభావం, లక్ష్యాలు, లక్షణాలు, బోధనా పద్ధతులు, మూల్యాంకనం, పరిశోధన-స్వభావం, సోపానాలు, పద్ధతులు, విలువలు, పరిశోధన వ్యాసం-లక్షణాలు, కమ్యూనికేషన్ లక్షణాలు, రకాలు, అవరోధాలు, తార్కిక వివేచనలు, ఇంటర్నెట్, ఈ-మెయిల్, ఐసీటీ లాభాలు, నష్టాలు; పర్యావరణం, కాలుష్యం, మానవ జీవనంపై వాటి ప్రభావం, ఉన్నత విద్యాసంస్థల నిర్మాణం, నియత, దూరవిద్య, వృత్తి, సాంకేతిక విద్య, సాధారణ విద్య, విలువల విద్య, పరిపాలన మొదలైన అంశాలను విస్తృతంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది.

- సెట్ ఉత్తీర్ణత పొంది, అర్హులైనవారు ఆయా రాష్ట్రాల్లో మాత్రమే డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హులు.
- యూజీసీ సీఎస్ఐఆర్, యూజీసీ నెట్ ఉత్తీర్ణత పొంది, క్వాలిఫై అయినవారు దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హులు.
- ఒకటి కంటే ఎక్కువ పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణత పొందినవారు, తమకు ఎక్కువ ప్రతిభ ఉన్నదాంట్లో నెట్/సెట్ రాయడం మంచిది. ఒకే నెలలో (జులై) పరీక్షలు ఉన్నందున ఇష్టపడి కృషి చేస్తే .. విజయం తథ్యం!

చదవాల్సిన విధానం

గతంలో 3 పేపర్లు ఉండేవి. యూజీసీ నెట్‌లో మారిన పరీక్ష విధానంలా, సెట్‌లోనూ ప్రస్తుతం 2 పేపర్లు మాత్రమే ఉంటాయి. పేపర్-1 అభ్యర్థులందరికీ ఒకేలా, పేపర్-2 వారు ఎంచుకున్న సబ్జెక్టులో ఉంటుంది. పరీక్ష సమయాన్ని చాలా తగ్గించారు. సబ్జెక్టులోని కాన్సెప్టుల్లో సామర్థ్యాన్ని పెంచుకునేలా కృషిచేస్తూనే నిర్ణీత సమయంలో అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానాలు రాయాలి. ఈ ప్రకారం అభ్యర్థులు అభ్యాసం, ఆచరణ చేపట్టాలి.

సన్నద్ధతకు కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

- నిర్దేశించిన సిలబస్‌ను పూర్తిగా అభ్యసించాలి.
- గత సంవత్సరాల నెట్, సెట్ ప్రశ్నపత్రాలను విశ్లేషణ చేయాలి. ముఖ్యమైన అంశాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి స్టడీ మెటీరియల్/ నోట్స్ తయారు చేసుకోవాలి.
- వీలైనంతవరకు షార్ట్‌కట్‌లను తయారు చేసుకోవాలి.
- ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్ ఆధారంగా సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- ప్రతిరోజూ అంశాలను అభ్యాసం చేయడంతోపాటు, పునశ్చరణనూ చేయాలి.
- స్వీయ విశ్లేషణ చేసుకొని, పొరపాట్లు సరిదిద్దుకోవాలి.
- కఠినమైన అంశాల అవగాహనకు స్నేహితులనూ, అధ్యాపకులనూ సంప్రదించాలి.
- సమయపాలన చాలా ప్రధానం. నిర్ణీత సమయంలో అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాసేలా సాధన చేయాలి.
- ఆత్మవిశ్వాసం, ప్రేరణ తుదివరకూ కొనసాగించాలి.
- పరీక్షలో సహజంగానే కొంత ఆందోళన, ఒత్తిడి వుంటుంది. సరైన ప్రణాళిక, అభ్యాసం, ఆచరణతో ఉత్తమ ఫలితాలు సొంతమవుతాయి.

ఎన్ని పేపర్లు?

స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో పేపర్-1, పేపర్-2 అనే రెండు పేపర్లను అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది.

- పేపర్-1 : జనరల్ పేపర్ (టీచింగ్ ఖీ రిసెర్చ్ ఆప్టిట్యూడ్) 50 ప్రశ్నలు 100 మార్కులు
- పేపర్-2 : పీజీ స్థాయిలో అభ్యర్థులు ఎంచుకొన్న సబ్జెక్టు 100 ప్రశ్నలు 200 మార్కులు

జీవ సాంకేతిక విజ్ఞాన ప్రగతిలో ముఖ్యాంశాలు

ఈ రంగంలో గ్రెగర్ మెండల్ నాటినుంచి నేటివరకు జరిగిన ప్రగతిలోని ముఖ్య ఘట్టాలు:

- 1866లో ఆస్ట్రియా బోటనిస్ట్ గ్రెగర్ మెండల్ వారసత్వం తాలూకు మౌలిక నియమాలను ప్రతిపాదించాడు. అయన ప్రతిపాదనను 30 సంవత్సరాలపాటు శాస్త్ర లోకం పట్టించుకోలేదు.
- 1882లో జర్మన్ శాస్త్రవేత్త వాల్టర్ ఫ్లెమింగ్ కణంలో సన్నని దారాల వంటివి ఉన్నట్లు కనుగొన్నాడు. ఆ తరువాత వాటిని క్రోమోజోములుగా నిర్ధారించారు.
- 1932లో అల్డస్ హక్స్‌లే ప్రయోగాత్మ నవల 'ది బ్రేవ్ న్యూవరల్డ్' ప్రచురితమైంది. ఇది జనెటిక్ ఇంజినీరింగ్ పద్ధతిని సూచిస్తున్న నవల.
- 1944లో అస్వాల్డ్ అవెరి, కాలిన్ మెక్లియోడ్, మెక్లిన్ మోకారీ అనే శాస్త్రవేత్తల వారసత్వ లక్షణాలను మూలం డి.ఎన్.ఎ. (Deoxyribo Nucleic Aid) అని నిరూపించారు. అంతకుముందు ప్రోటీన్ అనే పదార్థమే వారసత్వ లక్షణాలకు ప్రాతిపదిక అని భావించేవారు. నిజానికి బయో టెక్నాలజీలో ఇది విప్లవకర పరిశోధనే అనక తప్పదు.
- 1953లో అమెరికా శాస్త్రవేత్త జేమ్స్ వాట్సన్, బ్రిటిష్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ క్రిక్ (డి.ఎన్.ఎ.) Double-helix Structure కనుగొన్నారు.
- 1969లో ఓ హార్వర్డ్ మెడికల్ స్కూల్ బృందం తొలిసారిగా కణం నుంచి జీన్‌ను వేరుచేసి చూసింది.
- 1976లో శాన్‌ఫ్రాన్సిస్కోలో తొలిసారిగా జెనెటిక్ అనే జెనెటిక్ ఇంజినీరింగ్ కంపెనీ ఏర్పాటైంది.
- 1980లో శాస్త్రవేత్తలు తొలిసారిగా ఇక మనిషి జీన్‌ను ఒక సూక్ష్మక్రిమిలోకి ప్రవేశపెట్టారు.
- 1984లో బ్రిటిష్ శాస్త్రవేత్తలు జనెటిక్ ఫింగర్ ప్రింటింగ్ సృష్టికి శ్రీకారం చుట్టారు. ఈ పద్ధతిలో నేరస్తులను గుర్తించే పద్ధతిని అమెరికా కోర్టులు చట్టబద్ధమైన సాక్ష్యాధారంగా పరిగణించలేదు. పోలీసులు ఈ పద్ధతిలో నేరస్తులను నిర్ధారించుకుని ప్రాసిక్యూషన్‌ను పగడ్బందీగా రూపొందించుకోవాలి.
- 1985లో తొలిసారిగా జనెటిక్ ఫింగర్ ప్రింటింగ్‌ను ఒక నేరంలో వినియోగించారు.
- హెపటైటిస్-బి (కామెర్లు) వ్యాధికి జనెటిక్ ఇంజినీరింగ్ పద్ధతిలో తయారైన వ్యాక్సిన్‌ను ఎఫ్‌డిఎ. అనే అమెరికా సంస్థ ఆమోదించింది.
- అమెరికాలో నేషనల్ సెంటర్ ఫర్ హ్యూమన్ జెనోమ్ ఏర్పాటైంది.
- 1990లో అమెరికా శాస్త్రవేత్త అండర్సన్ ప్రప్రథమంగా జీన్ థెరపీని నిర్వహించారు. జీన్స్ ద్వారా రోగాలను నయం చేసే చికిత్సా పద్ధతి ఇది. అండర్సన్ ఓ నాలుగేళ్ల బాలిక అనారోగ్యాన్ని ఈ పద్ధతిలో తొలగించారు.
- 1997లో స్కాట్లాండ్‌లోని రోస్లిన్ సంస్థలో దాలీ అనే గొర్రెపిల్లను క్లోనింగ్ పద్ధతిలో సృష్టించారు. దీనిని సృష్టించిన పరిశోధకుడు విల్మట్.
- అన్ని రకాల మానవ క్లోనింగ్‌ను నిషేధించాలని సమితి సభ్య దేశాలను కోరుతూ చేసిన తీర్మానం ఆమోదం పొందింది.
- చైనాలో మొదటిసారిగా చేసిన డిజిటల్ గుండె మార్పిడి చికిత్స విజయవంతమైంది.
- భారతదేశంలో మొదటిసారిగా మానవ జీనోమ్స్ ఫౌండేషన్స్‌ను సీసీఎంబీ ఏర్పాటు చేసింది.
- లియన్ కల్ట్ స్థాపించిన 'హ్యూమన్ క్లోనింగ్ సొసైటీ క్లోనాయిడ్ క్లోనింగ్ ప్రక్రియ ద్వారా ఒక మహిళా శిశువును సృష్టించినట్లు 2002, డిసెంబర్ 26న ప్రకటించింది. ఈ శిశువుకు 'ఈవ్' అని పేరు పెట్టారు.
- క్లోనింగ్ ద్వారా సృష్టించబడిన ప్రప్రథమ క్షీరదం 'డాలీ' తీవ్రమైన కీళ్ల నొప్పుడు, శ్వాసకోస సమస్యల వల్ల 2003, ఫిబ్రవరి 14న యుథనేషియా ద్వారా మరణానికి గురిచేశారు.
- అవసరమైన అవయవాలు కృత్రిమంగా పెరగడానికి దోహదం చేసే స్టెమ్‌సెల్స్‌ను సేకరించే ప్రాజెక్ట్‌ను చెన్నైలో ఏర్పరిచారు.
- స్టెమ్ సెల్స్ క్లోనింగ్‌లో విజయం సాధించినట్లు 2005, మే 5న కొరియా శాస్త్రవేత్తలు ప్రకటించారు.
- క్లోనింగ్ ప్రక్రియ ద్వారా 2005, ఏప్రిల్‌లో స్నప్పీ అనే కుక్కపిల్ల జన్మించినట్లు దక్షిణ కొరియాకు చెందిన శాస్త్రవేత్త హ్వాంగ్ సూక్ ప్రకటించారు.
- 2005 డిసెంబర్‌లో ఫ్రాన్స్ వైద్యులు ప్రపంచంలోనే తొలి పాక్షిక ముఖ మార్పిడి సర్జరీని విజయవంతంగా నిర్వహించారు.
- 2007లో డెన్మార్క్ శాస్త్రవేత్తలు ఇతర గ్రూప్ రక్తాన్ని 'ఓ' గ్రూప్‌గా మార్చడంతో విజయం సాధించారు.
- సీసీఎంబీ శాస్త్రవేత్తలు క్లోనింగ్ ప్రక్రియ ద్వారా బ్లాకీ అనే జింకను క్లోనింగ్ చేశారు.
- 2016లో క్లోనింగ్ ద్వారా మరో గేదె 'సిర్బ్ గౌరవ్'ను సృష్టించినట్లు గేదెల పరిశోధన కేంద్రం సంస్థ (సీఐఆర్‌బీ) ప్రకటించింది.
- 2017లో దేశంలో తొలిసారిగా సరోగసి విధానంలో ముంబయిలో దూడను విజయవంతంగా సృష్టించారు.

మొక్కలు - శాస్త్రీయ నామాలు

మొక్క	శాస్త్రీయ నామం
మామిడి	మాంజిఫెరా ఇండికా
కొబ్బరి	కోకస్ న్యూసిఫెరా
మందార	హైబిస్కస్ రోజా సైనెన్సిస్
గోంగూర	హైబిస్కస్ కన్నాబినస్
బెండ	హైబిస్కస్ ఎస్కులేంటస్
చింత	టామరిండస్ ఇండికా
మల్లె	జాస్మినం ఇండికం
ఆపిల్	ఫైరస్ మాలస్
పైనాపిల్	అనానాస్ సెటైవా
బొప్పాయి	కారియా పపాయా
వంగ	సొలానం మెలాంజినమ్
బంగాళాదుంప	సొలానం ట్యూబరోసమ్
ఉల్లి	ఎల్లియం సెపా
వెల్లుల్లి	ఎల్లియం సెటైవమ్
తామర	నీలంబో న్యూసిఫెరా
చామంతి	క్రైసాంథియమ్ ఇండికా
బంతి	టాజెనెస్ పాట్యులా
తులసి	ఆసిమం సాంక్టం
ముల్లంగి	రఫానస్ సెటైవమ్
ఉసిరి	ఎంబ్లికా అఫిషినాలిస్
పత్తి	గాసీపియం హెర్బీషియం
పొగాకు	నికోటియానా టొబాకమ్
జామ	సిడియం గువా
దానిమ్మ	ప్యూనికా గ్రనాటమ్
ద్రాక్ష	వైటిస్ వినిఫెరా
అరటి	మ్యూస పారడైసిక
సీతాఫలం	అనోనా స్క్వామోజా
పనస	ఆర్టోకార్పస్ ఇంటెగ్రిఫోలియా
జీడి మామిడి	అనకార్డియం ఆక్సిడెంటేలిస్
వేప	అజాడిరక్టా ఇండికా
ఆవాలు	బ్రాసికా నైగ్రా
క్యాబేజీ	బ్రాసికా ఒలరేషియా రకం కాపిటేటు
కాలిఫ్లవర్	బ్రాసికా ఒలరేషియా రకం బోట్రిటస్
చిక్కుడు	డాలికస్ లాబ్ లాబ్
వేరుశనగ	అరాఖిస్ హైపోజియం
శనగ	సైసర్ అరాటీనం
బఠాణీ	పైసం సెటైవం
టమాట	లైకోపెర్సికం ఎస్కులెంటమ్
మిర్చి	కాప్సికం ఫ్రూటెన్సిస్
జొన్న	సోర్గం వల్గేర్
గోధుమ	ట్రిటికం ఈస్టివం
వరి	ఒరైజా సటైవా
సజ్జ	పెన్నిసేటమ్ టైఫాయిడం
రాగులు	ఇల్యూసైన్ కొరకానా
పెసలు	ఫేసియోలస్ అరియస్
మినుము	ఫేసియోలస్ ముంగో
కంది	కజానస్ కజాన్
సోయాబీన్	గ్లైసిన్ మాక్స్
నువ్వులు	సిసామమ్ ఇండికం
మొక్కజొన్న	జియామేజ్
పామ్	ఇన్సుఇస్ గైనన్సిస్
ఆముదం	రిసినస్ కమ్యూనస్



వివిధ ప్రాంతాల్లో పెరిగే మొక్కలు - వాటి పేర్లు

- నీటిలో పెరిగే మొక్కలు - హైడ్రోఫైట్స్
- క్షార ఉప్పు నీటిలో పెరిగే మొక్కలు - హాలోఫైట్స్
- ఆమ్ల నేలల్లో పెరిగే మొక్కలు- ఆగ్జలోఫైట్స్
- మంచులో పెరిగే మొక్కలు- క్రయోఫైట్స్
- నీడలో పెరిగే మొక్కలు- సియోఫైట్స్
- బంజరు భూముల్లో పెరిగే మొక్కలు - చెర్సోఫైట్స్
- రాళ్లపై పెరిగే మొక్కలు - లిథోఫైట్స్
- రాళ్ల సందుల్లో పెరిగే మొక్కలు- చాస్మోఫైట్స్
- ఎడారి ప్రాంతాల్లో పెరిగే మొక్కలు - గ్జిరోఫైట్స్
- ఇసుక నేలల్లో పెరిగే మొక్కలు- సామోఫైట్స్
- మధ్యరక వాతావరణంలో పెరిగే మొక్కలు - మిసోఫైట్స్
- కాంతిలో పెరిగే మొక్కలు- హీలియాఫైట్స్
- ఇతర మొక్కలపై పెరిగే మొక్కలు - ఎపిఫైట్స్

వృక్ష శాస్త్రంలో వృక్షాల మారుపేర్లు

- ఇండియన్ గూస్ బెర్రి - ఉసిరి
- ఫ్రైడ్ ఫ్రూట్ ఆఫ్ ఇండియా - మామిడి
- హెర్బల్ డాక్టర్ ఆఫ్ ఇండియా - వేప
- నడిచే ఫెర్న్- ఆండియాంటమ్ కాండేటమ్
- ది ఫాదర్ ఆఫ్ ఫారెస్ట్ - సెక్వోయిండెండ్రాన్ జైగాంటియస్
- నిన్న, నేడు, రేపు చెట్లు - బ్రూన్ఫెల్సియా హోపియానా
- జోకర్స్ ఆఫ్ ది ప్లాంట్ కింగ్‌డమ్ - మైకో ప్లాస్మా
- పండ్లలో రాజు - మామిడి

వివిధ రకాల కొయ్యలు- వాటి ఉపయోగాలు

కొయ్య	ఉపయోగం
సాలిక్స్	క్రికెట్ బ్యాట్ తయారీకి
గ్రేవియా లాటిపోలియా	క్రికెట్ స్టంప్స్, బాల్ తయారీ
ఐవరీ ఫామ్	బిలియర్డ్స్ బాల్ తయారీ
మోరుస్ అల్బా	హాకీ స్టిక్స్ తయారీ
క్వెర్కస్ సూబిర్	బాటిల్ కార్క్

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
73.64 ▲	30.10 ▲	200 ▲	29,010	◀◀	41,100	
32,996.76	10,124.35	29,000	ప్రొద్దుటూరు 29,010 (22 క్యారట్లు, 10 గ్రాములు)	39,200 కిలో (రూపాయల్లో)	ప్రొద్దుటూరు 41,109 కిలో (రూపాయల్లో)	65.19

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటాస్టీల్	593.30	3.17
సన్‌ఫార్మా	508.85	2.20
విప్రో	293.75	1.98
రెడ్డీల్యాబ్స్	2,164.20	1.85
అదానీపోర్ట్స్	371.00	1.47

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఓఎన్‌జీసీ	174.10	-1.42
ఐసీఐసీఐ బ్యాంక్	291.75	-1.10
ఎస్‌బ్యాంక్	302.05	-0.92
రిలయన్స్	903.60	-0.64
ఎన్‌టీపీసీ	167.50	-0.57

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.17	65.19
యూరో	80.25	80.09
పౌండ్	91.73	91.29
ఆస్ట్రేలియా డాలర్	50.15	50.23
సింగపూర్ డాలర్	49.44	49.48

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,980	30,994
చెన్నై	28,980	30,994
బెంగళూరు	28,300	30,267
ముంబై	29,960	32,042
విజయవాడ	29,000	31,400
విశాఖపట్నం	29,010	31,030
ప్రొద్దుటూరు	29,010	30,460
ముడి చమురు		66.05



పుంజుకున్న బంగారం, వెండి

ముంబై: పెండ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మంగళవారం బంగారం ధర రూ.210 పెరిగింది. దీంతో పది గ్రాముల పసిడి ధర రూ.31,390కి చేరింది. అంతర్జాతీయ పరిణామాలు, స్థానిక ఆభరణాల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో బంగారం ధర పెరిగినట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇక వెండి పసిడి బాటలోనే పయనించింది. రూ.200లు పెరిగి రూ.39వేల మార్క్‌ను చేరుకుంది. ప్రస్తుతం కిలో వెండి రూ.39,150గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. అంతర్జాతీయంగా మాత్రం బంగారం ధర 0.22శాతం తగ్గింది. దీంతో ఔన్సు ధర 1,313.70 డాలర్లు పలికింది.

2పైసలు నష్టపోయిన రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ 2పైసలు నష్టపోయి మంగళవారం 65.19 వద్ద నిలిచింది. దిగుమతులు, బ్యాంకుల నుండి డాలర్ కొనుగోళ్లు పెరగడంతో రూపాయి విలువ తగ్గినట్లు తెలుస్తోంది. రూపాయి 65.21 వద్ద ప్రా రంభమై 65.24, 65.15 మధ్య ఊగిసలాడింది. అమెరికా ఫెడరల్ రిజర్వు కీలక సమావేశాల నేపథ్యంలో వడ్డీరేట్లు పెంచనున్న వార్తలు రావడంతో ప్రధాన కరెన్సీలు ఇబ్బందుల నెదుర్కొంటున్నట్లు డీలర్లు వెల్లడించారు. సోమవారం రూపాయి 23పైసలు నష్టపోయి 65.17 వద్ద నిలిచింది.

టాటామోటార్స్ వాహనాల ధర పెంపు

న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ ఉత్పత్తుల సంస్థ టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల ధరలు పెరగనున్నాయి. ప్యాసింజర్ వాహనాలపై రూ. 60వేల వరకు ధరలను పెంచుతున్నట్లు మంగళవారం వెల్లడించింది. తయారీ ఖర్చు పెరగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం దేశీయ విపణిలో టాటామోటార్స్ జోన్ ఎక్స్ నానో నుంచి ప్రీమియం ఎస్‌యూవీ హెక్సా రేంజ్ వరకు ప్యాసింజర్ వాహనాలను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ. 2.28లక్షల నుంచి రూ. 17.42లక్షల(ఎక్స్ షోరూం ఢిల్లీ) వరకు ఉన్నాయి. వీటిపై గరిష్టంగా రూ. 60వేల వరకు ధరలు పెంచుతున్నట్లు టాటామోటార్స్ ఓ ప్రకటనలో తెలిపింది. 'ఉత్పత్తి ఖర్చులు పెరగడం, మార్కెట్ పరిస్థితులు మారిపోవడం, ఇతర ఆర్థిక కారణాల వల్ల ధరలను పెంచాల్సి వచ్చినట్లు సంస్థ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ ప్రెసిడెంట్ మయాంక్ పరేఖ్ తెలిపారు. ఇటీవల జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల ఉత్పత్తి సంస్థ ఆడీ కూడా తమ మోడళ్లపై ధరలను పెంచిన విషయం తెలిసిందే. మోడల్‌ను బట్టి రూ. 9లక్షల వరకు ధరలను పెంచేసింది. కేంద్ర బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని పెంచడంతో ఆ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు ఆడీ తెలిపింది.

ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయి

7లక్షల ఉద్యోగాలు మాత్రం పోయాయ్

- ఖాదీ పరిశ్రమలో వింత పరిస్థితి
- నిజాల్ని దాస్తోన్న కేంద్ర సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమల శాఖ



న్యూఢిల్లీ: ఏదైనా రంగంలో ఉత్పత్తి పెరిగిందంటే... అందులో ఉపాధి పొందుతున్న కార్మికుల సంఖ్య పెరగాలి. కానీ ఖాదీ పరిశ్రమలో దీనికి విరుద్ధంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఖాదీ పరిశ్రమల్లో 7లక్షల మంది ఉపాధి కోల్పోయారని, అదే సమయంలో ఖాదీ ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయని లోక్‌సభకు అందజేసిన నివేదికలో 'కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ' పేర్కొన్నది. పొంతనలేని లెక్కలతో ఈ శాఖ లోక్‌సభకు అందజేసిన సమాచారంపై నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చరఖాల ఆధునీకరణ వల్లనే లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని ఆ శాఖ చెప్పటం...వాస్తవాల్ని దాయటమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోవడానికి గల సరైన కారణాల్ని నివేదికలో పొందుపర్చలేదని వారు తప్పుబట్టారు. 2015-16 నుంచి 2016-17 మధ్య దేశంలో ఖాదీ ఉత్పత్తి 32 శాతం పెరిగింది. ఖాదీ అమ్మకాలు 33 శాతం పెరిగాయి. దీనికి కారణం చరఖాల ఆధునీకరణ. దీని వల్లనే లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొనటం వాస్తవాలకు దూరంగా ఉంది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) చెప్పినదాని ప్రకారం, దేశవ్యాప్తంగా ఖాదీ తయారీ రంగంలో లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. వీటి గణాంకాల్ని 2015-16 ఏడాదికి సంబంధించిన సమాచారంలో పొందుపర్చలేదు. అనేక మంది ఉపాధి కోల్పోవడానికి కొత్త మోడల్‌లో వచ్చిన చరఖాలు కొంతవరకు కారణమయ్యాయి.

సాంప్రదాయ చరఖాలను నడిపేవారిని ఇవి దెబ్బతీశాయి. అయితే ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య ఎంత, ఖాదీ తయారీరంగంపై దాని ప్రభావం వంటి వివరాలేవీ బహిర్గతం చేయటం లేదు. ఉత్తరాఖండ్, యూపీ, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 3.2లక్షల మంది ఉపాధి కోల్పోయారు. బీహార్, ప.బెంగాల్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో, అండమాన్, నికోబార్‌లో మొత్తం 1.2లక్షల మంది ఖాదీ పరిశ్రమ నుంచి బయటకొచ్చారు.

ఉపాధి కల్పన...ఉత్తదేనా ?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) పథకం కింద ప్రతీ ఏటా ఉపాధి పొందుతున్నవారి సంఖ్య కూడా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి రంగాన్ని మెరుగుపర్చటం కోసం తీసుకొచ్చిన పథకమే 'పీఎంఈజీపీ'. దీనికింద లబ్దిదారులకు సబ్సిడీతో కూడిన సూక్ష్మరుణాల్ని అందజేస్తారు. ఈ పథకంపై తాజా గణాంకాల్ని లోక్‌సభలో సంబంధిత మంత్రిత్వశాఖ విడుదల చేసింది. దీని ప్రకారం, రుణ సహాయాన్ని పొందిన ప్రాజెక్టుల సంఖ్య క్రమంగా తగ్గింది. 2016-17లో 53 వేల ప్రాజెక్టులకు రుణ సాయం అందితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జనవరి మధ్య కేవలం 31వేల ప్రాజెక్టులకు మాత్రమే రుణసాయం దక్కింది. అలాగే, 2015-16లో 3.2లక్షలమంది కొత్తగా ఉపాధి పొందితే, 2016-17లో ఆ సంఖ్య 4.1లక్షలకు పెరిగింది. కానీ 2017-18నాటికి వచ్చేసరికి ఇప్పటిదాకా కేవలం 2.5 లక్షలమంది మాత్రమే పీఎంఈజీపీ పథకం ద్వారా ఉపాధి పొందారు.

ప్రజలకు సురక్షిత మంచినీరు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సేఫ్ వాటర్ నెట్‌వర్క్, హనీవెల్ ఇండియా బజల్ సేఫ్ వాటర్ 100వ స్టేషన్‌ను ప్రారంభించింది. ఫ్లోరైడ్, భూగర్భ జలాల కలుషితానికి గురైన తెలంగాణ జిల్లాలోని 3.30 లక్షల మందికి సురక్షితమైన నీటిని అందిస్తుంది. మరో 30 సేఫ్‌వాటర్ స్టేషన్లను 2019 నాటికి ఏర్పాటు చేయనున్నట్లు సేఫ్ వాటర్ నెట్‌వర్క్ సిఇఒ కుర్ట్ సోడర్ లుండ్, హనీవెల్ ఇండియా ప్రెసిడెంట్ వికాస్ ఛాదా తెలిపారు. ఎంట్రప్రెన్యువర్ కమ్యూనిటీ, యాజమాన్యం నిర్వహణ నీటిశుద్ధి కేంద్రాన్ని చేపడుతుందని వివరించారు. ఈ స్టేషన్లు రివర్స్ ఒస్మోసిస్, అల్ట్రా వయొలెట్ ఫిల్ట్రేషన్‌తో పాటు అత్యాధునిక ఆరు దశల్లో నీటి శుద్ధి జరుగుతుందని వివరించారు. వాటర్ ఎటీఎంల వద్ద నీటిని పొందేందుకు వినియోగదారులకు ఆర్‌ఎఫ్‌ఐడి కార్డులను వినియోగిస్తారని చెప్పారు. ఎంట్రప్రెన్యుయర్, ఆపరేటర్, డిస్ట్రిబ్యూటర్, టెక్నీషియన్‌గా ఒక్కో సేఫ్ వాటర్ స్టేషన్ కనీసం నలుగురికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ఆరోగ్యం, ఉత్పాదకత, జీవనోపాధులకు సంబంధించి వేలాది మంది జీవితాల్లో ఇది గణనీయ మార్పును తీసుకురానుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో సేఫ్ వాటర్ స్టేషన్‌లు నెలకొల్పిటన్లు వారు తెలిపారు.

సేంద్రియ ఎరువుల ఉత్పత్తిలో

జియోలైఫ్ సంచలనం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జియోలైఫ్ అగ్రిటెక్ ఇండియా అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. సులభంగా నీటిలో కరిగే ఎరువులతో పాటుగా సేంద్రీయ, నానో సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎరువులను ఆ ప్రదర్శనలో జియోలైఫ్ ప్రదర్శించింది. జియోలైఫ్ స్టాల్స్‌కు విచ్చేసిన ప్రతి ఒక్కరూ పర్యావరణానికి పెద్దగా హాని చేయకుండా అత్యధిక దిగుబడులను సాధించడంలో జియోలైఫ్ ఉత్పత్తుల పనితీరును ప్రశంసించారు. జియోలైఫ్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ లాహోటి మాట్లాడుతూ సాధారణంగా చైనా నుంచి రసాయన ఎరువులను దిగుమతి చేసుకోవడం అనవాయితీగా వస్తుందని, కొరియా, యూరప్ దేశాలకు చెందిన ఎన్‌పికె 12:12:12తో పాటు ఇతర సేంద్రీయ ఉత్పత్తులను జియోలైఫ్ ఎగుమతి చేస్తూ అభివృద్ధి పథకంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. నీటిలో సులభంగా కరిగిపోయే సేంద్రీయ ఎరువులను ఎగుమతి చేస్తున్న ఏకైక సంస్థ తమదేనన్నారు.

ఆ ఇద్దరూ... అస్సలు భారత్ రారట

భద్రతా కారణాల దృష్ట్యా రాలేను : ఛోక్సీ



ఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) రూ.13వేల కోట్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న గీతాంజలి గ్రూప్ యజమాని మెహుల్ ఛోక్సీ విచారణ నిమిత్తం భారత్‌కు వచ్చేందుకు మరోసారి నిరాకరించారు. తాజాగా సీబీఐ ఆయనను విచారణకు హాజరుకావాల్సిందిగా సమన్లు జారీ చేసింది. దీనిపై స్పందించిన ఆయన సీబీఐకి మరోసారి లేఖ రాశారు. 'భద్రతా కారణాల దృష్ట్యా సీబీఐ విచారణకు నేను భారత్‌కు తిరిగి రాలేను. నా పాస్‌పోర్ట్ రద్దు చేశారు. కేసు మూలంగా భారత్‌లో నా వ్యాపారాలను మూసివేయడం వల్ల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాను. వీటికి తోడు విదేశాల్లోని వ్యాపారాలను చూసుకోవడానికి, ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి చాలా కష్టపడుతున్నాను. దీంతో పాటు నా ఆరోగ్య కారణాల దృష్ట్యా నేను భారత్‌కు ప్రయాణం చేయలేను. నా మీద వస్తోన్న ఆరోపణలు నన్ను మరింత భయానికి గురి చేస్తున్నాయి. దీని వల్ల నా భద్రత విషయంలో చాలా ఆందోళన పడుతున్నాను' అని ఛోక్సీ సీబీఐకి రాసిన లేఖలో పేర్కొన్నారు. 'విచారణ విషయంలో నాకు తగిన సమాచారం ఇవ్వడం లేదు. నాపై వివిధ ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యలు అసంబద్ధంగా ఉన్నాయి' అని ఛోక్సీ ఆరోపించారు. గతంలో ఛోక్సీ, నీరవ్ కూడా ఇదే విధంగా భారత్‌లో జరిగే విచారణకు హాజరుకాలేమని లేఖలు రాశారు. పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి రాకముందే నీరవ్, ఛోక్సీలు దేశం విడిచి పారిపోయారు. ఇప్పటికే వారికి సంబంధించిన పలు ఆస్తులను సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సీబీఐ వల్లే భారత్‌కు రావట్లేదు: నీరవ్



ఢిల్లీ: సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రస్తుతం విదేశాల్లో ఉన్న విషయం తెలిసిందే. ఆయనను భారత్‌కు రప్పించేందుకు సీబీఐ విశ్వప్రయత్నాలు చేస్తోంది. అయితే తాను తిరిగి రాలేనని చెబుతూ వస్తున్న నీరవ్ తాజాగా మరో సారి అదే సమాధానమిచ్చారు. అయితే ఈసారి మాత్రం సీబీఐ వల్లే తాను భారత్‌కు రాలేకపోతున్నానని ఆరో పించారు. ఈ మేరకు సీబీఐ పంపిన మూడో డిజిటల్ సమన్లకు ఆయన మెయిల్ ద్వారా సమాధానమిచ్చారు. 'లోయర్ పరేల్‌లోని నా ఆఫీస్ సర్వర్లను సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఇలాంటి సమయంలో నేను భారత్‌కు వస్తే.. చట్ట ప్రకారం నన్ను నేను కాపాడుకునేందుకు నా ప్రాథమిక హక్కులను నేను పూర్తిగా వినియోగించుకోలేను. విచారణాధికారు లకు సరైన సమాచారం అందించలేక నేను 'దివ్యాంగుడి'గా మారిపోతాను' అని నీరవ్ తన మెయిల్‌లో పేర్కొన్నారు. సీబీఐ వల్లే తాను భారత్‌కు రాలేకపోతున్నానని చెప్పుకొచ్చారు. తాను భారత్‌కు తిరిగి రానని నీరవ్ గతంలోనూ చెప్పిన విషయం తెలిసిందే. విదేశాల్లో తనకు వ్యాపారాలున్నాయని.. సీబీఐ విచారణకు సహకరించలేనని ఓసారి చెప్పారు. భారత్‌కు వస్తే తన వ్యక్తిగత భద్రతకు ముప్పు ఉందని, దీనిపై సీబీఐ ఎలాంటి సమాధానం ఇవ్వట్లేదని మరోసారి ఆరోపణలు చేశారు. మరోవైపు నీరవ్ ఆరోపణలను సీబీఐ అధికారులు తోసిపుచ్చారు. నీరవ్ మోదీ ఇస్తున్న సమాధానాలన్నీ కేవలం భారత్‌కు రాకుండే ఉండేందుకు చెబుతున్న సాకులు మాత్రమేనని అంటున్నారు.

వరుస నష్టాల నుంచి కోలుకున్న మార్కెట్లు

స్వల్ప లాభాలను నమోదు చేసిన సూచీలు

73పాయింట్లతో సెన్సెక్స్



ముంబై: వరుసగా ఐదురోజుల నష్టాల నుంచి దేశీయ మార్కెట్లు స్వల్ప లాభాలతో కాస్త కోలుకున్నాయి. ఐటీ, హెల్త్‌కేర్ రంగాలు లాభాల్లో నమోదుకావడం సూచీలకు కలిసొచ్చిందని చెప్పవచ్చు. రెండురోజుల అమెరికా ఫెడరల్ సమావేశాలు ప్రారంభంకానుండటంతో ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపిందని చెప్పవచ్చు. సెన్సెక్స్ 73.640 పాయింట్లతో 0.22శాతంతో 32,996.76 పాయింట్లు నమోదుచేసుకోగా ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 30.1 పాయింట్లతో 0.3శాతంతో 10,124.35 వద్ద నిలిచింది. తాజా గణాంకాల ఆధారంగా విదేశీ మదుపరులు సుమారు రూ.292.23 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దేశీయ మదుపరులు రూ.191.52 కోట్లు షేర్లను అమ్మినట్లు నమోదైంది. అంతర్జాతీయ సంకేతాలు, అమ్మకాల ఒత్తిడితో ఈ ఉదయం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 100 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ కూడా 10,100 వద్ద ఊగిసలాడింది. అయితే ఆ తర్వాత కాసేపటికి కోలుకున్న సూచీలు లాభాల బాట పట్టాయి. ఒకదశలో సెన్సెక్స్ 150 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. కానీ చివరి గంటల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు ఆరంభ లాభాల్లో కొంత కోల్పోయాయి. దీంతో మంగళవారం నాటి ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్లు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. బ్లుచిప్ కంపెనీలైన హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్ కీలక సూచీలు పెరిగేందుకు తోడ్పడ్డాయి. సెక్టరల్ సూచీలు పదకొండింటిలో ఏడు లాభాల్లో ముగిసాయి. నిఫ్టీ బ్యాంకు, నిఫ్టీ మెటల్, నిఫ్టీ ప్రైవేటు బ్యాంకు, నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ ఐటి, నిఫ్టీ పార్మా 1.5శాతం పెరిగాయి. భారతి ఇన్‌ఫ్రాటెల్, టెక్‌మహీంద్రా, ఐషర్ మోటార్స్, టాటాస్టీల్, సన్ ఫార్మా, బోష్ ప్రధాన లబ్దిదారులుగా నమోదయ్యాయి. నిఫ్టీ 50 ఇండెక్స్ 2-5శాతం పెరగగా, ఐసిఐసిఐ బ్యాంకు, సిప్లా, కోల్ ఇండియా, గెయిల్, బిపిసిఎల్, ఓఎన్‌జిసి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 2.3శాతం నష్టపోయింది. బిఎస్‌ఇ 'ఏ'గ్రూపులో రిలయన్స్ ఇన్‌ఫ్రా టాప్ గెయినర్‌గా 7.71 శాతంతో రూ.457లు పలికింది.


జిందాల్ స్టీల్, మారికో, వక్రాంజి లాభాల్లో నమోదు కాగా గుజరాత్ స్టేట్ పెట్రో నెట్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, సింటెక్స్ ఇండస్ట్రీస్ 3-5శాతం నష్టపోయాయి. యూరో పియన్ మార్కెట్లలో లండన్ బెంచ్‌మార్క్ ఎఫ్‌టిఎస్‌ఇ 100 ఇండెక్స్ 0.4 శాతం పెరిగి 7071.68 పాయింట్లు నమోదు చేసింది. ఫ్రాంక్‌ఫర్ట్ డిఎఎక్స్ 30 ఇండెక్స్ 0.4శాతంతో 12261.19 పాయింట్లు నమోదుచేసింది. పారిస్ సిఏసి40 0.2శాతంతో 5232.12 పాయింట్లు నమోదు చేసింది.

విజ్ఞానం



పురుషులకు గర్భ నిరోధక మాత్ర

పురుషులకు సురక్షితంగా ఉండే వీలు కలిగేలా గర్భనిరోధక మాత్రను శాస్త్రజ్ఞులు రూపొందించారు. దీనివలన స్త్రీలలో వలె పురుషుల్లో కూడా బరువు పెరగవచ్చునని వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ వెల్లడించింది. 100 మంది పురుషులపై చేపట్టిన ప్రయోగంలో 82 మంది ద్వారా ఆశించిన ఫలితాలు వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈ మాత్రల వలన టెస్టొస్టిరోన్ లెవెల్స్ తగ్గినప్పటికీ మాత్రలు ఆపివేసినంతలోనే మరలా పుంజుకున్నట్లు గుర్తించారు. డైమిథేన్‌డ్రోలైన్ అండెకనోఏట్(డీఎంఈయూ) అనే ఔషధంతో సైడ్ ఎఫెక్ట్స్ ఏమీ లేనట్లువెల్లడైంది. రోజుకు ఒక్కమాత్ర వేసుకుంటే సరిపోతుందని వీరు వెల్లడించారు. టెస్టొస్టిరోన్ హార్మోన్ తగ్గినప్పటికీ పురుషుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. బరువు పెరగడంతోపాటు స్వల్పంగా హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్ శాతం పెరిగినట్లు గుర్తించారు. ఈ పిల్స్‌ను ఆహారంతోపాటు వేసుకోవలసిఉంది.



ఇ-సిగరెట్లతో లివర్‌కు చేటు

ఇ-సిగరెట్లతో లివర్ వ్యాధులు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎలుకలపై చేపట్టిన ప్రయోగంలో ఇ-సిగరెట్లతో లివర్‌లో కొవ్వు పేరుకుపోయి పలు వ్యాధులకు కారణమవుతోందని లాస్ ఏంజెల్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ వెల్లడించింది. 12వారాల పాటు చేపట్టిన ప్రయోగంలో, ఎపోలిపొప్రోటీన్ ఇ అనే జీన్ గుండె వ్యాధులకు, లివర్‌లో కొవ్వు చేరేందుకు కారణమైందని తెలుస్తోంది. మరొక గ్రూపును ఇ-సిగరెట్ల ఆవిరి ప్రభావానికి గురిచేయగా వీరిలో వీరి రక్తంలో నికోటిన్ లెవెల్స్ పెరిగినట్లు తెలుస్తోంది. వీరి లివర్ సాంపిల్స్‌నుపరిశోధించగా 433 జీన్స్ లో కలిగిన మార్పుల కారణంగా ఫ్యాటీ లివర్ పెరిగినట్లుతెలుస్తోంది.

రైలు దిగానే క్యాబ్

ఓలాతో రైల్వే ఒప్పందం



ముంబై: ఐఆర్‌సీటీసీలో టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులు రైలు దిగిన వెంటనే ఓలా క్యాబ్‌లో మీ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. సోమవారం ఐఆర్‌సీటీసీ ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఓలాతో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఆరునెలల పాటు పైలెట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్‌సైట్ ఓలా క్యాబ్ సేవలను అందించనుంది. ఏడు రోజుల ముందే ప్రయాణికులు తాము చేరుకోవాల్సిన గమ్యస్థానాలకు క్యాబ్ సర్వీస్‌ను బుక్ చేసుకోవచ్చు.

మైక్రో, మిని, ప్రైమ్ సెడాన్, ప్రైమ్ ప్లే, ఆటో, షేర్ ఇలా ఏ సర్వీసునైనా అదనపు ఛార్జీలు లేకుండా బుక్ చేసుకునే వెసులు బాటును ఐఆర్‌సీటీసీ కల్పిస్తోంది. ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ యాప్, లేదా వెబ్‌సైట్‌కు లాగిన్ అయి, 'బుక్ ఎ క్యాబ్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. దీంతో మీ క్యాబ్ సర్వీసు బుక్ అయి ఉంటుంది. మీరు రైల్వే స్టేషన్‌లో దిగిన వెంటనే మీ కోసం మీరు బుక్ చేసుకున్న క్యాబ్ అందుబాటులో ఉంటుంది. ఇంటికి చేరే వరకూ ప్రయాణికులకు సేవలను అందించే లక్ష్యంతోనే ఓలాతో ఈ ఒప్పందం చేసుకున్నట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది.



గ్రీన్‌కార్డుల జారీలో జాప్యంపై

అమెరికాలో భారతీయుల ర్యాలీ

వాషింగ్టన్: అమెరికా వ్యాప్తంగా సోమవారం వందలాది మంది భారతీయ ఉద్యోగులు, నిపుణులు ర్యాలీలు నిర్వహించారు. అమెరికా పౌరసత్వమైన గ్రీన్‌కార్డుల జారీకి బాగా జాప్యం జరుగుతోందని, వీటి జారీకి దేశాల వారీ పరిమితి ఎత్తేయాలని కోరుతూ వారు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమెరికాలో ఉంటున్న భారత సంతతి వ్యక్తులు చాలా మంది గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుని వేచి చూస్తున్నారు. దేశాల వారీ కోటా వల్ల పెద్ద ఎత్తున వీరి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా హెచ్1-బీ వీసాలపై అమెరికా వెళ్లి గ్రీన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి నష్టం కలుగుతోందని, సంవత్సరాల తరబడి గ్రీన్‌కార్డుల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. దేశాల వారీ కోటాను ఎత్తేయాలని అక్కడి భారతీయులు ఆయా ప్రాంతాల్లోని శాసనకర్తల మద్దతు కోరుతూ ర్యాలీలు చేశారు. ముఖ్యంగా అర్కాన్సాస్, కెంటుక్కీ, ఓరెగాన్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. దేశాల వారీ కోటా వల్ల ప్రవాస భారతీయులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయంపై అమెరికన్లకు, శాసనకర్తలకు అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు ర్యాలీ నిర్వాహకులు తెలిపారు. ఎప్పుడో లిండన్ జాన్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఈ నిబంధనను పెట్టారని, ఈ కాలానికి ఇది ఏమాత్రం సరిపోదని అభిప్రాయపడ్డారు. లిండన్ జాన్సన్ 1963 నుంచి 1969వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. కెంటుక్కీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన ర్యాలీలో దాదాపు 300 మందిగ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న భారతీయ నిపుణులు పాల్గొన్నారు.

పొద్దు తిరుగుడులో
సస్యరక్షణ చర్యలు

వేసవిలో సాగు చేస్తున్న పొద్దు తిరుగుడు పంటలో సస్యరక్షణ చర్యలు కీలకం. వీటివల్ల పంటకు తామర పురుగులు, తెల్లదోమ ఉధ్రుతి తగ్గడంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. పంట ప్రస్తుతం 25-30 రోజుల దశలో ఉంటుంది. విత్తిన 25-30 రోజుల తరువాత గొర్రుతో అంతర కృషి చేసి కలుపును నివారించి, ఎకరానికి 20 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. అదేవిధంగా 50 రోజుల తరువాత మరోసారి 20 కిలోల యూరియాను చల్లాలి. మొగ్గ తొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టు దశలను కీలక దశలుగా పరిగణించి పంటను బెట్టకు గురికాకుండా చూసుకోవాలి. సాలు మార్చి సాలుకు నీరుపెట్టినట్లయితే నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. పైరు బెట్టకు గురైనప్పుడు తామర పురుగుల ఉధ్రుతి ఉంటే మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లీటరు నీటికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 4 మిల్లీలీటర్లు 10 లీటర్ల నీటిలో కలిపి రెండు లేక మూడుసార్లు పిచికారీ చేసుకోవాలి. తెల్లదోమల నివారణకు పసుపురంగు జిగురు అట్టలను ఎకరాకు 20 పెట్టాలి. ఉధ్రుతి ఎక్కువగా ఉంటే ట్రైజోఫాస్ రెండు మిల్లీలీటర్లు/ ఫ్లోనికామిడ్ 0.3 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పచ్చ రబ్బరు పురుగు ఆశిస్తే థయోడికార్బ్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. బూజు తెగులు సోకినట్లయితే ప్రోపికొనజోల్ ఒక మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.





వరిలో



ప్రస్తుతం వరిపంట చిరుపొట్ట దశ నుంచి గింజ పాలుపోసుకుని గట్టిపడే దశ వరకు ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వరిసాగు చేసే రైతులు దిగువన పేర్కొన్న సూచనలు పాటించవచ్చు.

- చివరి దఫ నత్రజని ఎరువును పొటాష్‌తో కలిపి పొలంలో నీటిని తీసివేసి బురద పదునులో వేయాలి.
- భాస్వరంగానీ, భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేయరాదు.
- అంకురం నుంచి వరికోతకు సుమారు వారం రోజుల ముందువరకు పొలంలో 5 సెంటీమీటర్ల లోతువరకు నీటిని ఉంచాలి.

వేసవిలో మినుము, లేదా పెసరసాగు

- నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వేసవిలో మినుము, పెసర సాగుచేసే అవకాశం ఉంది.
- గోదావరి డెల్టా ప్రాంతంలో రబీ వరి తరువాత మూడో పంటగా మార్చి ఆఖరు నుంచి ఏప్రిల్ మొదటివారం వరకు మినుము, పెసర పైర్లను విత్తుకోవచ్చు.
- ప్రత్తి పంట అయిన తరువాత పసుపు సాగుచేసే నీటి వసతిగల లంక భూముల్లో పసుపు తరవాత మార్చిలో కూడా మినుము సాగుచేసుకోవచ్చు.
- కృష్ణాడెల్టాలో నీటి వసతి ఉన్నచోట వరి మాగాణుల్లో మూడో పంటగా వేసవిలో మార్చి 15వ తేదీ వరకు మినుము సాగుచేయవచ్చు.
- కొబ్బరి, పండ్ల తోటల్లో అంతర పంటగా అవకాశం ఉన్నచోట నీటివసతిగల అన్ని ప్రాంతాల్లో ఏ పంటల సరళిలోనైనా వేసవిలో మినుము, పెసర పైర్లను విత్తుకోవచ్చు.

ప్రత్తి



కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడే ప్రత్తి సాగు మొదలైంది. ఇలాంటి చోట్ల తొలిదశలో రసం పీల్చే పురుగుల నివారణతోపాటు రెండు శాతం పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయడం ద్వారా, మొక్క ఎదుగుదలను సక్రమంగా ఉంచుకోవడం సాధ్యమవుతుంది.

- తొలి దశనుంచి గులాబీ రంగు పురుగు గురించి పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా పంటను పూర్తిస్థాయిలో కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది.

మొక్కజొన్న



గింజ పాలుపోసుకునే దశలో మొక్కజొన్న పంటకు పక్షుల బెడద అధికంగా ఉంటుంది.

- పంటను కాపాడుకోవడానికి తగిన చర్యలు చేపట్టాలి.
- శబ్ద పరికరాలు ఉపయోగించి లేదా మెరిసే రిబ్బన్లను పైరుకు ఒక మీటరు ఎత్తులో ఉత్తర దక్షిణ దిశల్లో కట్టడం లేదా పైరు చుట్టూ 2-3 వరుసల్లో కంకి పక్కనున్న ఆకులతో కంకిని చుట్టడం చేయాలి.

చెరకు



మొక్క తోటలను నేల మట్టానికి నరికి కార్శి తోటకు సిఫారసు చేసిన సగం నత్రజని, పూర్తి భాస్వరం, పొటాష్ ఎరువులను మోళ్ల చెక్కి పిదప మొదళ్ల దగ్గర వేసి తడి ఇవ్వాలి.

- ఎకరానికి 1.25 టన్నుల చెరకు చాళ్లపై పలుచగా కప్పాలి.
- తేలికపాటి నేలలకు 7 నుంచి 10 రోజులకు ఒక తడి చొప్పున నీటి తడులు ఇచ్చి చెరకు పిలకలను సంరక్షించుకోవాలి.

రబీ జొన్న

- రబీ జొన్న కోతకు సిద్ధంగా ఉంటుంది కాబట్టి పంట కోసేటప్పుడు కంకులలోని గింజలను పరిశీలించి పంటను కోయాలి.
- కోతకు సిద్ధంగా ఉన్నపుడు కంకులలోని గింజలు తెల్లగా మారి గింజలలో పాలు ఎండిపోయి పిండిగా మారినపుడు గింజ కింది భాగంలో నల్లటి చార ఏర్పడుతుంది.
- కంకులను పల్చగా ఆరబెట్టి నూర్పిడి చేసిన గింజలను ఎండబెట్టి నిల్వ చేయాలి.

టమోటాకు సూది పురుగు బెడద



టమోటా పంటను నష్టపరిచే పురుగులలో ముఖ్యమైనది సూది పురుగు. ఈ పురుగు మనదేశంలో 2014 నుంచి వ్యాపించినట్లు సమాచారం. పురుగు దక్షిన అమెరికా నుంచి యూరప్‌లోని వివిధ దేశాలకు, ఆఫ్రికా ఖండమంతా కొత్తగా ప్రవేశపెట్టబడిన తరువాత మన దేశంలోకి కొత్తగా ప్రవేశించింది. సూది పురుగు విపరీతంగా ఆశించడంవలన గ్రీన్‌హౌస్‌లలోనూ పొలాల్లోనూ పండించే టమోటా పంటకి 90శాతం వరకు దిగుబడులలో నష్టం జరగడంతోపాటు పండ్ల నాణ్యత కూడా కోల్పోతుంది. ఈ నేపథ్యంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

గుర్తించే విధానం

గుడ్లు దశ : గుడ్లు స్థూపాకారంలో చిన్నవిగా తెలుపు నుంచి పసుపు రంగులో 0.35 లీటర్ల పొడవుతో ఉంటాయి. తల్లి పురుగు గుడ్లను ఆకుల కింది భాగంలోనూ లేదా కాండం మీద పెడుతుంది. గుడ్లు 4-6 రోజుల్లో పొదగబడి పిల్ల పురుగులు వస్తాయి. గుడ్లు పగిలేముందు నలుపు రంగులోకి మారతాయి.

లార్వా దశ : గుడ్డు నుంచి బయటికి వెలువడిన వెంటనే లార్వా తెలుపు రంగులో ఉండి తరువాత ఆకుపచ్చ రంగుకి లేదా గులాబీ రంగుకి మారుతుంది. లార్వా తీసుకునే ఆహారాన్ని బట్టి దాని శరీర రంగు ఉంటుంది. లార్వా దశలో నాలుగు అంతర దశలు ఉంటాయి. లార్వా దశ కాలం 110-15 రోజులు.

ప్యూపాదశ : ప్యూపా ఆకుపచ్చ రంగులో ఉండి క్రమేణా గోధుమ రంగులోకి మారుతుంది. ప్యూపా దశ 10 రోజులు. ఆకులపై లేదా ఆకులమీద తొలిచిన సొరంగాలలో లేదా నేలలో కోస్త దశకు చేరుకుంటుంది.

ప్రౌఢ దశ (శలభం) : శలభం 5-7 మిల్లీమీటర్ల పొడవుతో, రెక్కలపైన వెండి, బూడిద రంగు పొలుసులుంటాయి. ఈ పురుగు చలికాలంలో గుడ్డు దశ, ప్యూపాదశలలో సుప్తావస్థకు చేరుకుంటుంది. తల్లి పురుగు సుమారు 250 గుడ్లు పెడుతుంది. మొత్తం జీవితకాలం 30-40 రోజులు. సంవత్సరంలో 12 తరాలను పూర్తిచేసుకుంటుంది.

గాయ లక్షణాలు : సూది పురుగు లార్వా ఆకు పొరల మధ్యలోనికి ప్రవేశించి, ఆకును తొలుచుకుంటూ పత్రహరితాన్ని గోకి తింటుంది. దీనివలన ఆకులపై ఆకారం లేని సొరంగాలు ఏర్పడతాయి. టమోటా మొక్కలను నారు దశ నుంచి పురుగు ఆశిస్తుంది. మొక్కల అన్ని భాగాలను అనగా ఆకులు, కాండం, మొగ్గలు, పత్రపుచ్చాలు.. లేత, పక్వానికి వచ్చిన కాయలను కూడా ఆశించి నష్టం కలిగిస్తుంది. ఈ పురుగు చేసిన గాయాల ద్వారా ఇతర పూతకాహార శిలీంద్రాలు ప్రవేశించడం వలన కాయలు, పండ్లు కుళ్లిపోతాయి. టమోటానే కాకుండా ఈ పురుగు బంగాళాదుంపను కూడా ఆశిస్తుంది.

యాజమాన్య పద్ధతులు

- పంట అవశేషాలను, వ్యర్థాలను తగులబెట్టాలి.
- లింగాకర్షక బుట్టలు ఒక ఎకరానికి 30-40 ఉపయోగించి యగ రెక్కల పురుగులను సామూహికంగా ఆకర్షించాలి. లేదా ఎకరానికి 4-5 బుట్టలను పెట్టి ఒక వారంలో బుట్టకు 10 పురుగులు పడినట్లయితే పురుగుమందులతో సస్యరక్షణ చేపట్టాలి.
- సైనోసాడ్ 0.3 మిల్లీలీటర్లు లేదా ఇడాక్సకార్బ్ 0.75 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

'ఏక్' సెన్సార్ పూర్తి...

ఏప్రిల్‌లో విడుదల



కె వరల్డ్ మూవీస్ బ్యానర్‌పై రుద్రారపు సంపత్ డైరెక్షన్‌లో బిష్ణు, హిమాంశి కురానా, అపర్ణ శర్మ హీరోహీరోయిన్లుగా నిర్మాత హరికృష్ణ నిర్మించిన చిత్రం 'ఏక్'. బీయింగ్ హ్యూమన్ అనేది ఉపశీర్షిక. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాత హరికృష్ణ మాట్లాడుతూ.. " ఏక్ చిత్రం నేటి జనరేషన్ యూత్ కోసం సరికొత్తగా రూపొందించడం జరిగింది. మానవీయ విలువలతో, మంచి కాన్సెప్ట్‌తో దర్శకుడు సంపత్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మంత్ర ఆనంద్ సంగీతం సారథ్యంలో రూపుదిద్దుకున్న పాటలను ఇటీవల కింగ్ నాగార్జున విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆడియోకి చాలా మంచి స్పందన వచ్చింది. అలాగే హిందీ డబ్బింగ్ రైట్స్ కోసం ఫ్యాన్సీ ఆఫర్స్ వచ్చాయి. విడుదలకు ముందే చిత్రంపై ఇంత మంచి పాజిటివ్ రెస్పాన్స్ ఉండటం చాలా ఆనందంగా ఉంది. విడుదల తర్వాత కూడా అందరిని ఈ చిత్రం మెప్పిస్తుంది. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ సభ్యులు చిత్రంపై మంచి ప్రశంసలు కురిపించారు. సెన్సార్ సభ్యుల నుండి యు బై ఏ సర్టిఫికెట్ పొందిన మా చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాము.." అన్నారు.

బిష్ణు, హిమాంశి కురానా, అపర్ణ శర్మ, సుమన్, బెనర్జీ, పృథ్విరాజ్, శ్రవణ్, సర్దార్, అమన్ మొదలగు వారు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మంత్రం ఆనంద్, ఆర్ట్: విజయ్ కృష్ణ, కెమెరా: చక్రవర్తి ఘనపాటి, ఎడిటింగ్: నందమూరి హరి, స్టోరీ-స్క్రీన్ ప్లే-డైలాగ్స్-నిర్మాత: హరికృష్ణ కొక్కొండ, దర్శకత్వం: సంపత్ రుద్రారపు.

ప్రభుదేవా గులేబకావళి గీతావిష్కరణ



ప్రభుదేవా, హన్సిక హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ చిత్రం గులేబకావళి. కళ్యాణ్ దర్శకత్వం వహించారు. రేవతి ప్రధాన పాత్రను పోషించారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించిన ఈ చిత్ర గీతాలు సోమవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. బిగ్‌సీడీని రాష్ట్ర సాంస్కృతిక శాఖసారథి, శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ విడుదలచేశారు. ఆడియో సీడీలను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని శ్రీమతి జీవితా రాజశేఖర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ అంశాలు మిళితమైన అందమైన చిత్రమిది. నిధి అన్వేషణ నేపథ్య కథాంశాలతో దక్షిణాదిలో వచ్చిన సినిమాలన్నీ పెద్ద విజయాల్ని సాధించాయి. ఈ సినిమా ఆ జాబితాలో నిలవాలి. చిన్న నిర్మాతల సినిమాల్ని విడుదలచేసి వారికి సహాయపడాలనే తపన మల్కాపురం శివకుమార్‌లో కనిపిస్తుంది. ఆయన చేసే ప్రతి సినిమా సక్సెస్ కావాలి అని తెలిపారు. తెలుగు,తమిళ నేటివిటీకి సరిపోయే కథ ఇదని, అందరికీ నచ్చే విధంగా ఉంటుందని దర్శకుడు కల్యాణ్ చెప్పారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ చెన్నైలో ఐదోవారంలో ఈసినిమా చూశాను. తమిళ భాష రాకపోయినా సాధారణ ప్రేక్షకుడిగా సినిమాను చాలా ఎంజాయ్‌చేశాను. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది. ఏప్రిల్ 6న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం అని తెలిపారు శాసనసభ్యుడు, రాష్ట్ర సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్ మాట్లాడుతూ అన్నం ఉడికిందా లేదా చూడాలంటే ఒక్క మెతుకు చూస్తే చాలంటారు. పాటలు, ట్రైలర్ బట్టే ఈ సినిమా సక్సెస్ తెలుస్తున్నది. నృత్యదర్శకుడిగా, దర్శకుడిగా, నటుడిగా బహుముఖప్రజ్ఞాశాలిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు ప్రభుదేవా. తన కథతో ప్రభుదేవాను ఒప్పించి తొలి సినిమాతోనే ప్రతిభను చాటారు దర్శకుడు కల్యాణ్. పెద్దా, చిన్నా అనే తేడా లేకుండా కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ ధైర్యాన్నిస్తున్నారు మల్కాపురం శివకుమార్. చిన్న సినిమాల్ని ఆదరిస్తున్న గొప్ప నిర్మాత. నాకు ఏం మిగులుతుందనే ఆలోచనను పక్కనపెట్టి ఎదుటివారిలో ఆనందాన్ని చూసి సంతోషపడే వ్యక్తి ఆయన. నేను ఓ సినిమా చేయబోతున్నాను. ఆ సినిమాకు శివకుమార్ పంపిణీదారుడిగా వ్యవహరించనున్నారు ప్రయోగాత్మకంగా తెరకెక్కనున్న ఆసినిమాను జూన్-2న విడుదలచేయనున్నాం అని తెలిపారు. జీవిత మాట్లాడుతూ గరుడవేగ సినిమాను ఎలా విడుదలచేయాలి, ఏ విధంగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలో తెలియని అయోమయంలో ఉన్న సమయంలో శివకుమార్ సహాయం అందించారు. ఆ సినిమా పెద్ద సక్సెస్‌గా నిలవడానికి ఆయనే కారణం. తెలంగాణలో శివకుమార్ పెద్ద నిర్మాతగా పేరుతెచ్చుకోవాలి అని చెప్పారు. మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలనే శివకుమార్ ప్రయత్నం విజయవంతమవ్వాలని శ్రీనివాస్ బొగ్గరం చెప్పారు. ప్రభుదేవా స్ఫూర్తితోనే తాను ఇండస్ట్రీలో అడుగుపెట్టానని, అలాంటిది ఆయన సినిమాకు కొరియోగ్రఫీ అందించే సమయంలో భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయని జానీమాస్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బీరం సుధాకర్‌రెడ్డి, బీరం లోకేష్‌రెడ్డి, రచ్చరవి, జబర్దస్త్ రాము పాల్గొన్నారు. మధుసూదన్, ఆనంద్‌రాజ్, సత్యన్, మన్సూర్ అలీఖాన్, యోగిబాబు, రాజేంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం:వివేక్ మెర్విన్, సాహిత్యం: సామ్రాట్, సినిమాటోగ్రఫీ: ఆర్.ఎస్. ఆనంద్‌కుమార్, ఆర్ట్ డైరెక్టర్: కె. కధిర్, విజువల్ ఎఫెక్ట్స్: రాఘురామన్, స్టంట్స్: పీటర్ హెయిన్, రాక్ ప్రభు, నిర్మాత: మల్కాపురం శివకుమార్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కళ్యాణ్.

మనవడితో బ్రహ్మానందం సందడి!



బ్రహ్మానందం. పరిచయం అక్కర్లేని పేరు. ఆయన కనీసం డైలాగైనా చెప్పనక్కర్లేదు.. అలా వెండితెరపై కనపడితే చాలు నవ్వుల పువ్వులు పూస్తాయి. హాస్యానికి కేరాఫ్ అడ్రస్ అంటూ ఉందంటే అది బ్రహ్మానందం. మరి ప్రేక్షకులకు అంతలా వినోదం పంచే 'మీరు తీరిక వేళల్లో ఏం చేస్తారు' అని ఆయనను అడిగితే ఇదిగో ఇలా మనవడితో ఆడుకుంటూ ఉంటానని చెబుతారు. ఇంతకాలం తన ఇష్టాయిష్టాలకు వ్యతిరేకంగా పనిచేశానని చెప్పే బ్రహ్మానందం.. ఇప్పుడు రిలాక్సయ్యే సమయం దొరికిందని అంటున్నారు. అలా అని చెప్పడమే కాదు.. ఇలా మనవడిని భుజాలపై కూర్చోబెట్టుకుని ఆడిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇక బ్రహ్మానందం మరోసారి తనదైన కామెడీతో అలరించేందుకు సిద్ధమయ్యారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటించిన చిత్రం ఎం.ఎల్.ఎ. కాజల్ కథానాయిక. ఉపేంద్ర మాధవ్ దర్శకుడు. ఈ నెల 23న సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ.. "ఈనెల 23న 'ఎం.ఎల్.ఎ.' మంచి లక్షణాలున్న అబ్బాయి సినిమా విడుదలవుతోంది. నేను, పోసాని, పృథ్వీ అతిరథ మహారథులైన కమెడియన్స్ నటించిన ఒక అవుట్ అండ్ అవుట్ కామెడీ సినిమా ఇది. దానితో పాటు, కల్యాణ్‌రామ్‌గారి హీరోయిజం మిమ్మల్ని అందరినీ అలరిస్తుంది.. ఆనందపరుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ వేసవిలో తేనీటి విందు 'ఎం.ఎల్.ఎ.' సినిమా తప్పక చూడండి" ట్విటర్ వేదికగా కోరారు.

'కాలా'కు భారీ డిమాండ్!



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ నటించిన చిత్రం 'కాలా'. పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం శాటిలైట్ హక్కులకు భారీ డిమాండ్ నెలకొందట. హక్కుల కొనుగోలుకు ఓ ప్రముఖ టీవీ ఛానెల్ రూ.75 కోట్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. అన్ని భాషల్లో హక్కులను ఛానెల్ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. కానీ ఈ చిత్రం రజనీ '2.ఓ'ను బీట్ చేయలేకపోయింది. ఈ చిత్రం శాటిలైట్ హక్కులను రూ.110 కోట్లకు ఓ ప్రముఖ ఛానెల్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. దాదాపు రూ.400 కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తున్నారు. దీపావళికి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'కాలా' ఫస్ట్‌లుక్‌ను మార్చి 2న విడుదల చేశారు. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా టీజర్‌కు విశేష స్పందన లభించింది. ఈ ప్రచార చిత్రం యూట్యూబ్‌లో 30 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. దీంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. వండర్‌బార్ పతాకంపై హీరో ధనుష్ 'కాలా' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నానా పటేకర్, హుమా ఖురేషీ, పంకజ్ త్రిపాఠి, ఈశ్వరీ రావు ప్రధాన పాత్రలు పోషించారు. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'రైడ్' సరికొత్త రికార్డు

బాలీవుడ్ నటులు అజయ్ దేవగణ్, ఇలియానా జంటగా నటించిన చిత్రం 'రైడ్'. రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ పథక్, కుమార్ మంగత్ పథక్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరించారు. అమిత్ త్రివేది, తనిష్క్ బాగ్చి సంగీతం అందించారు. ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి టాక్ అందుకుంది. అంతేకాదు చిత్రం బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను రాబడుతోన్నట్లు సినీ విశ్లేషకులు పేర్కొన్నారు. 'రైడ్' తొలిరోజున (శుక్రవారం) రూ.10.04 కోట్లు, శనివారం రూ.13.86 కోట్లు, ఆదివారం రూ.17.11 కోట్లు.. మూడు రోజుల్లో మొత్తం రూ.41.01 కోట్లు వసూలు చేసినట్లు విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. వీక్షకుల ప్రచారంతో వసూళ్లు బాగా పెరిగాయని అన్నారు. ఈ ఏడాది 'పద్మావత్' తర్వాత తొలివారంలో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన చిత్రం 'రైడ్' అని ఆయన తెలిపారు. 'పద్మావత్' తొలివారంలో అన్ని భాషల్లో కలిసి మొత్తం రూ.114 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడు రూ.41.01 కోట్లతో 'రైడ్' రెండో స్థానం దక్కించుకుంది. రూ.40.05 కోట్లతో 'ప్యాడ్‌మ్యాన్' మూడో స్థానంలో, రూ.26.57 కోట్లతో 'సోనూకీ టిటు స్వీటీ' నాల్గో స్థానంలో, రూ.15.34 కోట్లతో 'పరి' ఐదో స్థానంలో ఉన్నట్లు తరణ్ వెల్లడించారు.



శ్రియ పెళ్లి.. తొలి ఫొటో!

ప్రముఖ నటి శ్రియ, రష్యాకు చెందిన ప్రియుడు ఆంద్రీ కోశ్చీవ్‌ను రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్నట్లు మొదట వార్తలు వచ్చాయి. ఇప్పుడు శ్రియ.. ఆంద్రీ పెళ్లి చేసుకున్న ఫొటోలు బయటికి వచ్చాయి. అయితే వీరిద్దరూ ఉదయ్‌పూర్‌లో కాకుండా ముంబయిలో స్నేహితులు, కుటుంబీకులు, సన్నిహితుల సమక్షంలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. శ్రియ ఎరుపురంగు చీరలో, నగలతో మెరిసిపోతున్నారు. వరుడు ఆంద్రీ షేర్వాణీ ధరించారు. ఇద్దరూ ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటున్నప్పుడు తీసిన ఫొటో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఆంద్రీ రష్యాకు చెందిన వ్యాపారవేత్త. దాదాపు ఐదేళ్లుగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. కొన్ని రోజుల తర్వాత శ్రియ మళ్లీ చిత్రీకరణలో పాల్గొంటారు. ప్రస్తుతం ఆమె 'వీరభోగ వసంతరాయులు', 'తడ్కా' చిత్రాల్లో నటిస్తున్నారు.

ఒడిశాలో కూలిన శిక్షణ విమానం



మయూర్ భంజ్ : ఒడిశా మయూర్‌భంజ్ జిల్లాలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానం మంగళవారం కూలిపోయింది. ట్రైయినీ పైలెట్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సివుంది. పశ్చిమ బెంగాల్ కాలికుండా వైమానికి దళ కేంద్రం నుండి హాక్ విమానం రోజువారి శిక్షణకు బయలుదేరిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసును సీఓఐ దర్యాప్తు చేస్తుంది. ఆధారాల ప్రకారం విమానం భరిపాద గ్రామంలోని మహాదాగిరి ప్రదేశంలోని సువర్ణరేఖ అంచును ఢీ కొన్నట్లుగా వైమానిక దళం వివరణ ఇచ్చింది.

క్షమాపణలు చెప్పిన కేజ్రీవాల్ : శాంతించిన గడ్కరీ



ఢిల్లీ: పరువునష్టం దావా కేసులో గతంలో తాను చేసిన ఆరోపణలపై అకాలీదళ్ నేతకు క్షమాపణలు చెప్పిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తాజాగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి క్షమాపణలు చెప్పారు. సరైన ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలకు చింతిస్తున్నట్లు నితిన్ గడ్కరీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. వ్యక్తిగతంగా గడ్కరీ అంటే ఎలాంటి వ్యతిరేకత లేదన్న కేజ్రీవాల్ తాను చేసిన ఆరోపణల అంశానికి ఇక ముగింపు పలుకుదామని విజ్ఞప్తి చేశారు. గతంలో తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేశారంటూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దిల్లీ పటియాల హౌస్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. కేజ్రీవాల్ తన ఆరోపణలు ఉపసంహరించుకోవడంతో పాటు క్షమాపణలు చెప్పడంతో కేంద్రమంత్రి శాంతించారు.



ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అధికారుల
తక్షణ అరెస్టులకు సుప్రీం నో

న్యూఢిల్లీ : కఠినంగా రూపొందించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు (దురాగతాల నివారణ) చట్టం దుర్వినియో గానికి గురవుతోందని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదులు నమోదైనప్పుడు డిప్యూటీ సూపరింటెండెంట్ దిగువ స్థాయి అధికారిని అరెస్టు చేయాలంటే ముందుగా ప్రాథమిక విచారణ తప్పనిసరని తెలిపింది. ఈ చట్టం కింద ఫిర్యాదు దాఖలైన వెంటనే అరెస్టులు తగవని జస్టిస్ అదర్శ్ గోయల్, జస్టిస్ యూయూ లలిత్ ధర్మాసనం సూచించింది. ఈ చట్టం కింద ఏ ఒక్క ప్రభుత్వ అధికారిపై ఫిర్యాదు దాఖలైతేగనుక ముందస్తు బెయిల్ మంజూరు కాబోదని స్పష్టంచేసింది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదైనప్పుడు సంబంధిత అధికార యంత్రాంగం అనుమతి నిచ్చిన తర్వాతే నిందిత అధికారిపై చర్యలు తీసుకోవడంగానీ అరెస్టు చేయడంగానీ జరగాలని సుప్రీంధర్మాసనం స్పష్టంచేసింది.

ఉద్యోగాల కోసం
ఉద్యమించిన యువత

ముంబైలో స్తంభించిన రైళ్లు
లక్షలాది ప్రయాణికుల ఇక్కట్లు



ముంబై : ఉద్యోగాల కోసం ముంబైలో నేడు యువత ఉద్యమించింది. సబర్బన్ రైళ్లతో సహా రైలు సర్వీసులను నిలిపివేసింది. దీనితో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. రైల్వేలలో ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ విద్యార్థులు, యువజనులు మతుంగ, దాదర్ స్టేషన్ల మధ్య సబర్బన్ సర్వీసులతో సహా రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. దీనితో లక్షలాది మంది ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారని సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. వేల సంఖ్యలో విద్యార్థులు ఉదయం 7 గంటలకు రైలు పట్టాలపై బైఠాయించారు. దానితో రైల్వే శాఖ మతుంగా, సీఎస్ఎంటీ మధ్య సబర్బన్ రైళ్లను అదేవిధంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపివేయాల్సి వచ్చింది. మతుంగ, సీఎస్ఎంటీ మధ్య మొత్తం నాలుగు లైన్లలోనూ రాకపోకలపై విద్యార్థి, యువజనుల ఆందోళన ప్రభావం తీవ్రంగా పడింది. పోలీసులు, రైల్వే అధికారులు వారితో చర్చలు జరిపారని అధికారులు తెలిపారు.

"రైల్వే శాఖలో గత నాలుగు సంవత్సరాలుగా ఎటువంటి నియామకాలు లేవు. ఖాళీల భర్తీ కోసం మేము పోరాడుతున్నాం. పదిమందికిపైగా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అటువంటి పరిణామాలను మేము అనుమతించలేం" అని ఆందోళనలో పాల్గొన్న ఒక విద్యార్థి పేర్కొన్నాడు. "రైల్వే మంత్రి పియూష్ గోయెల్ వచ్చి, మమ్మల్ని కలిసే వరకు ఇక్కడి నుంచి కదలబోం. డీఆర్ఎం (డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫ్ ముంబై డివిజన్)కి మేము అనేక విజ్ఞాపనలు అందించాం. అవేవీ ఫలించలేదు" అని మరో విద్యార్థి తెలిపారు. "జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ జవాన్లతో పాటు ముంబై పోలీసులు విద్యార్థులతో చర్చలు జరిపారు. రైల్వే శాఖ మొదటి ప్రాధాన్యత పట్టాలను ముందుగా ఖాళీచేయడం" అని మధ్యరైల్వే చీఫ్ పీఆర్ఓ సునీల్ దాని తెలిపారు. రైల్వేలకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. జీఎం కోటాను ఒకేదఫా పరిష్కరించాలని డిమాండు చేస్తూ విద్యార్థులు ప్లకార్డులను చేబూనారు. ప్రభుత్వం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని వారు డిమాండు చేశారు.

రాహుల్ ప్రసంగ స్ఫూర్తితో..
గోవా పీసీసీ అధ్యక్షుని రాజీనామా

న్యూఢిల్లీ : శని, ఆదివారాల్లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ప్రసంగ స్ఫూర్తితో యువనాయకులకు పదవులు కల్పించేందుకు మార్గాన్ని సుగమం చేస్తూ ఆ పార్టీ గోవా రాష్ట్ర అధ్యక్షుడు శాంతారాం నాయక్ పదవికి రాజీనామా చేశారు. పార్టీకి నాయకత్వం వహించి నడిపించేందుకు యువతరానికి అవకాశం కల్పించాలని తాను కోరుకుంటున్నానని ప్లీనరీ ముగింపు సమావేశంలో రాహుల్ ప్రసంగానికి స్పందించి పదవికి మొట్టమొదటగా రాజీనామా చేసిన వ్యక్తి నాయక్. అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి నాయక్ మంగళవారం తన రాజీనామా లేఖను పంపించారు. పీసీసీ అధ్యక్ష పదవిని 2017 జూలై 8న నాయక్ చేపట్టారు. పార్టీ సీనియర్ నాయకులు లుజినోహ్ ఫెలిరో స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. "యువతరం ముందుకు వచ్చి నాయకత్వ



బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమం చేసేందుకు గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి నేను రాజీనామా చేశాను. ప్లీనరీ సెషన్‌లో రాహుల్ గాంధీ ప్రసంగానికి నేను స్ఫూర్తి పొందాను. యువతరానికి అవకాశం కల్పించాలని నేను కోరుకుంటున్నాను" అని పీటీఐకి తెలిపారు.

శశికళ భర్త నటరాజన్ మృతి

చెన్నై: జైలులో ఉన్న ఏఐఏడీఎంకే నాయకురాలు వీకే శశికళ భర్త ఎం.నటరాజన్ (74) ఇక్కడి ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. మూత్రపిండాల వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. అక్టోబరులో మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న నటరాజన్ రెండు వారాల క్రితం అనారోగ్యంతో చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో చేరారు. గతంలో ప్రజా సంబంధాల అధికారిగా పనిచేసిన ఆయన 1975లో శశికళను వివాహం చేసుకున్నారు. విద్యార్థి దశలో హిందీ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. డీఎంకేలో చురుకైన పాత్ర పోషించారు. జయలలితకు కొన్నాళ్ల పాటు రాజకీయ సలహాదారు గానూ వ్యవహరించారు. బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న శశికళకు కోర్టు 15 రోజులు పెరోల్ మంజూరు చేసింది. ప్రజల అంతిమ దర్శనం కోసం నటరాజన్ భౌతికకాయాన్ని బీసెంట్ నగర్‌లోని ఆయన నివాసం వద్ద ఉంచారు. అంతిమ సంస్కారాల కోసం భౌతికకాయాన్ని ఈ సాయంత్రం ఆయన తంజావూరు జిల్లాలోని స్వస్థలానికి తీసుకువెళ్లారు.



15 రోజులు పెరోల్

అదాయానికి మించి ఆస్తుల కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న శశికళకు న్యాయస్థానం 15రోజుల పెరోల్ మంజూరు చేసింది. భర్తను కడసారి చూసేందుకు ఆమె పెరోల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం మంజూరు చేసింది. దీంతో ఆమె బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలు నుంచి విడుద లయ్యారు. అంత్యక్రియలలో పాల్గొనేందుకు శశికళ రోడ్డు మార్గం ద్వారా తంజావూరుకు నేరుగా బయలుదేరారు.

ప్రపంచ జల సంక్షోభం, సహజసిద్ధ పరిష్కారానికి
భారత్ కసరత్తుకు ఐరాస ప్రశంస



న్యూఢిల్లీ : ప్రపంచంలో జలసంక్షోభం ముప్పు పొంచివున్న నేపథ్యంలో దాన్ని అధిగమించేందుకు సహజసిద్ధ పరిష్కారాలను కనుగొనేందుకు భారత్ చేస్తున్న కృషిని ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రశంసించింది. 2050నాటికి ఐదు బిలియన్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కోనున్న నేపథ్యంలో భారత్‌లోని స్థానిక సంస్థలు ఇందుకు సహజసిద్ధమైన పరిష్కారాలను కనుగొనేందుకు తీవ్రస్థాయిలో కసరత్తు చేయడాన్ని ఐరాస ప్రపంచ జల అభివృద్ధి నివేదిక 2018 నివేదికలో అభినందించింది. బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద జల కార్యక్రమంలో చైనా వారి వర్షపు నీటి రీసైక్లింగ్, భారతదేశ ఫారెస్ట్ రీజెనరేషన్, ఉక్రెయిన్ ఆర్టిఫీషియల్ వెట్‌ల్యాండ్స్ వంటి సహజసిద్ధ పరిష్కారాలను ఐరాస పరిశీలించింది. పెరుగుతున్న జనాభా, వాతావరణంలో మార్పుల కారణంగా జలభద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు జలవనరులను సమర్థవంతంగా నిర్వహించడం కీలకమని, ఇందుకోసం కొత్త పరిష్కారాలు కూడా అంతే ముఖ్యమని నివేదిక ముందుమాటలో యూఎన్ ఎడ్యుకేషన్, సైంటిఫిక్, కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) హెడ్ ఆడ్రేఅజౌలే పేర్కొన్నారు. ఏమీ చేయకుండా ఉన్నట్లయితే 2050 నాటికి ఐదు బిలియన్ల మంది పేదలకు నీటికటకట తప్పదని హెచ్చరించారు. భారత్‌లో పలుచోట్ల ప్రయోగాత్మకంగా చేపట్టిన పలు కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చినట్టు నివేదిక పేర్కొంది. వినూత్నమైన జల పరిష్కారాలు గ్రామీణ భారత్‌లో నీటి భద్రతను మెరుగు పరిచిందని తెలిపింది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల తడి నేతలు మరింత తడిగా , పొడి నేలలు మరింత పొడిగా మారుతున్నాయని వివరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సగం జనాభా అంటే దాదాపు 3.6 బిలియన్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని పేర్కొంది. 2050 నాటికి ప్రపంచ జనాభా మరింత పెరగనున్న నేపథ్యంలో నీటి కష్టాలు తీవ్రతరమౌతాయని వెల్లడించింది. ఇరిగేషన్ కెనాల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ వంటివి మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం కావని పేర్కొంది. 70శాతం వర్షపు నీటిని రీసైకిల్ చేసే చైనా స్పాంజ్ సిటీ ప్రాజెక్టును ఉదాహరణగా చూపింది. పెరుగుతున్న నీటి డిమాండును అధిగమించేందుకు చైనా ఇటీవల ప్రాజెక్ట్ స్పాంజ్ సిటీని చేపట్టిందని, తద్వారా పట్టణాల్లో పరిస్థితి మెరుగుపడిందని, 70శాతం వర్షపు నీరు రీసైకిల్ అవుతోందని నివేదిక వెల్లడించింది.

ఉన్నత విద్య ప్రైవేటీకరణ, వ్యాపారీకరణపై నిరసన

ఢిల్లీ వర్సిటీ అధ్యాపకులు ఐదు రోజుల సమ్మె

న్యూఢిల్లీ : దేశంలో అత్యధిక మంది విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే... కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ లోకం నిరసన గళం విప్పింది. విద్య ప్రయివేటీకరణ, వ్యాపారీ కరణ చేసే ప్రభుత్వ ఎత్తుగడలను నిరసిస్తూ ఢిల్లీ యూనివర్సిటీ ఆందోళనను ముమ్మరం చేసింది. ఢిల్లీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) ఐదు రోజుల సమ్మెను సోమవారం నుంచి ప్రారంభిం చింది. వెయ్యికిపైగా ఉపాధ్యాయులు విశ్వవిద్యాలయ నార్త్ క్యాంపస్‌లో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్య ప్రజల హక్కు అంటూ నినాదాలు చేస్తూ వేలాది మంది ఉపాధ్యాయులు కదం తొక్కారు. ప్రయివేటీకరణ విధానాలలకు వ్యతిరేకంగా సెంట్రల్ యూనివర్సిటీల టీచర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఈడీసీయూటీఏ) కూడా ఈ నెల 28న మండీ హౌస్ నుంచి పార్లమెంటు స్ట్రీట్ వరకు ప్రదర్శనకు పిలుపు నిచ్చింది. ఇతర వర్సిటీల ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. యూనివర్సిటీల ఆర్థిక భారం విద్యార్థులమీద వేసేలా హెచ్ఆర్‌డీ మంత్రిత్వ శాఖ తీసుకొస్తున్న విధానాలను ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ విధాన మార్పులలో 70 : 30 కొత్త నిధుల ఫార్ములాను హెచ్ఆర్‌డీ ఇటీవల ప్రకటించింది. 30 శాతం నిధులను వర్సిటీలే సమకూర్చుకోవాలని హెచ్ఆర్‌డీ కోరుతున్నది. కేంద్ర, ఇతర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులపై భారీగా ఫీజుల పెరుగుదలకు ఈ విధానం దారి తీస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

'చీతా జిందాహై..'

- తిరిగి విధుల్లోకి సీఆర్‌పీఎఫ్ కమాండర్
- చేతన్ కుమార్ చీతా జవాన్లకు స్ఫూర్తి : సైనికాధికారులు
- మృత్యుంజయుడు : వైద్యులు



న్యూఢిల్లీ : సీఆర్‌పీఎఫ్ ధీరుడు చేతన్ కుమార్ చీతా తిరిగి విధుల్లో చేరారు. 2017లో ఉత్తర కాశ్మీర్ బందిపురాలో ఉగ్రవాదులతో జరిగిన భీకరపోరులో చేతన్‌కు తొమ్మిది తుటాలు తగిలాయి. చేతన్ కుమార్ చీతా పూర్తిగా కోలుకోలేదు కాబట్టి ఆయనను యుద్ధ క్షేత్రంలోకి పంపకుండా, కార్యాలయానికి సంబంధించిన పనిని అప్పగించనున్నారన్నది అధికారిక సమాచారం. సీజీఓ కాంప్లెక్స్ వద్ద సీఆర్‌పీఎఫ్ డైరెక్టరేట్‌లో చేరిన చీతా పోస్టింగ్ కోసం వేచివున్నారు. గత స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రతిష్టాత్మక కీర్తి చక్రతో ఆయనను సన్మానించారు. చేతన్ కుమార్ చీతా (45) మెదడు, కుడి కన్ను, పొట్ట, ఎడమ చేయి, వెనుక భాగంలోకి తూటాలు చొచ్చుకుపోయాయి. బందిపురా ఎన్‌కౌంటర్‌లో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురు భారత జవాన్లు అమరులయ్యారు. రెండు నెలల పాటు కోమాలో ఉన్న చీతా ప్రాణాలతో బయటపడడం ఒక అద్భుతమని వైద్యులు అంటున్నారు. కాశ్మీర్ లోయలోని సీఆర్‌పీఎఫ్ 45వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ (సీఓ) చీతాను చికిత్స కోసం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆయన రెండు నెలల తర్వాత 2017, ఏప్రిల్ 5న డిశార్జి అయ్యారు. స్పృహలోకి వచ్చే ముందు ఆయన దాదాపు ఒకటిన్నర నెలల పాటు కోమాలో ఉన్నారు. 2017లో జరిగిన దాడి సమయంలో చీతా కనబర్చిన ధైర్యసాహసాలను కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీచీఫ్ జనరల్ బిపిన్ రావత్‌తో పాటు ఇతర దళాధిపతులు మెచ్చుకొన్నారు. కోలుకున్న వెంటనే తిరిగి యుద్ధక్షేత్రంలోకి వెళ్లాలన్న ఆకాంక్షను చేతన్ కుమార్ చీతా వ్యక్తంచేశారు. నాటి ఘటనను గుర్తుచేసుకుంటూ.. ఆ రోజు జరిగినది ఎవ్వరూ ఊహించలేదని, ఇంతకుముందు జరిగిన ఆపరేషన్లు ఏవి కూడా అలా జరగలేదు అని చీతా అన్నారు. 'ఆ రోజుకు ముందు జమ్మూకాశ్మీర్ పోలీసులు, సైన్యం సంయుక్తంగా ఎన్నో ఆపరేషన్లను విజయవంతంగా చేపట్టాయి. కానీ ఆ రోజు పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. సమయా నికి ముందే జవాన్లను ఆర్మీ పంపింది.. ఈ విషయం ఉగ్రవా దులకు తెలిసిపోయిందన్నది నా అంచనా' అని తెలిపారు. ఆయన భార్య మాట్లాడుతూ "ఇవన్నీ చాలా చిన్న సమస్యలు (ఆయన ఆరోగ్యానికి సంబంధించి). తిరిగి విధుల్లో చేరడంతో ఆయన చాలా ఆనందంగా ఉన్నారు. యుద్ధక్షేత్రంలోకి వెళ్లాలని ఎంతో ఆసక్తిగా వేచివున్నారు' అని అన్నారు. 2017లో ఎయిమ్స్ నుంచి డిశార్జి అయిన తర్వాత సీఆర్‌పీఎఫ్ కోబ్రా బెటాలియన్‌లో చేరేందుకు చీతా ఆసక్తి కనబర్చినట్టు నివేదికలు పేర్కొన్నాయి. చీతా తిరిగి సాధారణ స్థితికి చేరుకోవాలంటే మరో ఏడాది సమయం పడుతుందని అధికారులు అంటున్నారు. అయితే దేశం కోసం సేవ చేయాలన్న ఆయన ఉత్సాహం కేంద్ర పారామిలటరీ దళాల్లో చేరే యువతకు ఎంతో స్ఫూర్తిదాయమన్నారు. రాజస్థాన్‌కు చెందిన చీతా 1998 జనవరిలో సీఆర్‌పీఎఫ్‌లో చేరారు.

బీజేపీతో సంబంధాలా? అబద్ధం : రజనీ



చెన్నై : తన వెనుక బీజేపీ ఉందన్న వార్తలను నటుడు రజనీకాంత్ కొట్టిపారే శారు. ప్రజలు, దేవుడి మద్దతు మాత్రమే తనకుందని, ఏ రాజకీయ పార్టీకి తాను మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. హిమాలయాల పర్యటన ముగించుకుని మంగళవారం చెన్నై చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రజనీ మాట్లాడుతూ 'నా వెనక బీజేపీ ఉందని కొందరు ఆరోపిస్తు న్నారు. కానీ నా వెనక దేవుడున్నాడు. ఆ తర్వాత ప్రజలున్నారు. నా రాజకీయ ప్రయాణ విషయంలో మీరు ఎన్ని ప్రశ్నలు వేసినా నా సమాధానం ఇదే' అని అన్నారు. అనంతరం పెరియర్ విగ్రహ వివాదం గురించి మాట్లాడుతూ 'దీనిని నేను ఖండిస్తున్నాను.

బీజేపీ పాలనలో వృద్ధులకు భద్రత కరువు



న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నేరాలు రాజ్యమేలు తున్నాయి. దేశంలో వృద్ధులపై నేరాల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు ముందు వరుసలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీ పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం..గడిచిన మూడేండ్లలో వృద్ధులపై నేరాలకు సంబంధించి నమోదైన కేసుల్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచే 40 శాతం ఉన్నాయంటే అక్కడి పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదో అర్థమవుతున్నది. 2014లో దేశవ్యాప్తంగా నమోదైన 18,714 కేసు ల్లో ఈ రెండు రాష్ట్రాల నుంచి 7,419(39.64 శాతం) ఉన్నాయి.

సిక్కింలో ఉపాధ్యాయులకు యోగా శిక్షణ



గ్యాంగ్‌టక్ : సిక్కింలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు యోగాపై శిక్షణ నిర్వహించింది. విద్యార్థుల్లో యోగాపై కనీస అవహన కల్పించేందుకు ఈ అంశాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడంతో దానిపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చినట్టు అధికారులు తెలిపారు. 266 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ శిక్షణ తీసుకున్నట్టు చెప్పారు. 2016-17 విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశంగా యోగాను ప్రవేశపెట్టినట్టు తెలిపారు.

యథావిధిగా 'సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం'



జమ్ము-కాశ్మీర్ : 'సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం 1990' ను సవరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కేంద్ర మంత్రి హరిష్ గంగారామ్ అహీర్ మంగళవారం లోకసభలో వెల్లడించారు.. అవసరమైతే చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసే విధంగా రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఈ చట్టం 1998లో అమలులోకి వచ్చిందన్నారు. దీర్ఘకాలంగా డిమాండులు ఉన్నప్పటికి ఇందులో ఎటువంటి మార్పులు ఉండవన్నారు

చిట్‌ఫండ్ స్కీమ్‌ల క్రమబద్ధీకరణ



న్యూఢిల్లీ : చిట్ ఫండ్ కంపెనీలు అనధికారంగా నిర్వహించే స్కీమ్‌లను క్రమబద్ధీకరించడానకి ఉద్దేశించిన బిల్లును ఆర్థిక శాఖ మంత్రి శివ ప్రతాప్ శుక్లా మంగళవారం లోక్ సభలో ప్రవేశపెట్టారు. దేశంలో చాలా మంది అక్రమ కార్యకలపాలకు పాల్పడుతూ డిపాజిటర్స్ నుంచి డబ్బులు గుంజుతున్నారన్నారు. ఇలాంటి స్కీమ్స్‌లో తమ డబ్బును జమచేసి చాలా మంది నష్ట పోతున్నారన్నారు.

టాటా జూలో పులి పిల్ల మృతి



జంషెడ్‌పూర్ : జెంషెడ్‌పూర్‌లో టాటా జూలాజి కల్ పార్కులో ఏడు నెలల ఆడ పులి పిల్ల చనిపోయిందని టాటా స్టీల్ తెలిపింది. గత ఏడాది ఆగస్టు 23న పుట్టిన ఈ పులి పిల్ల బాబెసియోసిస్ వ్యాధికి చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం జూలో చనిపోయిందని తెలిపింది. అటవీ విభాగ అధికారి, ఇద్దరు సీనియర్ అధికారుల సమక్షంలోని పశు వైద్య బృందం పోస్టు మార్టం నిర్వహించిందని చెప్పింది. టాటా స్టీల్ జూలాజికల్ పార్కులో ప్రస్తుతం ఐదు పులులు ఉన్నాయని తెలిపింది.

పీఎస్ఈబీ 12వ తరగతి పరీక్షా పేపరు లీక్



న్యూఢిల్లీ : పంజాబ్ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు (పీఎస్ఈబీ) 12వ తరగతి గణితం పేపర్ లీక్ అయ్యిందని సంబంధిత అధికారులు తెలిపారు. షెడ్యూలు ప్రకారం, మంగళవారం ఉదయం 2 గంటలకు ఈ పేపర్‌కు పరీక్ష ప్రారంభ మైందని, అయితే పేపర్ లీకైనట్టు వార్తలు రావడంతో ఈ పరీక్షను రద్దు చేసినట్టు పీఎస్ఈబీ ప్రతినిధి తెలిపారు. తిరిగి మార్చి 31న ఈ పేపరుకు పరీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రశ్నాపత్రాలను మెయిల్‌లో జిల్లా అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ పరీక్షలు మార్చి 24 వరకు జరుగుతాయని చెప్పారు.

తమిళనాడులో మరో విగ్రహం ధ్వంసం



చెన్నై : తమిళనాడులో విగ్రహం ధ్వంసం ఘటన మరొకటి చోటుచేసుకుంది. పుదుకోట్టై జిల్లాలో ఆలంగుడి పట్టణంలో పెరియార్‌గా పేరుగాంచిన ద్రవిడ యోధుడు ఈవీ రామస్వామి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంలో బీజేపీ మద్దతుదారులు కమ్యూనిస్టు యోధుడు లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ఇటువంటి ఘటనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. మార్చి 6న తమిళనాడు లోని వెల్లోర్‌లో మున్సిపల్ కార్పొరేట్ కార్యాల యంలో పెరియార్ విగ్రహాన్ని అరెస్టు చేసిన ఘటనలో ఇద్దరు అరెస్టు అయ్యారు.

మేరీ కోం ఫౌండేషన్‌పై దర్యాప్తు జరుపుతాం



న్యూఢిల్లీ : ఒలంపియన్, రాజ్యసభ సభ్యుడు ఎంసీ మేరీ కోం స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తూ విదేశీ సహకారం క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) కింద నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలపై దర్యాప్తు జరుపుతామని లోక్‌సభలో హోంమంత్రిత్వశాఖ వెల్లడించింది. ఎన్ఏఎన్ ఎన్‌సీఓఎం, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియాపై తనిఖీలు నిర్వహిస్తున్నట్టు హోంశాఖ మంత్రి కిరణ్ రిజ్జూ తెలిపారు. విదేశీ నిధులు అందుకోవడంపై మేరీ కోం ప్రాంతీయ ఫౌండేషన్, ఇతర స్వచ్ఛంద సంస్థలను విచారిస్తున్నట్టు తెలిపారు.

రథయాత్ర అడ్డుకోం : పళనిస్వామి



చెన్నై : విశ్వహిందూ పరిషత్ నిర్వహిస్తున్న రథయాత్ర తమిళనాడులో ప్రవే శించకుండా అడ్డుకోవాలన్న డీఎంకే, కాంగ్రెస్‌ల డిమాండులను అన్నాడీఎంకే తోసిపుచ్చింది. అన్ని మతాలకు సమాన హక్కులున్నాయని, ప్రజాస్వామ్య హక్కును పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానికుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈకే పళనిస్వామి మంగళవారం పేర్కొన్నారు. రథయాత్రను ఆపేయాలని ప్రతిపక్ష నేత ఎంకే స్టాలిన్ డిమాండు చేసిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. ఈ రథయాత్రను తమిళనాడులోకి అడుగుపెట్టనీయకుండా ఆపేయాలని, లేనిపక్షంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటుందని డీఎంకే నేత ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు.



స్టీఫెన్ హాకింగ్ పోస్టల్ కవర్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పేరుతో పోస్టల్‌శాఖ స్పెషల్ కవర్‌ను మంగళవారం విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో వైస్ చైర్మన్ డాక్టర్ కెవి.రమణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీఫెన్ హాకింగ్ గొప్ప శాస్త్రవేత్త అన్నారు. 21 ఏళ్ల వయస్సులోనే ఆరోగ్య పరిస్థితులతో వీల్ చైర్‌కు పరిమితమైనప్పటికీ జీవితమంతా ఖగోళశాస్త్రంపై పరిశోధనలు చేసి ప్రపంచానికి విలువైన సమాచారం అందించారన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పాజిటివ్ మైండ్‌తో ఆలోచిస్తూ కొత్త, కొత్త పరిశోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.బాలసుబ్రమణ్యన్, పోస్ట్‌మాస్టర్ జనరల్ విజయవాడ రీజియన్ రాధికా చక్రవర్తి, సీనియర్ సూపరింటెండెంట్ కె.రమేష్, విజయవాడ రీజియన్ అధికారి ఇ.వీరభద్రరావు, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్ పాల్గొన్నారు.

40 మందికి పోస్టల్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

భారత ప్రభుత్వ తపాలాశాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ విజయవాడ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దీన్‌దయాళ్ సెర్ప్‌యోజన పేరుతో స్కాలర్‌షిప్‌లను పంపిణీచేసింది. ఏపీ పోస్టల్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 2017 -18 సంవత్సరానికి సంబంధించి లెవల్ -1 , లెవల్ -2 పరీక్షల అనంతరం 40 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారత ప్రభుత్వ సమాచారశాఖ మంత్రి మనోజ్‌సిన్హా పర్యవేక్షణలో కలెక్టర్ కార్యాలయం నుంచి ఏపీ ఛీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.బాలసుబ్రహమణ్యన్ విద్యార్థులకు అందజేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - యడ్లపాడు : వ్యవసాయంలో వరుస నష్టాల నేపథ్యంలో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆందోళనతో ఓ రైతు తన సొంత పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా యడ్ల పాడు మండలంలోని దింతెనపాడులో మంగళ వారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని దింతెనపాడుకు చెందిన పోపూరి వీరాంజనేయులు (38) తనకున్న 2.5 ఎకరాల్లో గత ఏడాది మిర్చి పంట సాగు చేసి భారీగా నష్టపోయాడు. వచ్చిన ఆదాయం బ్యాంక్ బకాయిల చెల్లింపునకు సరిపోలేదు. దీంతో 2.5 ఎకరాల సొంత భూమిలో ఒక ఎకరం విక్రయించి అప్పులు చెల్లించాడు. ఈ ఏడాది మిగిలిన 1.5 ఎకరాలతోపాటు మరో 4.5 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. సాగు కోసం అక్కడక్కడా సుమారు రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. వడ్డీలతో కలుపుకుని రూ.8 లక్షలు కావడం, వ్యవసాయం పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని భార్య పోపూరి ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రూ.2.40 లక్షల విలువైన గుట్కాలు స్వాధీనం



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు నగరం లోని చిత్తారి వీధిలో అక్రమంగా నిల్వ చేసిన 12 బాక్సులు, 19 బస్తాల్లో సుమారు రూ.2.40 లక్షలు విలువైన గుట్కాలను మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు స్వాధీనం చేసుకున్నారు. ఓల్డ్‌సిటీలోని చిత్తారివీధి చెందిన నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. గుట్కా ప్యాకెట్లు, బాక్స్‌లను ఒకటో పట్టణ పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది సుబ్బ రాయుడు, శివరాముడు పాల్గొన్నారు.

టెక్కలిలో వింత శిశువు జననం



విశాలాంధ్ర - టెక్కలి : శ్రీకాకుళంజిల్లా టెక్కలి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం వింత శిశువు జన్మించింది. శిశువు కుడి, ఎడమ కాళ్ళ పాదాల దగ్గర అదనపు అవయవాలు, నాభి ద్వారం వద్ద యూరినల్ బ్లాడర్ బయటకు వచ్చాయి. ఈ వింత జననంపై సిబ్బందితోపాటు వైద్యులు విస్మయం వ్యక్తం చేశారు. శిశువు వివరాలను బహిర్గతం చేయడానికి ఆసుపత్రి వర్గాలు సుముఖత వ్యక్తం చేయలేదు. తల్లీబిడ్డల పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో అత్యవసర చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఫోలిక్ యాసిడ్ లోపం, జన్యుపరమైన లోపాలతో ఇటువంటి శిశువులు జన్మిస్తుంటాయని, మేనరిక వివాహాలు కూడా ఇందుకు ఓ కారణం కావచ్చని శిశువును ఆపరేషన్ చేసి బయటకు తీసిన వైద్యులు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రాళ్ళపాటి అరవింద్ తెలిపారు.

హోదా అన్నందుకు బీజేపీ నుంచి 'ఆడారి'బహిష్కరణ



విశాలాంధ్ర - విశాఖపట్నం : ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తూ ప్రత్యక్ష ఆందోళనలు చేసిన ఓ బీజేపీ నాయకుడికి ఆ పార్టీ అధిష్టానం బహిష్కరణ బహుమానంగా ఇచ్చింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ నడవాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ విపక్షాలు ఆందోళనల్లా ఆయన కూడా ఆందోళన చేయడం పార్టీకి కోపం వచ్చింది. బీజేవైఎం నాయకుడు, బీజేపీ నేత ఆడారి కిశోర్‌ను బీజేపీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ నగర అధ్యక్షులు ఎం. నాగేంద్ర మంగళవారం ప్రకటించారు. బీజేపీ సిద్ధాంతాలకు, విధివిధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న కిశోర్‌ను ప్రాథమిక సభ్యత్వంతో సహా తొలగిస్తున్నామని నాగేంద్ర వెల్లడించారు..

డీసీఐని ప్రైవేటుపరం చేయొద్దు

- ఆస్తుల మదింపునకు ముంబై నుంచి బృందం
- విశాఖలో అడ్డుకున్న డీసీఐ ఉద్యోగులు
- కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష చర్యలపై ఆగ్రహం



విశాలాంధ్ర - విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ప్రభుత్వ సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించ వద్దంటూ డీసీఐ ఉద్యోగులతోపాటు కార్మిక సంఘాలు ఎంతోకాలంగా ప్రత్యక్ష ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని మోడీ ప్రభుత్వ ఆదేశాలతో విశాఖపట్నంలోని డీసీఐ సంస్థ ఆస్తుల మదింపునకు ముంబైకి చెందిన ప్రొటోకాల్ ఇన్సూరెన్స్ సర్వేయర్స్ అండ్ లాస్ ఎస్సార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బృందం మంగళవారం ఇక్కడకు రావడంతో ఉద్యోగులు రగిలిపోయారు. అభివృద్ధి చెందుతున్న డీసీఐని నిర్వీర్యం చేసే కుట్రను వ్యతిరేకిస్తూ ప్లకార్డు లతో నిరసన తెలిపారు. ముంబై నుంచి వచ్చిన బృందాన్ని అడ్డుకునేందుకు ఉద్యోగులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో అలజడి రేగింది. డీసీఐ ప్రైవేటీకరణ చర్యలను నిరసిస్తూ ఇప్పటికే ఉద్యోగులు సంఘటితంగా కొనసాగిస్తున్న ఆందోళన లకు కార్మిక సంఘాలు బాసటగా నిలిచాయి. సీపీఐ, సీపీఎం, వైసీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీల నేతలతోపాటు ఏఐటీయూసీ ఉద్యోగులకు సంఘీ భావం ప్రకటించి అండగా నిలిచింది. డీసీఐ ప్రైవేటీ కరణ చర్యలతో ఆందోళన చెందిన ఉద్యోగి వెంకటే్ ఆత్మహత్య రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని కదిలిం చింది. లాభాలతోపాటు సముద్ర తీరప్రాంతాన్ని సంరక్షిస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రైవేటీకరిస్తే దేశ భద్రతకు తీవ్ర ముప్పు తప్పదంటూ మేధావులు హెచ్చరించారు. ఉద్యోగుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటోందని కార్మిక సంఘాల నేతలు మండిపడ్డారు. ఈ తరుణంలో డీసీఐ ఆస్తులను లెక్కకట్టేం దుకు ప్రత్యేక బృందం రావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. లాభాల్లోని ప్రభుత్వ రంగ సంస్థను కాపాడా లంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల యూనియన్ నాయకులు వెంకటరావు, జగన్, అప్పలరాజు, పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో గుర్రంకొండ తహశీల్దార్ రవిచంద్రన్



విశాలాంధ్ర-గుర్రంకొండ : చిత్తూరు జిల్లా గుర్రంకొండ తహశీల్దార్ రవిచంద్రన్ మంగళవారం తన కార్యాలయంలో రూ.60 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికా రులు దాడి చేసి పట్టుకున్నారు. గుర్రంకొండ మండలం టి.రాజ్‌పల్లి పంచాయతీ దిగువ బురుజుపల్లికి చెందిన ఎస్.గోపాల్‌రెడ్డి సర్వే నంబరు.77లోని తనకు పూర్వీకుల నుంచి వచ్చిన 90 సెంట్ల భూమి సర్వే కోసం మూడేళ్లుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగు తున్నారు. గతంలోనూ వివిధ ఖర్చుల కింద రెవెన్యూ అధికారులు రూ.30 వేలు తీసుకు న్నారు. మరో లక్ష రూపాయలు డిమాండ్ చేయడంతో గోపాల్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం తహశీల్దార్ రవిచంద్‌కు లంచం ఇస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. రూ.60 వేల నగదుతోపాటు రెవెన్యూ రికార్డులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ తిరుమలరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు విజయ్‌శేఖర్, గిరిధర్, ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ విష్ణు పాల్గొన్నారు.

27న మున్సిపల్ కార్మికుల చలో అసెంబ్లీ

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అంటూ రాష్ట్ర ప్రభుత్వం నేల విడిచి సాము చేస్తోందని పర్యవసానంగా కార్మికశ్రమ, ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయని ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ళ సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని విమర్శించారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిర్ల క్రిష్ణారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పేరులో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.279 అమలు చేసేందుకు ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు మళ్ళిస్తోందన్నారు. ఈ జీవో మూలంగా కార్మికుల పనిభద్రత కాగితాలకే పరిమితమై అనుకున్న లక్ష్యాలు నీరుగారుస్తున్నదన్నారు. గుంటూరులో అతిసార విజృంభణకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం కారణమన్నారు. మురికి కాలువల విస్తరణ జరగకుండా, కార్మికుల సంఖ్యను పెంపు చేయకుండా హడావుడిగా తీసుకున్న ఈ నిర్ణయం 19 మందిని బలిగొన్నదన్నారు. జీవో నెం.279 అమలుకై రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ 400 మంది కార్మికులకు డ్రోన్లతో పర్యవేక్షణ, యంత్రాల వాడకంలో శిక్షణ ఇవ్వడం హాస్యాస్పదంగా వుందని, ఈ ప్రక్రియ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ఎత్తుగడేనని ఆరోపించారు. గత సమ్మెకాలంలో ప్రభుత్వం అంగీకరించిన సవరణలు చేపట్టకుంటే, అన్ని నగరపాలక మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం, జీవో నెం 151 అమలు చేయకుంటే ఈ నెల 27న చలో అసెంబ్లీ ముట్టడిని చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్మిక పోరాట పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసివస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రామచంద్రయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, భజంత్రి శ్రీనివాస్, కోటిదాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.మల్లేశ్వరరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, కార్యదర్శి చంద్రదాస్, టి.వాసు, జాన్, రాజేష్, అంకయ్య, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీవారి దర్శనార్థం కుటుంబసమేతంగా మంగళ వారం తిరుమల చేరుకున్నారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాస రాజు తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పద్మావతి అతిథి గృహంలో బస ఏర్పాటు చేశారు. చంద్రబాబు మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉదయం వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోనున్నారు.

5 నుంచి కొండపల్లి మహోత్సవాలు

విశాలాంధ్ర - విజయవాడ : ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో కొండపల్లి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. విజయవాడలోని తన కార్యాలయంలో మంగళవారం శాసనసభ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ రెండు నదుల సంగమ ప్రాంతమైన కొండపల్లి ఖిల్లా తెలుగుజాతి ప్రగతితో ముడిపడి ఉందన్నారు. ఈ నేపథ్యం లోనే కొండపల్లి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పురావస్తు శాఖ కమిషనర్ డాక్టర్ వాణీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులతో మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, పాదయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఏయూ ఉద్యోగులకు ఊరట !

- ఈసీలో బోధనేతర సిబ్బంది సమస్యలపై చర్చ
- తాత్కాలిక సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలంటూ నిర్ణయం
- మంత్రుల కమిటీకి లేఖ

విశాలాంధ్ర - విశాఖసిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చాలాకాలంగా నెలకొని ఉన్న తాత్కాలిక సిబ్బంది, బోధనేతర సిబ్బంది సమస్య ఎట్టకేలకు పరిష్కారానికి నోచుకోనుంది. దీనికి సంబంధించి సోమవారం జరిగిన వర్సిటీ పాలకవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో ముందడుగు పడింది. వర్సిటీలో గత కొన్నేళ్లుగా శాశ్వత పద్ధతిలో నియామకాలు లేకపోవడంతో డైలీవేజ్, కన్సాలిడేటెడ్ పే, కాంట్రాక్ట్, మినిమమ్ టైం స్కేల్ పద్ధతిలో పలు విభాగాలలో బోధనేతర సిబ్బంది తాత్కాలికంగా పని చేస్తున్నారు. తమకు ఆయా విభాగాల వారీగా పదోన్నతుల్లో మార్పు చేయాలని, రెగ్యులరైజ్ చేయాలని వారు కోరుతున్నారు. దీంతో వర్సిటీ స్థాయిలోనే ఈ అంశంపై వేసిన కమిటీ తన నివేదికను వర్సిటీ ఉన్నతాధికారులకు అందజేసింది. నివేదికపై కూలంకషంగా చర్చించిన పాలకవర్గ సభ్యులు తాత్కాలిక సిబ్బందికి మేలు జరిగేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

28 రోజులు, టైంస్కేల్ వారికి తీపికబురు : ఆంధ్రా యూనివర్సిటీలో ఇప్పటి వరకు ఉన్నట్టు కాకుండా ఇకపై తాత్కాలిక, పర్మినెంట్ రెండు విభాగాలుగా మాత్రమే బోధనేతర సిబ్బంది పనిచేయనున్నారు. అదే విధంగా 28 రోజుల వేతన సిబ్బం దిని, మినిమమ్ టైంస్కేల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీకి వర్సిటీ ఉన్నతాధికారులు లేఖ రాయనున్నారు. శాశ్వత పద్ధతిలో నియామకాలకు ప్రభుత్వం నుంచి అడ్డంకులు లేనందున, పెద్ద ఎత్తున ఉద్యోగులు పదవీ విరమణ చేసినందున ప్రస్తుతం ఉన్నవారినే ఆయా స్థానాలలో రెగ్యులరైజ్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరనున్నారు. వర్సిటీ నిబంధనలు, రోస్టర్ విధానం పాటిస్తూ ఈ నియామకాలు జరిపేలా నిర్ణయం తీసుకున్నారు. మంత్రుల కమిటీ ఆమోదమే ఆలస్యం వారు సానుకూలంగా స్పందిస్తే, త్వరలో ఆయా సిబ్బంది వర్సిటీలో శాశ్వత ప్రాతిపదికన నియమితులవుతారు.

రిటైర్డ్ సిబ్బంది బెనిఫిట్స్ మొత్తం చెల్లించాలి : వర్సిటీలో ఇప్పటికే రిటైర్ అయిన సిబ్బందికి అందించాల్సిన బెనిఫిట్స్ పదోన్నతులు కల్పించేటప్పుడు విద్యార్హతలు లేని కారణంగా ఆడిట్ అభ్యంతరం మేరకు ఆయా లబ్ధిదారుల బెనిఫిట్స్‌లో కోత విధించాలని తీసుకున్న నిర్ణయాలు రద్దు చేస్తూ వారి బకాయిలు మొత్తం చెల్లించాలని నిర్ణయించారు. అదే విధంగా 2014 జీవోతో ముడిపెడుతూ కొంత మంది ఉద్యోగుల పదోన్నతులకు పడిన అడ్డంకులు కూడా తొలగించి వారికి మినహాయింపు ఇచ్చారు. దీంతో ఇకపై నియామకాలకు మాత్రమే విద్యార్హత పరిగణనలోకి తీసుకుంటారు. అదే విధంగా 28 రోజుల వేతన సిబ్బంది, మినిమమ్ టైం స్కేల్ వారి పిల్లలకు వర్సిటీలో చదువుకుంటే 30 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని, పీఎఫ్ కార్యాలయం నుంచే ఈపీఎఫ్ అందజే యాలని నిర్ణయించారు. ఏదిఏమైనా గతంలో జరిగిన పలు పాలకవర్గ సమావేశాలలో బోధనేతర సిబ్బంది అంశం పెద్దగా చర్చకు రాలేదని, కానీ ఈసారి జరిగిన ఈసీలో బోధనేతర సిబ్బంది సమస్యల పట్ల ఎక్కువగా చర్చించి శ్రద్ధ తీసుకోవడం శుభపరిణామమని ఆయా వర్గాలు వ్యాఖ్యాని స్తున్నాయి. ఈ విషయమై వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వ రరావు మాట్లాడుతూ ముందుగా కొంతమందిని పర్మినెంట్ చేయాలంటూ మంత్రుల కమిటీని కోరుతున్నామని, తదుపరి దశల వారీగా తాత్కాలిక సిబ్బందిలో మరి కొంత మందిని కూడా రెగ్యులరైజ్ చేసే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో పాటు వర్సిటీలో నిలిచిపోయిన కొంతమంది సిబ్బంది పదోన్నతులకు సంబంధించి సానుకూలంగా స్పందించారు.. వారికి కూడా అవకాశం మేర పదోన్నతులు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.

త్వరలో నామినేటెడ్ పదవులకు రాజీనామా



విశాలాంధ్ర-గుంటూరు వైద్యశాఖ : రాష్ట్రంలోని నామి నేటెడ్ పదవులకు త్వరలో బీజేపీ ప్రతి నిధులంతా రాజీనామా చేస్తారని బీజేపీకి చెందిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గుంటూరు కొత్తపేటలోని జీవీకే ఫంక్షన్ హాలులో మంగళవారం వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు నగరానికి అండర్ గ్రౌండ్ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఉపయోగించుకోవడం చేతకాలేదని విమర్శించారు. ప్రత్యేక హోదా ఇచ్చే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదా వద్దని, ప్రత్యేక ప్యాకేజి కావాలని అడిగారని వీర్రాజు తెలిపారు. ఏపీకి కేంద్రం ఇచ్చిన రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ హామీలను త్వరలోనే నెరవేరుతాయన్నారు. చెంబు, నీరు అంటూ మోడీ దిష్టిబొమ్మలను దహనం చేస్తుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఇతర దేశాలలో రాజధాని నిర్మాణంపై ఎటువంటి చర్చ జరుగలేదని, ఏపీ రాజధాని డిజైన్ ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడి ఉంటామని తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీపతిరాజు, నగర అధ్యక్షుడు అమ్మిశెట్టి ఆంజనేయులు, పార్టీ నాయకులు పాలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుకు చిక్కులెన్నో..

- ప్రభుత్వ తాజా నిబంధనలతో ఆశలు ఆవిరి
- పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం ఎప్పటికో?



విశాలాంధ్ర - నెల్లూరు బ్యూరో : రాష్ట్రంలో నిరుపేదలకు కొత్త రేషన్ కార్డు అందని ద్రాక్షలా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రోజుకో నిబంధన విధించడంతో రేషన్‌కార్డుల మంజూరుకు అడ్డంకిగా మారుతోంది. గత ఏడాది డిసెంబరులో జిల్లాలో స్పెషల్ గ్రీవెన్స్‌డేలో పెద్దఎత్తున కొత్త కార్డుల కోసం అధికారులు అర్జీలు స్వీకరించారు. మీ సేవ కేంద్రాల ద్వారా కొందరు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులందరికీ జన్మభూమి గ్రామసభల్లో కొత్తకార్డులు పంపిణీ చేస్తామన్నా అమలు కాలేదు. జనవరిలో నిర్వహించిన జన్మభూమిలో అరకొర కార్డులు పంపిణీ చేసినా అత్యధిక దరఖాస్తులను తిరస్కరించారు. కొత్తగా పెళ్లయిన వారు తమ తల్లిదండ్రుల నుంచి కార్డు వేరు చేయాలంటూ దరఖాస్తు చేసుకోగా మీ పేరు మీద కార్డు ఉందంటూ తిరస్కరించిన అధికారులు చేతులు దులుపుకున్నారు. అనంతరం వారం రోజుల వ్యవధిలో ప్రభుత్వం మరో జీవో ఇచ్చింది. పెళ్లయిన అర్హులందరూ మీ సేవ ద్వారా కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించినా దానికి సంబంధించి సైట్‌ను మీసేవకు ఇవ్వలేదు. మూడు రోజుల వ్యవధిలో తల్లిదండ్రుల కార్డుల నుంచి పిల్లలను వేరుచేసేది లేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించారు. ఇటీవల రెండు రోజుల క్రితం కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రకటించిన నూతన నిబంధనలు అడ్డంకిగా మారేలా కనిపిస్తున్నాయి. గత డిసెంబర్‌లో 13 జిల్లాల పరిధిలో కొత్త రేషన్‌కార్డుల కోసం 5.10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 1.5 లక్షల మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. మిగిలిన వాటిని అనర్హులుగా పెండింగ్ పెట్టి తిరస్కరించారు. 5.10 లక్షల దరఖాస్తుల్లో 60 శాతం మంది స్ప్లిట్ కార్డుదారులు. అంటే ఒక కుటుంబంలో కుమారుడికి పెళ్లయితే తల్లిదండ్రుల నుంచి బయటకు వెళ్లి వేరుగా ఉన్నవాళ్లు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని స్ప్లిట్ కార్డులు అంటారు. వీటన్నిటినీ తిరస్కరించారు.

కొత్త నిబంధన చిక్కులివే..

రేషన్ కార్డుల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేసింది. ఆర్టీజీఎస్, పల్స్‌సర్వే ఆధారంగా రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయనుంది. ఆర్టీ జీఎస్‌లో 7 నిబంధనలు అమలులోకి తీసుకువచ్చింది. పల్స్ సర్వేలో వివరాలు నమోదు కాకపోతే ప్రభుత్వం పథకాలు మంజూరయ్యే అవకాశం లేదు. కొత్త నిబంధనలతో సామాన్యులకు రేషన్ కార్డు మంజూరయ్యే అవకాశం కానరావడం లేదు. ఈ నిబంధనల ప్రకారం జిల్లాలో సుమారు 24,909 మంది రేషన్ కార్డులకు అనర్హులుగా గుర్తించారు. గత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం సుమారు 45,584 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 24,909 మందిని అనర్హులుగా తేల్చారు. 20,675 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేశారు. ఆర్ టీజీఎస్ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.60 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75 వేలు ఆదాయం మించి ఉండకూడదు, నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. ఇతర రేషన్ కార్డుల్లో సభ్యులుగా ఉంటే అనర్హులే. బ్యాంక్ అకౌంట్లో ఏడాదిలో రూ.2 లక్షలకు మించి లావాదేవీలు జరిగినా అనర్హులే. పల్స్ సర్వేలో కుటుంబ వివరాలు నమోదై ఉండాలి. ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ కొత్త రేషన్ కార్డు మంజూరయ్యే అవకాశం లేనట్టే.

'చంద్రన్న బీమా'పై విస్తృత ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'చంద్రన్న బీమా'పై అసంఘటిత కార్మికుల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు 13 వ్యాన్ల ద్వారా విస్తృత ప్రచారం సాగిస్తున్నట్లు కార్మికశాఖమంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. అసెంబ్లీ నియమావళిలోని 344వ నియమంలో భాగంగా మంగళవారం పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావిం చేందుకు 'చంద్రన్న బీమా' అంశంపై నోటీసును సభాపతి కోడెల శివప్రసాద్ అను మతించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ పథకాన్ని చంద్రబాబు మానసపుత్రికగా అభివర్ణించారు. ఈ పథకం నిరుపేదల్లో ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపుతోందన్నారు. అలాగే ప్రభుత్వం పట్ల ప్రజల్లో గౌరవభావాన్ని పెంపొందించేసిందన్నారు. అయితే ఆయా ప్రమాదాలకు సంబంధించిన నివేదికలు రావడంలో జాప్యం జరుగుతోందని, రిజిస్ట్రేషన్ పరంగా ఆన్‌లైన్‌లో వివరాల నమోదు పరంగా పలు సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి పితాని మాట్లాడుతూ ఇప్పటి వరకూ 2.45 కోట్ల మంది బీమాను తీసుకొన్నారని, తాజాగా 2.55 లక్షల మందికి బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు. ఈ పథకంలో మరిన్ని మార్పులు, చేర్పులు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు మంత్రి వివరించారు.

లా కోర్సులకు ఫీజుల నిర్ధారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 20 ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ యూజీ, పీజీ లా వృత్తి విద్యా కోర్సులకు ప్రభుత్వం ఫీజులను నిర్ధారించింది. మంగళవారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు.2017-18 నుంచి 2019-20 విద్యా సంవత్సరానికిగాను ఈ ఫీజులు అమలులో వుంటాయి.ఏపీ పరిపాలన, వృత్తి విద్యా కోర్సుల నియంత్రణ కమిటీ ఆధ్వర్యాన ఈ ఫీజులను నిర్ధేశించారు. రాష్ట్రంలోని 18 కళాశాలల్లో కొనసాగు తున్న ఐదేళ్ల బీఎల్/ఎల్ఎల్‌బీ కళాశాలలకు రూ.9,600 నుంచి రూ.17వేల వరకూ వేర్వేరుగా ఫీజులు వసూలు చేయాలని కళాశాలల యాజమాన్యానికి ఆదేశించారు.20 కళాశాలలల్లో కొనసాగుతున్న మూడేళ్ల బీఎల్/ ఎల్ఎల్‌బీ/ ఎల్ఎల్‌బి(హానర్స్) కోర్సులకు రూ.9,600 నుంచి రూ.16,400 వరకూ కేటగిరీల వారిగా ఫీజులు నిర్ధారిస్తారు.

మూడు పార్టీల అజెండా ఒక్కటే

- టీడీపీపై బురదజల్లటమే సింగిల్ పాయింట్ అజెండా
- ఇప్పుడు హోదా అవసరం లేదంటున్న పవన్
- పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-అమరావతి : మూడు పార్టీల అజెండా ఒక్కటే.. టీడీపీపై బురదజల్లడమే సింగిల్ పాయింట్ అజెండాగా పెట్టుకున్నాయి. వైసీపీ, జనసేన పార్టీలు బీజేపీకి కోవర్టులుగా పని చేస్తున్నాయి, టీడీపీని బద్నాం చేయాలని చూస్తున్నాయి. దానివల్ల ఎవరికి లాభం.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం లోక్‌సభలో జరిగిన అవిశ్వాస తీర్మానం పరిణామాలపై చంద్రబాబు టీడీపీ ఎంపీలు, అసెంబ్లీ వ్యూహ కమిటీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నిన్న పార్లమెంటులో రెండు పార్టీలు ఏ విధంగా చర్చను అడ్డుకున్నదీ చూశామని, ప్రతి రోజూ అప్రమత్తంగా ఉండి సమయాన్ని, సందర్భాన్ని బట్టి వ్యవహరించాలని సూచించారు. అవిశ్వాసంపై అన్ని పార్టీల నేతలతో మాట్లాడి మద్దతు కోరి ఆంధ్రప్రదేశ్‌కు సహకరించమని అడుగుతానని ఆయన చెప్పారు. అన్ని పార్టీల సభా నేతలతో సమన్వయం చేసుకోవాలి. సమస్యను పక్కదారి పట్టించడం, టీడీపీపై బురద జల్లడం ఒక పద్ధతి ప్రకారం బీజేపీ, వైసీపీ, జనసేన పార్టీలు చేస్తున్నాయి. మేము అడిగేది చేయకుండా ఇలా మాపై బురదజల్లడం ఏమిటని ప్రజలే ప్రశ్నిస్తున్నారు. పోలవరం పునరావాసం ఇస్తామని కేంద్రం చెప్పినట్లు, మనమే చేస్తామని ముందుకొచ్చినట్లు పవన్ కల్యాణ్ అనడం పచ్చి అబద్ధమని అన్నారు. వైసీపీ, జనసేన నా మీద విమర్శలే తప్ప మోడీపై ఈగ వాలనివ్వడం లేదని, ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయమని అడుగుతున్నామని, ఇందులో తప్పేమిటని ప్రశ్నించారు. ఈ కీలక సమయంలో పవన్ ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు. ఎవరు చేయిస్తున్నారు. వాళ్లు ఎంత తిడితే టీడీపీకి అంత లాభం, మూడు పార్టీల స్క్రిప్ట్ ఒక్కటే. ఒకేచోట స్క్రిప్ట్‌లు తయారు అవుతున్నాయని వ్యాఖ్యానించారు. అక్కడా, ఇక్కడా సభకు ఎవరూ గైర్హాజరు కావద్దు, ఆంధ్రప్రదేశ్ ప్రజల గొంతు వినిపించాలన్నారు. ఎవరూ వెల్‌లోకి వెళ్లవద్దు. మీ స్థానాలలో లేచి నిలబడండి. సభ వాయిదా పడితేనే వెల్‌లోకి వెళ్లండి. చర్చకు అనుకూల వాతావరణం సభలో కల్పించండని సభ్యులకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్‌డీఏ నుంచి వైదొలిగామని, జాతీయ రాజకీయాల్లో తెలుగుదేశం పాత్ర రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైఎస్.చౌదరి, లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం, ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని, శాసన సభ, శాసనమండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాధరెడ్డి, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్సీ టి.డి.జనార్ధన్, లోక్‌సభ, రాజ్య సభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం.. పదవులు కాదు

పదవులు ముఖ్యం కాదు. రాష్ట్ర ప్రయోజనాలే మనకు ముఖ్యం. ప్రజల హక్కుల సాధనే మన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. పార్టీ ఎంపీలతో, వ్యూహ కమిటీ ప్రతినిధులతో జరిగిన టెలి కాన్ఫరెన్స్ అనంతరం తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తున్నామని, రాష్ట్రానికి న్యాయం జరుగుతుందనే బీజేపీతో పొత్తుపెట్టుకున్నామన్నారు. ఇచ్చిన అవకాశాన్ని, నాలుగేళ్ల సమయాన్ని బీజేపీ సద్వినియోగం చేసుకోలేదని చెప్పారు. తొలి ఏడాదిలో ఇవ్వాల్సిన లోటు నిధులను ఐదేళ్లు నాన్చారు. ఇప్పుడు ఇంకా 138 కోట్లే ఇస్తామన్నారు. ఏపీకి అన్యాయం చేయడంతోపాటు ఎదురుదాడికి కూడా బీజేపీ సిద్ధపడిందని పేర్కొన్నారు. అవిశ్వాసం నోటీసు అనుమతించకుండా 3 రోజులుగా వాయిదాలు వేస్తున్నారని అన్నారు. అన్నివేళ్లు మోడీ వైపు చూపిస్తుంటే ఈ రెండు పార్టీల వేళ్లు నావైపు చూపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ నిముషానికి ఒకటి మాట్లాడుతున్నారు. పవన్ నంబూరులో లోకేష్‌పై విమర్శలు చేశారు. తరువాత అందరూ అన్నారు కాబట్టి అన్నానే తప్ప ఆధారాలు లేవన్నాడు. ఇప్పుడు ఆధారాలు ఉన్నాయంటున్నారు. అప్పుడు ప్యాకేజిని పాచిపోయిన లడ్లు అన్నాడు, ఇప్పుడు హోదా అవసరం లేదంటున్నాడు. నిధులు ముఖ్యం అంటున్నాడని సీఎం పేర్కొన్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌కు చెక్ : శిద్దా

విశాలాంధ్ర-అమరావతి:రాష్ట్రంలో ఎర్రచంద నం స్మగ్లింగ్‌కు చెక్ పెట్టడానికి పటిష్టమైన కార్యాచరణ రూపొందించినట్లు అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. మంగళ వారం సచివాలయంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 193 ప్రాంతాల్లో 113 చెక్ పోస్టు లు, బోట్ పార్టీలు , ఈ-నిఘా ద్వారా ఎర్ర చందనం స్మగ్లింగ్‌ను అరికట్టడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2004 2011 సంవత్సరం వరకు 3816 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం విక్రయం ద్వారా వచ్చిన ఆదాయం కేవలం 69.7 కోట్లు మాత్రమేనని తెలియజేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పారదర్శకంగా అంతర్జాతీయ టెండర్లను పిలిచి 5252 . 837 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం విక్రయం ద్వారా 1231.409 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు. 1412 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని 2019 లోగా విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో అటవీచట్టాలను పటిష్టంగా అమలు పరుస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎర్రచందనం స్మగ్లింగ్‌ను ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2014 నుండి నేటి వరకు 3,887 కేసులు నమోదు చేసి 12, 474 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 2101 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం, 2,844 వాహనాలను స్మగ్లర్ల నుండి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అటవీ సిబ్బందికి అధునాతన ఆయుధాలను అంద చేయడం జరుగుతుందని తెలిపారు. అటవీ చట్టాలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

సినీ పరిశ్రమకు చీమకుట్టినట్లయినా లేదు



ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ సంచలన వ్యాఖ్యలు

విశాలాంధ్ర అమరావతి : సినీ పరిశ్రమ కళాకారులపై ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ మీడియా సమావేశాల మీడియా పాయింట్ దగ్గర ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని ఈ స్థాయిలో పోరాటం చేస్తుంటే సినీ పరిశ్రమలో చీమ కొట్టినట్లు అయినా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సినిమా పరిశ్రమలో చావ చచ్చిపోయిందని , తెలుగు సినీ పరిశ్రమ డైరెక్టర్లు హీరోయిన్ బొడ్డులు, జగణాలు గురించి వర్ణించటానికి తప్ప దేనికి పనికి రారని నిప్పులు చెరిగారు. మీరేమైన హాలీవుడ్ అంత గొప్పవారు అనుకుంటున్నారా.. మీరంతా ఏజ్ బార్ అయిన వారేనని ఎద్దేవాచేశారు. అవార్డులు రాకపోతే లొల్లి లొల్లి చేస్తారు ఎస రూములలో కులుకుతూ కూర్చుంటారు అని ధ్వజమెత్తారు. జల్లికట్టు ఉద్యమాన్ని తమిళ సినీ పరిశ్రమ ముందుండి నడిపించిందని గుర్తుచేశారు. అన్ని వర్గాల వారు ప్రత్యేక హోదా మద్దతు ఇస్తుంటే సినీ పరిశ్రమ ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, కవిత, కేటీఆర్ అందరూ మద్దతు ఇస్తుంటే మీకు ఏమి అయ్యిందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆరే మద్దతు ఇస్తే మీ మీద మీ ఆస్తులు మీద దాడి చేసే అవకాశం లేదులే అంటూ వ్యాఖ్యానించారు. తమిళ నటి నటులను చూసి అయినా తెలుగు సినీ పరిశ్రమ బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఆంధ్రా గడ్డలో పుట్టిన ఒక్క హీరో అయినా రాష్ట్రం విడిపోయిన తరువాత ఈ గడ్డ మీదకి వచ్చారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలుగు సినీ కళాకారులను వెలివేయడానికి 5 కోట్ల ఆంధ్రులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. విభజన కష్టాల్లో ఉన్న నవ్యాంధ్ర ప్రజల పక్షాన పోరాటం చేయాలని లేదంటే మీ సినిమాలు చూసి మీకు ఆదాయం అందిస్తున్న రాష్ట్ర ప్రజల వ్యతిరేకతను చవి చూస్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా సినీ ప్రముఖులు స్పందించని పక్షంలో రాష్ట్ర ప్రజలు క్షమించబోరని వెల్లడించారు.

జిల్లాల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు

- చైర్మన్‌గా కలెక్టర్, సభ్య కార్యదర్శిగా జేసీ
- అన్ని విద్యార్థి సంఘాలకు ప్రాధాన్యం
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ




విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఉన్నత విద్యాసంస్థలలో ర్యాగింగ్ నిరోధకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే జిల్లా స్థాయిలో ర్యాగింగ్ నిరోధక కమిటీల ఏర్పాటుకు కసరత్తును ప్రారంభించింది. తక్షణమే అన్ని జిల్లాల్లో కలెక్టర్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ సభ్య కార్యదర్శిగా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మానవ వనరుల అభివృద్ధి సంస్థ (హెచ్‌ఆర్‌డీ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిరోధింఎ చాలంటూ సుప్రీంకోర్టు 2009 మే ఎనిమిదో తేదీన తీర్పునిచ్చింది. ఆ ఉత్తర్వులను అనుసరించి తక్షణమే జిల్లాస్థాయిలో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలంటూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అదనపు కార్యదర్శి ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ర్యాగింగ్ కమిటీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. కమిటీలు వేయటంతోపాటు ర్యాగింగ్‌ను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై వేసవిలోనే కమిటీ సమావేశమై చర్చించాలని ప్రభుత్వం సూచించింది. జిల్లా కమిటీల్లో అన్ని విద్యార్థి సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వం సూచించింది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే కమిటీలో జేసీ సభ్య కార్యదర్శిగా, జిల్లా ఎస్పీ, ఉన్నత విద్యాసంస్థల హెడ్స్, యూత్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో పాల్గొనే ఎన్‌జీఓ ఆర్గనైజేషన్స్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, స్థానిక మీడియా ప్రతినిధి సభ్యులుగా ఉంటారు.

ఎక్స్‌ప్రెస్‌వే పనులు పూర్తి చేయాలి : కత్తి

- దళిత బ్యాంకు ఏర్పాటు చేయాలి : డొక్కా
- రైల్వే జోన్, అమరావతికి రైల్వే లైన్లపై కేంద్రం వివక్ష : అచ్చెన్నాయుడు
- కావలి రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై సభా సంఘం
- శాసనమండలిలో చర్చ





విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో దళితుల కోసం ప్రత్యేకంగా దళిత బ్యాంకు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండు చేశారు. చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన మంగళవారం జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించినా బ్యాంకర్లు పేదల విషయంలో రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపటం లేదని, మహిళ బ్యాంకు తరహాలో దళితుల కోసం ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. శమంతకమణి మాట్లాడుతూ ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్ కూడా సక్రమంగా అమలు కావటం లేదన్నారు. పేదలకు పంపిణీ చేసే బర్రెలు హరియానా నుంచి కొనుగోలు చేస్తున్నారని, వాటిని ఇక్కడకు తెచ్చేలోపు చనిపోతున్నాయని, అందువల్ల తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి బర్రెలను కొనుగోలు చేయాలని సూచించారు. దళిత బ్యాంకు ఏర్పాటుతో పాటు దళితులకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం శ్రద్ధ చూపాలని రాము సూర్యారావు కోరారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి నక్కా ఆనందబాబు సమాధానమిస్తూ రుణాల పంపిణీలో లబ్ధిదారులను బ్యాంకులు ఇబ్బంది పెడుతున్నమాట వాస్తవమేనని, ఇక నుంచి అలా జరగకుండా జిల్లా కలెక్టర్ల ద్వారా బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్ పరిధిని రూ.15 లక్షలకు పెంచామన్నారు. దళిత బ్యాంకు ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతపురం నుంచి అమరావతికి చేరాలంటే మూడు రోజుల సమయం పడుతోందని, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై పోతుల సునీత, శమంతకమణి, రామ సుబ్బారెడ్డి, దొరబాబులు కూడా మాట్లాడుతూ భూ సేకరణ పూర్తిచేసి పనులు ప్రారంభించాలన్నారు. ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమాధానమిస్తూ ఈ ఎక్స్‌ప్రెస్ హైవే అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు మీదుగా రాజధానికి చేరుతుందని, కేంద్రం దీనికోసం రూ.27,635 కోట్లను ప్రకటించిందన్నారు. ప్రాజెక్టుకు భూ సేకరణ నిమిత్తం అధికారిని నియమించామని, భూ సేకరణ పూర్తయిన వెంటనే కేంద్రం ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తుందని చెప్పారు. గొట్టిపాడు, గరికపాడు, లక్ష్మీపురంలలో దళితులపై దాడులు జరగటం దారుణమని, సమాజంలో ఇలాంటివి జరగటం తిరోగమనానికి సంకేతమని కత్తి నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజధాని పక్కనే ఉన్న గొట్టిపాడులో దళితులపై దాడి చేయటం అమానుషమని, నిందితులను అరెస్ట్ చేయలేదని, ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు అక్కడికి వెళ్ళిన తర్వాత ప్రభుత్వం ఈ అమానుషంపై స్పందించిందని చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. మంత్రి ఆనందబాబు సమాధానమిస్తూ గొట్టిపాడులో దళితులపై దాడులు జరగటం దురదృష్టకరమని, ప్రభుత్వం స్పందించి నిందితులను అరెస్ట్ చేసిందన్నారు. ఈ ఘటనలో ఏడుగురు బాధితులకు ఆర్థిక సహాయం అందించామన్నారు. రాజధానికి కొత్త రైల్వే లైన్ నిర్మాణం ఏ దశలో ఉందని సోము వీర్రాజు ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ అమరావతికి కొత్త రైల్వే లైన్లు వేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ డీపీఆర్‌ను రూపొందించిందని, 106.56 కి.మీల ఈ రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.3,272.03 కోట్లు ఖర్చు అవుతుందని, దిగువ మార్గాలు ఎర్రుబాలెం-అమరావతి-నంబూరు మధ్య డబుల్ బ్రాడ్‌గేజ్ మార్గం 56.53 కి.మీలు, అమరావతి-పెదకూరపాడు మధ్య సింగిల్ బ్రాడ్‌గేజ్ 23.78 కి.మీ. సత్తెనపల్లి-నరసరావుపేట మధ్య సింగిల్ బ్రాడ్‌గేజ్ 26.23 కి.మీలు రూపొందించిందని తెలిపారు. తొలుత తామే పూర్తి చేస్తామన్న కేంద్రం ఇప్పుడు ఈ మార్గాల్లో నాలుగు శాతం నష్టాలు వస్తాయని, దీనికి తోడు ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్తోందని, ఇదెంత అన్యాయమో అర్థం చేసుకోవాలని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు సాధనకు బీజేపీ సభ్యులు కృషి చేయాలన్నారు.

రాష్ట్రంలో ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం అన్ని వర్గాల వారికి అందేలా చేస్తున్నామన్నారు. అగ్ర వర్ణాలు రెడ్లు, కమ్మ, వెలమ వర్గాలలోని పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇతర సౌకర్యాలు అందేలా చూడాలని సభ్యులు చిక్కాల రామచంద్రరావు, ఏఎస్ రామకృష్ణ, వైవీబీ రాజేంద్రప్రసాద్‌లు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది ప్రభుత్వం ఈబీసీలకు రూ.664.65 కోట్లు ఖర్చు చేసిందని, 537 మరియు 298 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చిందని చెప్పారు. కావలి పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిపై సభ్యుడు బీదా రవిచంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి 2009లో రూ.31 కోట్లతో నిర్మించేలా ఎస్టిమేషన్లు రూపొందించారని, 2012లో టెక్నికల్ శాంక్షన్ ఇచ్చారని, తర్వాత టెండర్లు పిలిచారని, బ్రిడ్జి పూర్తయింది. ఆ తర్వాత పూర్తి నిర్మాణానికి రెవెన్యూ శాఖ భూసేకరణ జరపాల్సి ఉంది. సకాలంలో భూ సేకరణ చేయకపోవటంతో అగ్రిమెంట్ చేసుకున్న కాంట్రాక్టర్ పనులను వదులుకొన్నాడు. దీంతో నిర్మాణ వ్యయం రూ.43 కోట్లకు పెరిగిందని, ఆ ఫైల్ చీఫ్ ఇంజనీర్‌కు చేరింది. అయితే ఇప్పటివరకు ఆ ఫైల్ నా వద్దకు రాలేదని, ఈ విషయంలో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వం ఉందన్న విషయాన్ని మంత్రి స్పష్టం చేశారు. దీంతో చైర్మన్ ఫరూక్ సభా సంఘాన్ని వేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో నకిలీ వీసాల ముఠాపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటని సభ్యుడు వి.వి.వి.చౌదరి అడిగిన ప్రశ్నకు హోం మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప సమాధానమిస్తూ నిడదవోలుకు చెందిన కొందరు వీసాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఘటనలు ఉన్నాయని, ఈ వ్యవహారంలో 37 కేసులు నమోదు చేసి 66 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ, చిలకలేరు డ్యామ్‌ల నిర్మాణం గురించి కరణం బలరామ్ అడిగిన స్వల్ప వ్యవధి ప్రశ్నకు మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సమాధానమిస్తూ ఆ జిల్లాలలో 993 చెక్ డ్యామ్‌లు గుర్తించామని, పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. మరికొన్ని ఎత్తిపోతల పథకాలు నిర్మించటమే కాకుండా వెలిగొండ ప్రాజెక్ట్ పనులకు ఈ ఏడాది చివరకు పూర్తి చేయనున్నామన్నారు. రాష్ట్రానికి రైల్వే జోన్ మంజూరుపై సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు, దారపరెడ్డి జగదీశ్వరరావులు అడిగిన ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ ఏపీకి కొత్త రైల్వేజోన్ ఆరు నెలల్లో ఏర్పాటు చేయాలని పునర్విభజన బిల్లులో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ కేంద్రం పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై సభలో తీర్మానం ప్రవేశపెట్టాలని డొక్కా మాణిక్యవరప్రసాద్ సూచించగా, తీర్మానాన్ని సీఎం ప్రవేశపెడతారని చైర్మన్ ఫరూక్ చెప్పారు. జీరో అవర్‌లో కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ 2004 తర్వాత ఎయిడెడ్ పాఠశాలలో నియామకాల వ్యవహారం జరగలేదని, ఎయిడెడ్ సంస్థల్లో ఉన్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి 655 జీవోను అమలు చేయాలని కోరారు. బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలను రూ.10,500కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.



అమరావతి చదువుతో అమెరికా అవకాశాలు

- వీఐటీ క్యాంపస్‌లో బీబీఏ ప్లస్ డిప్లొమా
- అమెరికన్ విశ్వవిద్యాలయంతో వీఐటీ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అమరావతి వీఐటీ ప్రాంగణంలో 2018-19 విద్యాసంవత్సరంలో మూడేళ్ల బి.బి.ఎ డిగ్రీ కోర్సును, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు యూనివర్శిటీ ఆఫ్ మిషిగాన్ డియర్‌బార్న్‌తో లెటర్ ఆఫ్ ఇంటెంట్ ద్వారా వీఐటీ ఒక అవగాహనకు వచ్చింది. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలతో, పరిశోధనా సంస్థల సహకార భాగస్వామ్యంతో వీఐటీ అమ రావతి విశ్వవిద్యాలయ ప్రాంగణ విద్యార్థులకు విదేశీ చదువుకు అవకాశాలు కల్పిస్తోందని అన్నారు. తన పిలుపుతో నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో తొలి సారి ప్రైవేటు విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ప్రారంభించి వీఐటీ -అమరావతి ప్రాంగణం ఉన్నత పథంలో ముందుకు వెళుతున్నందుకు సంతోషంగా ఉందని ప్రశంసించారు. వీఐటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొ.శేఖర్ విశ్వనాథన్ మాట్లాడుతూ బీబీఏ ప్రోగ్రామ్‌లో చేరే విద్యార్థులు వీఐటీ అమరావతి క్యాంపస్‌లో రెండు సంవత్సరాలు, మిగిలిన రెండేళ్లు యూనివర్శిటీ ఆఫ్ మిషిగాన్ డియర్‌బార్న్‌లో చదవాల్సి ఉంటుందని తెలిపారు. చదువు పూర్తయ్యాక ఆ యూనివర్శిటీ నుంచి బీబీఏ డిగ్రీ పొందవచ్చునని వివరించారు. వీఐటీ అమరావతి ప్రాంగణంలో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు యుఎంబీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసే సౌలభ్యం కలుగుతుందన్నారు. ఇక్కడ డిగ్రీ, లేదా పీజీ చేసిన విద్యార్థులకు దేశ విదేశాల్లో ఎక్కడైనా ఉద్యోగాలొస్తాయని విశ్వనాథన్ తెలిపారు.

నిధులేవీ..? (మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో చవకైన ఇళ్ల నిర్మాణం, మురుగునీటి కాల్వల నిర్మాణం, డ్రైనేజి సౌకర్యాలు తదితరాలకోసం ప్రకటించిన పథకాల్లోనూ కేటాయించిన నిధులలో 30శాతం మాత్రమే ఖర్చు చేసారు. కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు నిధులను కేటాయించినప్పటికీ గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ వాస్తవికమైన ప్రణాళికను అందచేయడంలో విఫలమైందని కమిటీ తెలిపింది. అందరికీ ఇళ్ల నిర్మాణం, బహిరంగ మలవిసర్జన నివారణ, తదితర ప్రాజెక్టుల అమలుకు తగినన్ని నిధులులేక అవి ముందుకుసాగడంలేదు. వాటి అమలుకూడా సక్రమంగా లేదని కమిటీ పేర్కొంది. అత్యధికంగా హామీలను గుర్తించి అనేక ప్రాజెక్టులను ప్రకటించారు. అయితే ఈ హామీలు, ప్రాజెక్టులు నెరవేరే అవకాశాలే కనిపించడంలేదని స్థాయీ సంఘం చైర్మన్ పినాకి మిశ్రా తెలిపారు. గొప్పగా పథకాలను ప్రకటిస్తున్నారు కానీ వాటి అమలే సక్రమంగాలేదు. ఖర్చు చేసిన నిధులకు సంబంధించి కూడా గణాంకాలు సక్రమంగా లేవు. ప్రభుత్వ యంత్రాంగం చేసే జాప్యంవల్లే ఇలా జరుగుతుందని పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం వద్ద నిధులులేకనే సక్రమంగా విడుదలచేయడంలేదని ఎప్పటినుండో చెబుతున్న మాటనే ఇప్పుడుకూడా చెబుతున్నారు. అరకొర నిధులను కేటాయించి విడుదల చేసినట్లయితే మోడీ గొప్పగా ప్రకటించిన పథకాలు పూర్తి కావడం సుదూరకలలాగే మిగిలిపోతాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం హెచ్చరించింది.

పథకాలు	కేటాయింపులు	చేసిన ఖర్చు (కోట్లలో)
స్వచ్ఛభారత్	రూ.89	రూ.3.4
స్మార్ట్ నగరాలు	రూ.150	రూ.2.8
నగరాలలో నీటిసరఫరా,		
డ్రెయిన్లకోసం ఏఎమ్ఆర్‌యుటి	రూ.130	రూ.3.8
ప్రధానమంత్రి ఆవాజ్ యోజన	రూ.150	రూ.32
దీనదయాళ్ అంత్యోదన యోజన	రూ.2.3	రూ.1.3
వారసత్వనగర అభివృద్ధి యోజన	రూ.3.8	రూ.50లక్షలు

కాల్పుల కలకలం (మొదటిపేజీ తరువాయి)

పార్క్‌ల్యాండ్‌లో మార్జోరీ స్టోన్మాన్ డగ్లస్ హై స్కూల్లో ఫిబ్రవరి 14న జరిగిన కాల్పుల్లో 17 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే. గ్రేట్ మిల్స్ హై స్కూల్‌లో 1500 మందికి పైగా విద్యార్థులున్నారు. విద్యార్థులను స్కూల్ నుంచి తరలిస్తున్నట్లు కంట్రీ అధికార ప్రతినిధి టోని జోన్స్ తెలిపారు. షరీఫ్ ఆఫీసు ఈ ఘటనపై విచారణ ప్రారంభించిందని సెయింట్ మెరీస్ కంట్రీ పబ్లిక్ స్కూల్స్ ట్విటర్ ద్వారా తెలిపింది. లియోనార్డ్ టౌన్‌లోని ఫారెస్ట్ కెరీర్ టెక్నికల్ సెంటర్‌కు విద్యార్థులను తరలిస్తున్నారు. ఈ కాల్పుల ఘటన గురించి తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమకు తమ పిల్లలను చూపించాలంటూ కోరుతున్నారు. ఎవరు ఈ ఘటనకు పాల్పడ్డారో కూడా ఇంకా తెలియరాలేదు. ఫస్ట్-పీరియడ్ క్లాస్ అయిపోయిన తర్వాత స్నేహితులతో కలిసి బయట నిల్చున్న సమయంలో తనకు ఈకాల్పుల మోత వినబడినట్టు ఓ విద్యార్థి తెలిపాడు.

మీకు బాధ్యత లేదా? (మొదటిపేజీ తరువాయి)

ఇస్తామని చెప్పింది భాజపాయే కదా, మరి ఇప్పుడెందుకు ఇవ్వరని సూటిగా ప్రశ్నించారు.. రాష్ట్రం ఇప్పుడిప్పుడే కుదుటపడే సమయంలో సహకరిస్తారనుకుంటే మిత్రపక్షం నిరాదరణకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలు సరిగ్గా అమలు చేసి వుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేదని ఆయన అభిప్రాయ పడ్డారు. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇంకా కష్టాల్లోకి నెట్టవద్దని ముఖ్య మంత్రి కోరారు. విభజన సమయంలో ప్రత్యేక హోదా పదేళ్లపాటు అడిగింది భాజపా నాయకులు వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీయే కదా ? తర్వాత ఎన్నికల సందర్భంగానూ మీరూ, మేమూ ప్రజలకు హామీ ఇచ్చాం, మరి ఇప్పుడెందుకు అమలుకు వెనుకంజ వేస్తున్నారని చంద్రబాబు బీజేపీ సభ్యులవైపు చూస్తూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని పార్లమెంట్‌లో అన్ని పార్టీలు అడుగుతుంటే విభజన హామీల అమలు అంశం చర్చకు రాకుండా అడ్డుకుంటారా ? ఇదేం పద్ధతని నిలదీశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను తాను తీసుకోలేదని, తాను అధికారంలోకి రాకముందే దాని కాంట్రాక్టు పనులను వేరేవారు చేపట్టారని చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడు పోలవరం విషయంలో కొందరు ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని సీఎం తీవ్రంగా ఖండించారు. నీతిఆయోగ్ సూచన మేరకు మాత్రమే తాను బాధ్యత తీసుకున్నానని గుర్తు చేశారు. కేంద్రమే ప్రాజెక్టు చేపడతానంటే తాను వదిలేస్తానని ఇదే సభలో గతంలో కూడా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. సున్నితమైన విషయాలపై ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాకు నాటి కేంద్రపెద్దలు చేసిన అన్యాయాన్ని సరిద్దమని కోరుతుంటే మాపై యుద్ధం ప్రకటించడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మొదటిప్రాధాన్యం వ్యవసాయానికి ఇచ్చామని, 2014-15లో వ్యవసాయ రంగంలో 3.5శాతం వృద్ధిరేటు ఉందని, దేశంలో వ్యవసాయ రంగంలో 0.2 శాతం వృద్ధిరేటు ఉందని తెలిపారు. వ్యవసాయ రంగంలో సుస్థిరతపై దృష్టిసారించినట్టు చెప్పారు. రాష్ట్రంలో 533 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, ఈ పరిశ్రమల్లో 2,64,792 మందికి ఉపాధి అవకాశాలు లభించినట్టు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగంలోనూ విస్తృతంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో 14లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించారు. కేంద్రాన్ని అడగాల్సివి అడుగుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్ళినట్లు వివరించారు. గత నాలుగేళ్లుగా డబుల్ డిజిట్ సాధించిన ఏకైక రాష్ట్రంగా ఏపీ నిల్చిందని చెప్పారు.

'పోలవరం'పనులకు రూ.1400 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నాబార్డు నుంచి రూ. 1400 కోట్లను తీసుకునేందుకు కేంద్రం అనుమతులను మంజూరు చేసింది. ఈమేరకు కేంద్రం మంగళవారం ఏపీ ప్రభుత్వంతోపాటు నాబార్డుకు ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే గ్రామీణ ఆరోగ్య మిషన్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ. 16.7 కోట్లను కూడా కేంద్రం విడుదల చేసింది.

చరిత్ర పునరావృతం : శరత్ కమల్



న్యూఢిల్లీ: కామన్వెల్త్ క్రీడల్లో చరిత్రను పునరావతం చేస్తానంటున్నాడు భారత అగ్రశ్రేణి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు ఆచంట శరత్ కమల్. 12ఏళ్ల క్రితం ఆస్ట్రేలియా వేదికగా మెల్‌బోర్న్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల సింగిల్స్, టీమ్ విభాగాల్లో శరత్ విజేతగా నిలిచి రెండు స్వర్ణాలను సాధించాడు. ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరగబోయే కామన్వెల్త్ క్రీడల్లోనూ రెండు పసిడి పతకాలను సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగుతానని పేర్కొన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో జన్మించి తమిళనాడులో స్థిరపడిన శరత్ కమల్ ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 71వ స్థానంలో ఉన్నాడు. ఇటీవల జరిగిన ఖతర్ ఓపెన్ టోర్నీలో ప్రపంచ ఏడో ర్యాంకర్ కోకి నివాకు షాకిచ్చి తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకున్నాడు. ఈ గెలుపు ఇచ్చిన ఉత్సాహంతో సత్తా చాటుతానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. 'కామన్వెల్త్‌లో ఈసారి పాల్గొంటున్న భారత జట్టు అత్యుత్తమమైనది. ప్రపంచంలో టాప్-100లో ఉన్న ఆరుగురు క్రీడాకారులు భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టోర్నీలో పోటీపడుతోన్న నాలుగు కేటగిరీల్లోనూ (సింగిల్స్, డబుల్స్, టీమ్, మిక్స్‌డ్ డబుల్స్) మనకు పతకాలు సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అని 35 ఏళ్ల వెటరన్ ప్లేయర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. నాలుగేళ్ల క్రితం జరిగిన గ్లాస్గో గేమ్స్‌లో భారత్ కేవలం ఒక రజతంతో సరిపెట్టుకుంది. ఈ క్రీడల చరిత్రలో భారత్‌కు ఇదే అత్యల్ప ప్రదర్శనని శరత్ అన్నాడు. 'కామన్వెల్త్‌లోనే మనం ఎక్కువ పతకాలు సాధించే వీలుంది. కానీ ఇంగ్లండ్, నైజీరియా ఆటగాళ్లు చెలరేగడంతో గ్లాస్గోలో భారత్‌కు నిరాశపరిచే ఫలితాలు వచ్చాయి. కేవలం ఒకే పతకంతో సరిపెట్టుకున్నాం. ఇది భారత్‌కు పతకాల పరంగా అత్యల్ప ప్రదర్శన. దీంతో గోల్డ్‌కోస్ట్‌లో పాల్గొనే బృందంపై ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. మేం దానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం సింగపూర్ నుంచి కూడా పోటీ ఎదురవుతోంది. కోచ్ మాస్సిమో కోస్టాంటిని పర్యవేక్షణలో భారత బృందం యూరోప్‌లో సన్నద్ధమవుతోంది. సెప్టెంబర్ నుంచి మా సన్నాహాలు జరుగుతున్నాయి. కచ్చితంగా ఈసారి మంచి ఫలితాలు సాధిస్తాం' అని కమల్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు.

గడ్కరీకి సచిన్ లేఖ



న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి భారత మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు సచిన్ టెండూల్కర్ లేఖ రాశారు. నాణ్యత లేని హెల్మెట్లు తయారు చేస్తున్న ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. 'నాణ్యతలేని మెటీరియల్‌తో హెల్మెట్లు తయారు చేసి వాటిపై ఐఎస్ఐ మార్కు వేస్తున్న ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోండి. క్రికెటర్‌గా నాకు హెల్మెట్‌కు ఉన్న ప్రాధాన్యత ఏమిటో తెలుసు. మైదానంలోకి బ్యాటింగ్ చేసే సమయంలో మేము భద్రత కోసం నాణ్యమైన హెల్మెట్లు వాడతాం. అంతటి నాణ్యమైన హెల్మెట్లనే ద్విచక్రవాహనదారులు ధరించాలి. దేశంలో 70శాతం మంది ద్విచక్రవాహన దారులు నకిలీ ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లనే కొంటున్నారు. ఇలాంటి సమయంలో మనం ప్రజల్ని అప్రమత్తత చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 30 శాతం ద్విచక్రవాహనాల కారణంగానే జరిగాయి. ఎంతో మంది చనిపోయారు. వారిలో హెల్మెట్లు ధరించినవారు ఉన్నారు.. హెల్మెట్ పెట్టుకున్న వారు ఎందుకు చనిపోయారంటే.. వారు ధరించింది నాణ్యమైనది కాదు. నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల తలకు గాయాలయ్యే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించండి. నాణ్యతలేని హెల్మెట్లు తయారు చేస్తున్న ఫ్యాక్టరీలపై వెంటనే చర్యలు తీసుకోండి' అని లేఖలో సచిన్ పేర్కొన్నాడు. గతేడాది ఐపీఎల్ ప్రారంభ వేడుకలకు హైదరాబాద్ వచ్చిన సచిన్ కారులో వెళ్తుండగా మార్గమధ్యంలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనం నడుపుతున్న వారిని గమనించి హెల్మెట్లు ధరించండి, ప్రాణాలు కాపాడుకోండి అని కోరిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కూడా సచిన్.. ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాలని సూచించాడు. ఇందుకు సంబంధించిన వీడియోలను సచిన్ ట్విటర్ ద్వారా అభిమానులతో పంచుకున్న సంగతి తెలిసిందే.

అరెస్టుకు సహకరించండి : హసీన్



కోల్‌కతా : టీమిండియా పేసర్ మహ్మద్ షమీని అరెస్ట్ చేసేలా సహకరించాలని అతని భార్య హసీన్ జహాన్ మీడియాకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె కోల్‌కతా మెజిస్ట్రేట్‌లో వాదనలు వినిపించే ముందు మీడియాతో మాట్లాడారు. 'నా కీర్తి, మర్యాదలను ఈ కేసులో ఫణంగా పెట్టి మరి పోరాడుతున్నాను. షమీ, అతని సోదరుడు నా పై అసభ్యంగా ప్రవర్తించినప్పటికి కుటుంబం కోసం ఇన్నాళ్లు ఓపిక పట్టాను. షమీపై పోరాటం మొదలు పెట్టినప్పటి నుంచి మీడియా నన్ను పాయింట్ అవుట్ చేస్తోంది. ఈ హింసను ఓ మహిళగా నేనెందుకు తట్టుకోవాలి? చేతులెత్తి నమస్కరిస్తున్నా.. దయచేసి ఈ కేసులో నాకు మద్దతివ్వండి. ఎందుకంటే ఇది చిన్న కేసు కాదు. ఓ మహిళా గౌరవ, మర్యాదలపై జరుగుతున్న పోరాటం. షమీ నా గౌరవ, మర్యాదలను నాశనం చేశాడు. షమీ నేరాల గురించి నేనొక్కదాన్నే గళం విప్పుతున్నాను. కానీ అతని చేతిలో మోసపోయిన అమ్మాయిలందరూ బయటకి రావడం లేదు. ఓ సెలబ్రిటీ ఇలా చేయడం సబబేనా? నిజాలు త్వరలోనే బయటకు వస్తాయి. తనపై వ్యతిరేక వార్తలు ప్రచారం చేయవద్దు. షమీని అరెస్టు చేసేలా నాకు మద్దతివ్వండి. నేనిప్పటికే చాలా భరించాను. దయచేసి నాబాధను అర్థం చేసుకొండి. నేను షమీని పెళ్లి చేసుకోకపోయినా నా జీవితం అద్భుతంగా ఉండేది. కానీ నాకు కావాల్సింది అది కాదు. నేను షమీతో ప్రేమలో ఉన్నప్పుడు కనీసం అతను జాతీయ జట్టుకు కూడా ఎంపిక కాలేదు. ఈ విషయాలన్నిటిని పరిగణలోకి తీసుకొని నన్ను పాయింట్ అవుట్ చేయడం ఆపండి' అని హసీన్ జహాన్ మీడియాను కోరింది.

దుబాయ్‌లోనే షమీ : బీసీసీఐ



ముంబై : 'ఔను.. టీమిండియా పేసర్ మహమ్మద్ షమి ఫిబ్రవరిలో రెండు రోజులు దుబాయ్‌లో గడిపాడు' అని బీసీసీఐ తెలిపింది. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం షమి దుబాయ్ వెళ్లాడని, మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి అక్కడ పాకిస్థాన్‌కు చెందిన అలిష్బా అనే మహిళ నుంచి డబ్బులు తీసుకున్నాడని షమి భార్య హసీన్ జహాన్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన కోల్‌కతా పోలీసులు షమి పర్యటన గురించి వివరాలు ఇవ్వాల్సిందిగా బీసీసీఐకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తాజాగా కోల్‌కతా పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు బీసీసీఐ జవాబులిచ్చింది. 'బీసీసీఐ నుంచి మాకు లేఖ అందింది. ఫిబ్రవరి 17, 18తేదీల్లో మహమ్మద్ షమి దుబాయ్‌లో ఉన్నట్లు లేఖలో బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. ఇక దీనిపై తదుపరి విచారణ కొనసాగిస్తాం' అని జాయింట్ సీపీ ప్రవీణ్ త్రిపాఠి తెలిపారు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ అనంతరం షమి భారత్‌కు తిరుగు పయనమయ్యాడు. వన్డే, టీ20 సిరీస్‌లకు ఎంపిక చేసిన భారత జట్టులో షమికి చోటు దక్కని సంగతి తెలిసిందే. దీంతో దక్షిణాఫ్రికా నుంచి బయలుదేరిన షమి నేరుగా భారత్ రాకుండా దుబాయ్‌లో రెండు రోజులు ఉన్నట్లు హసీన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. 'బీసీసీఐకు సంబంధించిన వారు ఎవరూ ఇప్పటి వరకు షమి కుటుంబసభ్యులను కలవలేదు. నిద్ర మాత్రలు ఇచ్చి తనను చంపేందుకు షమి కుటుంబసభ్యులు ప్రయత్నించారని హసీన్ తెలిపింది. ఆ సమయంలో హసీన్‌కు చికిత్స అందించిన వైద్యుడ్ని కలిసి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు' అని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు.

రబాదకు ఊరట



దుబాయ్ : దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు గుడ్ న్యూస్. ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో అనుచిత ప్రవర్తన కారణంగా మ్యాచ్ రిఫరీ ఆగ్రహానికి గురైన దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాదకు ఊరట లభించింది. ఆస్ట్రేలియాతో మిగతా రెండు టెస్టుల్లో బరిలోకి దిగేందుకు మార్గం సుగమం చేస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీనియర్ లాయర్ హెరాన్‌ను జ్యుడిషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రబాదపై రెండు టెస్టు మ్యాచ్‌ల నిషేధాన్ని ఐసీసీ తొలగించింది. దీనిపై విచారణ చేపట్టిన సదరు కమిషన్.. ఎట్టకేలకు రబాదకు అనుకూలంగా సోమవారం నివేదిక అందజేసింది. ఆసీస్‌తో పోర్ట్ ఎలిజిబెత్ టెస్టులో 11 వికెట్లు తీసి దక్షిణాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించిన రబాద.. ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ వికెట్ తీయగానే.. అతడ్ని భుజంతో తోసుకుంటూ ముందుకెళ్లాడు. రబాద చర్య నిబంధనలకు విరుద్ధం కావడంతో ఐసీసీ అతడికి 50 శాతం జరిమానా విధించింది. అతడి ఖాతాలో మూడు డీమెరిట్ పాయింట్లు చేర్చింది. దానిలో సఫారీ బౌలర్ ఖాతాలో 8 డీమెరిట్ పాయింట్లను దాటడంతో అతడిపై రెండు టెస్టుల నిషేధం విధించింది. దీనిపై రబడగా ఐసీసీకి అప్పీల్ చేసుకోగా న్యూజిలాండ్‌కు చెందిన జ్యుడీషియల్ కమిషనర్ మైకెల్ హెరాన్ కమిషనర్‌గా నియమించింది. రబాదకు విధించిన డీమెరిట్ పాయింట్లను మూడు నుంచి ఒకటికి తగ్గించారు. దీంతో అతడు మిగతా టెస్టుల్లో బరిలో దిగడానికి మార్గం సుగమమైంది. అదే సమయంలో మ్యాచ్ ఫీజులో విధించిన కోతను సైతం 50 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు.



చెన్నై : టీం ఇండియా కీపర్, బ్యాట్స్‌మెన్ దినేశ్ కార్తీక్ ఒకే మ్యాచ్‌తో ప్రతి భారతీయ క్రికెట్ అభిమాని మనసు దోచుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన నిదహాస్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి అంచున నిలబడిన జట్టుకు అండగా నిలిచి విజయాన్ని కట్టబెట్టాడు. దీంతో దినేశ్ ఓవర్‌నైట్ స్టార్ అయిపోయాడు. 14 ఏళ్లుగా భారత్ జట్టులో ఉన్నప్పటికీ.. దినేశ్‌కు ఆడేందుకు అవకాశం ఎక్కువగా రాలేదు. కానీ దొరికిన అవకాశాన్ని మాత్రం అతను సద్వినియోగం చేసుకున్నాడు. అయితే నిదహాస్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ తర్వాత దినేశ్ కార్తీక్ సరికొత్త చర్చకు తెరతీశాడు. ఇండియా జట్టులో వికెట్ కీపర్‌గా దినేశ్ కార్తీక్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని క్రికెట్ విశ్లేషకులు, అభిమానులు భావిస్తున్నారు. ఇప్పట ివరకూ టీం ఇండియాకు బెస్ట్ ఫినిషర్ అంటే ముందుగా వినిపించే పేరు జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీదే. అయితే కొంతకాలంగా ధోనీ భారీగా స్కోర్ చేయలేక పోతున్నాడు. గతంలోలా దూకుడుగా ఆడలేకపోతు న్నాడు. దీంతో ధోనీ స్థానాన్ని కార్తీక్‌తో భర్తీ చేయాలని సోషల్‌మీడియాలో చర్చ ప్రారంభమైంది. కార్తీక్ గత ఆరు మ్యాచుల్లో 50(నాటౌట్), 37, 64(నాటౌట్), 4(నాటౌట్), 0, 29(నాటౌట్) పరుగులు చేశాడు. అంతేకాక డొమెస్టిక్ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌లలో 20వేల పరుగుల మైలురాయికి చేరువలో ఉన్నాడు. కానీ కార్తీక్‌కు పెద్దగా అవకాశం ఇచ్చే ఆలోచన కూడా మెనేజ్‌మెంట్ చేయడం లేదు. ఇప్పుడు కార్తీక్ తన సత్తా నిరూపించుకోవడంతో అతన్ని జట్టులోకి తీసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొందరు సీనియర్, మాజీ క్రికెటర్లు కూడా ధోనీ స్థానాన్ని కార్తీక్‌తో భర్తీ చేయాలని భావిస్తున్నారు. టీం ఇండియా మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ సెలక్షన్ కమిటీ చైర్మన్ కృష్ణమాచారి శ్రీకాంత్ మాట్లాడుతూ.. "అంత ఒత్తిడిలో కూడా కార్తీక్ అంత ప్రశాంతంగా ఆడటం ఎంతో గొప్ప విషయం. ఇంతకాలం కార్తీక్ మంచి బ్యాట్స్‌మెన్ మాత్రమే తెలుసు కానీ అతను ఓ గొప్ప ఫినిషర్ కూడా అని నిరూపించుకున్నాడు" అని అన్నారు. ఇంకొందరూ మాజీలు, సీనియర్లు కూడా కార్తీక్ ప్రదర్శన అద్భుతంగా ఉందని అభినందించారు. ఇక కార్తీక్‌ని బెంచ్‌కి పరిమితం చేయొద్దని, అతనికి తగిన అవకాశాన్నిచ్చి.. ప్రతిభను సద్వినియోగం చేసుకోవాలని అంటున్నారు. మరి ఇకనైనా కార్తీక్‌కు జట్టులో తగిన అవకాశాలు వస్తాయో.. లేదో వేచి చూడాల్సిందే.

> ఒక్క మ్యాచ్‌తో వెలుగులోకి వచ్చిన దినేశ్ కార్తీక్
> పొగడ్తలతో ముంచెత్తుతున్న మాజీలు
> ధోనీని తప్పించాలంటూ సూచనలు

నేడు చలో అసెంబ్లీ

వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధిహామీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరుతూ బుధ వారం నిర్వహించే 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, జల్లి విల్సన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉపాధిహామీ చట్టాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కేంద్రం కూడా సక్రమంగా నిధులు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. ఇప్పటికే చేసిన పనికి నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంతవరకూ రూ. 456 కోట్ల వరకూ బకాయిలను చెల్లించాల్సి ఉందని తెలిపారు. కూలీలకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడలో నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమానికి వస్తున్న కూలీలు, నాయకులను భయభ్రాంతులు చేస్తూ మందస్తు అరెస్టులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. టీడీపీ నియంతృత్వ విధానాన్ని విడనాడాలని వారు హితవుపలికారు.

23న విప్లవవీరుల వర్ధంతి

విప్లవవీరులు సర్దార్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 87వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విద్యార్థి సమాఖ్యల సంయుక్త ఆధ్వర్యంలో 23న కార్యక్రమాలను నిర్వహించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరపాలన్నారు. ఇదే రోజు సాయంత్రం రాష్ట్ర ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించాలని కోరారు.

జీడీపీకి బ్యాంకు స్కామ్‌ల ఎఫెక్ట్..!

ముంబై : భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిపై బ్యాంకుల కుంభకోణాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని పెట్టుబడుల బ్యాంకు గోల్డ్‌మ్యాన్ శాచెస్ అంచనా వేసింది. 2018-19లో జీడీపీ వృద్ధిపై అంతకుముందు తాను సూచించిన అంచనాను తగ్గించింది. ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు దాదాపు రూ.11,400 కోట్ల మేరకు మోసానికి గురికావడంతో బ్యాంకింగ్ రంగంలో రుణాల వృద్ధిని పరిమితం చేసే కఠినమైన నియంత్రణలు అమల్లోకి రావచ్చునని హెచ్చరించింది. జీడీపీ 8శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని గతంలో సూచించిన సంస్థ తాజాగా దీనిని 7.6 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులపై మొండి బాకీల భారం పర్వతాల మాదిరిగా ఉంది. మరోవైపు కుంభకోణాల బారిన పడిన బ్యాంకుల సంఖ్య పెరుగుతోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకుతో సహా మరికొన్ని చిన్న బ్యాంకుల్లో కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి.

పీఎంఏవై-ఎన్‌టీఆర్ పథకం

పట్టణాలకు 23,962 ఇళ్లు

> ఒక్కో యూనిట్‌కు రూ.3.50 లక్షలు
> కేంద్ర సబ్సిడీ రూ.లక్షన్నర, రాష్ట్ర సబ్సిడీ రూ.లక్ష

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : ప్రధానమంత్రి ఆవాస్ యోజనా (పీఎంఏవై), ఎన్‌టీఆర్ పట్టణ గృహనిర్మాణ పథకం కింద రాష్ట్రంలోని 13 పట్టణాలకు 23,962 ఇళ్లు మంజూరయ్యాయి. 2017-18కు ఈ ఇళ్లను మంజూరు చేస్తూ గృహనిర్మాణశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి కాంతిలాల్ దండే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.838.67 కోట్ల వ్యయంతో పట్టణ ప్రాంతాల్లో ఈ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిని రూ.3.50 లక్షల వ్యయంతో నిర్మించనుండగా, అందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష సబ్సిడీ ఇవ్వనున్నాయి. మిగిలిన మొత్తంలో లబ్ధిదారులు రూ.25 వేలును భరిస్తే, బ్యాంకుల నుంచి రూ.75 వేలు రుణం లభిస్తుంది. ఇప్పటికే పీఎంఏవై-ఎన్‌టీఆర్ పట్టణ గృహనిర్మాణ పథకం కింద రాష్ట్రానికి రెండు దశలలో 1.76 లక్షల ఇళ్లు మంజూరవ్వగా, తాజాగా మరో 23,962 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారుడే సొంతంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టే విధంగా ప్రభుత్వం గైడ్‌లైన్స్‌ను రూపొందించింది. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఈ పథకం కింద ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఆయా మున్సిపల్ కమిషనర్లు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రూ.3.50 లక్షలతో ఈ ఇళ్లను 323 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం రూ.838.67 కోట్లలో కేంద్ర ప్రభుత్వం రూ.359.43 కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం రూ.239.62 కోట్లను సబ్సిడీగా ఇవ్వనుండగా, లబ్ధిదారులు రూ.59 కోట్లను భరించాల్సి ఉంది. మిగిలిన మొత్తం రూ.179.72 కోట్లను లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణంగా ఇప్పిస్తారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తక్షణమే లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ప్రభుత్వం సూచించింది.

జిల్లాపేరు	పట్టణం	మంజూరైన ఇళ్లు
విశాఖపట్నం	జీవీఎంసీ	8,000
విశాఖపట్నం	యలమంచిలి	1,465
విశాఖపట్నం	నర్సీపట్నం	2,151
పశ్చిమ గోదావరి	తాడేపల్లిగూడెం	671
ప్రకాశం	మర్కాపురం	157
ప్రకాశం	చీమకుర్తి	342
నెల్లూరు	నెల్లూరు	2,518
చిత్తూరు	చిత్తూరు	1,341
అనంతపురం	గుంతకల్	2,015
అనంతపురం	రాయదుర్గం	609
కర్నూలు	ఎమ్మిగనూరు	1,511
కర్నూలు	గూడూరు	1,142
కర్నూలు	డోన్	2,040
మొత్తం		23,962

కోహ్లికి ఇన్‌స్టాగ్రాం అవార్డు



ముంబై : భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లికి ఇన్‌స్టాగ్రాం అవార్డు దక్కింది. ప్రముఖ సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రాం తాజాగా కొన్ని అవార్డులు ప్రకటించింది. అందులో 'మోస్ట్ ఎంగేజ్డ్ అకౌంట్' అవార్డును కోహ్లి సొంతం చేసుకున్నాడు. 2017 ఏడాదికి గాను ఇన్‌స్టాగ్రాం ఈ అవార్డులను ప్రకటించింది. కోహ్లి సామాజిక మాధ్యమాల్లో ఎంత చురుకుగా ఉంటాడో అందరికీ తెలిసిందే. ఎప్పటికప్పుడు విశేషాలను ట్విటర్, ఇన్‌స్టాగ్రాం ద్వారా పోస్ట్ చేస్తూవుంటాడు. గత ఏడాది డిసెంబరులో బాలీవుడ్ నటి అనుష్క శర్మను వివాహం చేసుకున్న విషయం కూడా కోహ్లి సామాజిక మాధ్యమాల ద్వారానే వెల్లడించిన సంగతి తెలిసిందే. కోహ్లి ఇన్‌స్టాగ్రాం ఖాతాకు సుమారు 2 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. తాను పెట్టిన ప్రతి పోస్టుకు లక్షల్లో లైక్‌లు వస్తుంటాయి. ఎక్కువ లైక్‌లు, కామెంట్లు వచ్చే ఖాతాకు ఇచ్చే 'మోస్ట్ ఎంగేజ్డ్ అకౌంట్' అవార్డును కోహ్లికి దక్కింది.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రాక్టీస్ షురూ..!



కోల్‌కతా: మరో కొద్ది రోజుల్లో ఐపీఎల్ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు ఫ్రాంఛైజీలు అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాయి. తాజాగా కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా ప్రాక్టీస్ సెషన్స్‌ను మొదలెట్టేసింది. జాధవ్‌పూర్ యూనివర్సిటీలోని మైదానంలో ఆటగాళ్లు కసరత్తులు చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన వార్మప్ సెషన్స్‌లో వైస్ కెప్టెన్ రాబిన్ ఉతప్ప సహా 11 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. వీరిలో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సభ్యులు శుభ్‌మన్ గిల్, నాగర్‌కోటి, వినయ్ కుమార్, ఇషాంక్ జగ్గీ తదితరులు ఉన్నారు. గౌతమ్ గంభీర్ సొంత జట్టు ఢిల్లీకి వెళ్లిపోవడంతో ఆ స్థానంలో దినేశ్ కార్తీక్ నాయకత్వ బాధ్యతలు అందుకున్న సంగతి తెలిసిందే. త్వరలో కార్తీక్ కూడా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటాడని ఫ్రాంఛైజీ నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ ఏప్రిల్ 7న ప్రారంభంకానుంది. టోర్నీలో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తన తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. ఏప్రిల్ 8న కోల్‌కతా వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.

దినేశ్.. మై సూపర్ హీరో : దీపిక



ముంబై : నిదహాస్ ట్రోఫీలో చివరి బంతిని సిక్స్ బాది భారత్‌కు అనూహ్య విజయాన్నందించిన టీమిండియా వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్‌పై సోషల్ మీడియా వేదికగా అభిమానులు, మాజీ క్రికెటర్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. అయితే కార్తీక్ ప్రదర్శనపై అతని సతీమణి భారత స్టార్ స్క్వాష్ క్రీడాకారిణి దీపికా పల్లికల్ ఆనందం వ్యక్తం చేశారు. మ్యాచ్ అనంతరం టీవీలో కనిపిస్తున్న దినేశ్ కార్తీక్ ఫొటోపై 'మై దాదా మై సూపర్‌హీరో' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఇక మరో పోస్ట్‌లో కార్తీక్ ఫొటో లవ్‌సింబల్స్‌తో తన ప్రేమను చాటుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్‌లు అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఇక సూపర్ సిక్సుతో సూపర్ స్టార్ అయిన దినేశ్ కార్తీక్ తొలుత చిన్ననాటి స్నేహితురాలు నిఖితను పెళ్లి చేసుకున్నాడు. అనుకొని కారణాలతో 2012లో ఆమెతో విడిపోవాల్సి వచ్చింది. తర్వాత నిఖితను భారత క్రికెటర్ మురళీ విజయ్ పెళ్లి చేసుకున్నాడు. అనంతరం కార్తీక్... దీపికా పల్లికల్‌ను 2015లో ప్రేమ వివాహం చేసుకున్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.